శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును

సంపుటము ౭	చెన్నపురి హేవిళంబి సంవత్సర మాఘ, ఫాల్గున మాసములు	సంచిక 8,9

ఘటకులు

వంగదేశమునందు ఘటకులను పేరితో వివాహసంబంధములను కుదిర్చెడి యొక తెగవారుండుచువచ్చిరి అట్టి తెగవారిప్పుడును గొంద ఱందందుఁ గలరుగాని వారి సంఖ్యయిప్పు డంతకంతకు తగ్గిపోవుచున్నది ఈఘటకులు పూర్వకాలమునం దించుమించుగా పురోహితులతో సమానముగా గౌరవింపఁబడి, కుటుంబగౌరవమును నిలుపువారుగా నెంచఁబడుచుండిరి వీరు ప్రతికుటుంబము యొక్కయు చరిత్రమును వెనుకటి యిరువది తరములవఱకును వ్రాసియుంచుకొని వా రేయేకుటుంబములతో సంబంధబాంధవ్యము లెప్పు డెప్పుడు చేయుచు వచ్చిరో చెప్పసమర్థులై యుండిరి ఒక్కకుటుంబముయొక్క సంగతి యాకుటుంబములో చేరినవారి కంటెను వీరికే యధికముగా తెలిసియుండును అందుచేల నెల్లవారును దా మేయేకుటుంబములవారితోను ఏయే తెగలవారితోను తమ గౌరవమున కర్హమగునట్లుగా సంబంధము చేయవచ్చునో నిర్ణయించుకొనుటకు వీరినే నమ్ముకొనియుండిరి వీరు వేఱువృత్తిలేక దేశసంచారము చేయుచు సంబంధములు కుదుర్చుచు వివాహ సమయములయం దియ్యఁబడు బహుమానములతో సుఖజీవనము చేయుచుండిరి ఇంగ్లీషువిద్య దేశమునందు ప్రబలఁజొచ్చిన తరువాత వీరివృత్తికిప్పుడు భంగము కలిగినది ఇప్పుడు పుత్రికలను గలవారు వివాహసంబంధమును జూచునప్పుడు పూర్వుల గౌరవమును విచారింపక వరునియొక్క

విద్యను జూచుచున్నారు ఈనూతనవరాన్వేషణ మార్గమువలన బంగాళాదేశమునం దిప్పుడు ఘటకులతో పనిలేకపోయినది సాధారణముగా చదువుకొన్నవరులు వెతకఁబడుచున్నందున వారి విద్యాతారతమ్యమునుబట్టి వరులవెల భేదపడుచు, ప్రవేశపరీక్ష మొదలుకొని పట్టపరీక్షవఱకును గృహస్థు లయినవారివెల యిప్పటి కేనూఱురూపాయలు మొదలుకొని మూడువేల రూపాయలవఱకును నిలిచియున్నది ఇప్పటి స్థితిని బట్టిచూడఁగా వరులవెల యింకను హెచ్చుగునట్లు సూచనలు కనఁబడుచున్నవి అందుచేత కౌమారితలను గన్నవారియవస్థ యిప్పటికే దుస్సహమయి, ఇద్దఱుముగ్గురు కౌమారితల వివాహముతో ననేకకుటుంబములు ఋణములపాలయి పాడగుచున్నవి బంగాళాదేశమునం దున్నంతయధికముగా లేకపోయినను, ఈస్థితియే యిప్పుడీయాంధ్ర దేశమునకును పట్టుచున్నది అయినను వంగదేశమునం దీకీడువలనను గొంత మేలు కలుగుచున్నది పూర్వకాలమునం దెనిమిదేండ్ల లోపలనే కన్యలకు వివాహములు చేసెడివారు తగినవరులు దొరకక తమకూఁతులను పండ్రెండు సంవత్సరములప్రాయము వచ్చువఱకును నిలిపియుంచుచు వచ్చుటచేత కొంతవఱకు అతిబాల్యవివాహములు తగ్గుచున్నవి అంతేకాక చదువుకొన్న వరులనేకులు తమకు విద్యావతులయిన భార్యలు కావలెనని పట్టుపట్టుచు వచ్చుచుండుటచేత బాలికావిద్యాభివృద్ధియు నగుచున్నది ఏతత్కాలమున విద్యావతులగు కూఁతులఁగలవా రల్లురకియ్యవలసిన వరశుల్కము సహితము పెక్కుచోట్ల తగ్గుచున్నది అతి బాల్యవివాహములు తగ్గిపోయి స్త్రీవిద్య హెచ్చి వరశుల్క దురాచారము శీఘ్రకాలములోనే నశించునుగాక !

Science Paper Series No. 9.

Movements of the Land.*

భూ చ ల న ము లు

అగ్నిపర్వతములవలన భూమియొక్క అంతర్భాగమునుండు ద్రవ్యముల స్వభావము తెలియవచ్చుచున్నది ఈయగ్నిపర్వతములవలననే కాక తరుచుగ భూభాగముపై గోచరంబగు చలనముల మూలమునఁ గూడ అంతర్భాగమునుండు ద్రవ్యములత్యుష్ణమును పొందియుండునని స్పష్టపడును ఇట్టి భూచలనములలో ముఖ్యమయినవి దరుచుగఁ బ్రజానాశనము గల్గఁజేయునట్టి భూకంపనములు భూకంపము గల్గినపుడు కొన్నిచోట్ల భూమి బీటలుదీసి ఇండ్లను వృక్షములను మ్రింగివేయును మరికొన్ని

చోట్ల భూమి క్రిందికి దిం మకొని పోవుటయు, ఇంకను వేరుచోట్ల భూమి ఉన్నతముగఁ బైకలేచుటయు కూడ తటస్థించును

భూచలనములు సాధారణముగ మూడువిధములుగ నున్నవి (1) భూకంపము (Earth Quakes) (2) భూమి పైకిలేచుట (Upheaval) (3) భూమి క్రిందికి దిగి పోవుట (Subsidence)

EARTH QUAKES

భూకంపములలో ననేక భేదములు కలవు వినిలో కొన్ని సామాన్యములుగను మరికొన్ని యతి దారుణములుగను ఇంకనుకొన్ని అతి స్వల్పములుగను గూడనుండును, దారుణమైన భూకంపము గల్గినపుడు మహోపద్రవము లనేకములు సంభవించును వీనివలన వృక్షములును ఇండ్లును జంతువులును వేలకొలది నశించుటకలదు

మన కెంతమాత్రమును తెలియకుండఁగనే ఉరుము ఎంటిధ్వని యొకటి వినఁబడి ఒకరితోనొక రిట్టిధ్వని వినియుమై ప్రశంసించుటకైన వీలులేకుండ నతి శీఘ్రమున భూమి కంపించును జరుగునది యేమో తెలియక నడచుచుండు బాటసారులు తమ కడుగుననున్న భూమి యదుగంటుట కనిపెట్టుదురు పెద్దపెద్ద యిండ్లు సయితము ముందునకును వెనుకకును ఊగుచుండును ఒకానొకప్పు డట్టి యిండ్లు పగిలి నాశనము పొందుటయుఁ గూడఁ గలుగును భూమి యక్కడక్కడ బీటలుదీసి తిరుగ మూసికొని పోవును ఇట్లు 1755వ సంవత్సరమున లిజ్బన్ (Lisbon) పట్టణమున గలిగిన మహా భూకంపమువలన అరువదివేల జనులవరకును నశించిరి ఇంతకు ముప్పది సంవత్సరములకు వెనుక సంభవించిన యింకొక మహా భూకంపమువలన నలువదివేలమంది మనుష్యులు నశించిరి ఈభూకంపములవలనఁ గలుగు ఉపద్రవము లొక నిర్ణయమైన స్థలముననేగాక విస్తీర్ణమైన దేశములందంతటఁ గూడసంభవించును భూకంపమెన్నడుగాని సమకాలముననే యన్ని స్థలముల గోచరముకానేరదు మొదట నెక్కడనో యొకస్థలమున నుత్పన్నమై క్రమముగ తగ్గుచు పలుదిక్కుల ప్రసరించును సాధారణముగ ధ్వని వినఁబడిన వెంటనే కంపముగలుగును సముద్ర తరంగముల చలనముంబోలి భూమి క్రిందికిని పైకని అల్లలనాడును

భూభాగ మొకానొకప్పు డిట్టి కారణములచే విస్తరించి పగులును అందువలన విరివియైన రంధ్రము లేర్పడును ఈరంధ్రములు తెరచికొని యుండునపుడు చెట్లుమొదలగునవి క్రుంగిపోవును కాలక్రమమున నిట్టి రంధ్రములు లోయలుగను పర్వతపు కనుమలుగను ఏర్పడుచుండును

ఇదియునుగాక భూమి కంపించినపుడు కొన్ని స్థలములు పైకిలేచి ఉన్నతత్వ మును చెందును 1835వ సంవత్సరమున ఛిల్లీ (Chilli) దేశమున గల్గిన మహా భూకంపమువలన సాంతామారియా (Santa Maria) అను దీవి నీటిమట్టమున కెత్తుగ పది యడుగులులేచినది 1811-1812వ సంవత్సరములలో మిసిసిపి (The Mississipi) నదీ ప్రాంతముల సంభవించిన భూకంపమువలన భూమి క్రిందికి దిగిపోయి గొప్పగొప్ప తటాకములఁ గల్పించెను ఈచెరువులలో కొన్ని మిక్కిలి పెద్దవిగూడ నున్నవి వాని లో నొకదాని చుట్టుకొలత ఏఁబదిమైళ్ళకన్న నెక్కువగ నున్నది ఇప్పటికిని ఆచెరువుల నీటిమట్టమునకు నాలుగైదు యడుగులలోతున పూర్వ మదుగంటిన, అక్రోట, కంబళి, సిదూరి, యీమొదలగు చెట్లకొనలను సులభముగఁ గనిపెట్టవచ్చును ఒకప్పుడీ చెట్లకొనల మధ్య దగులుకొనుటచే సామాన్యపుదోనెలు తొట్రుపాటు పడును

సముద్రమునకడుగుననున్న భూమి చలించినపుడు అన్నిటికన్న నమితమైన యాపదలు సంభవించును ఆసముద్ర ప్రాంతముననున్న భూమిముందుగ తొట్రుపాటు పడును భూభాగముపై క్రమముగ చలనము ప్రసరించును ఇంతియగాక తత్సముద్ర జలమంతియు నతివేగమున కదలి పొంగుపడి అతి భయంకరమగు చలన బలము గలదై ప్రాంతముల యందున్న భూమిపై ప్రవహించి తీరని యుపద్రవములు పుట్టించును ఇట్టి యాపదలు రాఁబోవుసమయమున నొడ్డుననున్న సముద్ర జలము అకస్మికముగ వెనకకు మళ్లి సముద్రమధ్యముననున్న జలముతో కలసి అనేకములైన యడుగులయెత్తుగలేచి భూమిపై ప్రవహించి యమిత నాశనము కలుగఁజేయును సముద్రతీరమున దగ్గరగనుండు జలమాకస్మికముగ విస్తారదూరము వెనుకకు మళ్ళుటవలన నక్కడ నివసించి యున్న జనులిట్టి యాపద దమకు సంభవించునని దెలిసికొందురు భూభాగమున కంపము ప్రసరించినటుల (అనగా అంతత్వరలో) జలభాగమున భూకంపము ప్రసరింపఁజాలదు అందువలన భూకంపము మొదలఁ గల్గుటయు, అటువెనుక జలము పైకిలేచి భూమిపై నాశనము గలుగుటయు సంభవించుచున్నది ఇందుల కుదాహరణముగ రండుమూడు నిదర్శనముల నీక్రిందఁ బొందు పరచుచున్నాము

1755 వ సంవత్సరమున లిజ్ బన్ (Lisbon) పట్టణమున, భూభాగముపై కంపము గలిగిన కొంత సమయమునకు సముద్రముకూడ లేచి ప్రజానాశనము చేసెను ఈసంవత్సరముననే ఆగష్టు 13 వ తారీఖున పెరూ, ఈక్వెడారు (Peru and Ecuador) అను దేశములయందు నిట్లె భూకంపము కల్గిన వెనుక సముద్రములేచి యుద్ధనావలను పొగయోడలను సముద్రమునుండి లేవనెత్తి భూభాగమున రెండు మూడుమైళ్లదూరమున పారవైచెను 1883 వ సంవత్సరమున క్రాకటౌ (Krakatau)

అను ప్రదేశమునఁగల్గిన కంపమునలన సముద్రజలము నూరడుగులయెత్తువరకులేచి సండా (Sanda) జలసంధి గుండపారి నలువదివేల జనులను నాశనముచేసెను

భూకంపము లెట్టికారణములవలనఁ గలుగుచున్నవో పూర్ణముగఁ దెలియక పోయినను వాని విషయమై కొంచెమిక్కడ ముచ్చటించుదము అగ్నిపర్వత ప్రాంతములయందుండు భూమికి అంతర్భాగమున గుహాలవంటి రంధ్రములుండును ఇట్టి గుహాలకు పైనున్న కప్పువిచ్చినపుడును, భూమిలోపల మిక్కిలి యణపఁబడుచున్న పర్వతము లేవైన నాకస్మికముగ పగిలినపుడును, ఏదైన కారణమువలన లోపలనున్న నీరు ఆవిరియగుచుఁ బైకి బలముగలేచునపుడును, భూకంపములుగలుగు నన్నమాట మాత్రము నిశ్చయము కారణమేదైనను, అంతర్భాగమున నేదో యొకకఠినమైన యదటు కలిగినంగాని ఇట్టి కంపములు పుట్టఁజాలవు అట్టి దబ్బకు నిబ్బరముగ పైనుండు భూమి యధిక కంపమునకు లోనగును కాని ఈచలనము మూలమూలలకు పోయిన కొలది దాని బలము క్రమక్రమముగ తగ్గుచుండును

కంపముగలిగిన వెనుక ఇండ్లయందును గోడలయందును కనుపడు బీటల యాసవాళ్లనుబట్టి గొంతివరకు భూకంపము యొక్క గమనమార్గమును కనిపెట్టవచ్చును

SLOW UPHEAVAL

భూకంపమువలనఁగాక యితర కారణములవలనఁగూడ మందమందముగ భూమి పైకి లేచుచుండును జాగరూకతతో ప్రపంచ స్వరూపమును బరిశీలించినపుడిందులకు నిదర్శనముగ ననేక సంగతులు కనిపెట్టవచ్చును కొంతకాలమునకు పూర్వముననే జలభాగములందుండు ఓడబోదులు (Harbours) మొదలగునవి క్రమక్రమముగ భూమి పై నెత్తుగలేచుచుండును ఇదివరలో నీటిచే భేదింపఁబడిన ద్వీపము లిప్పుడేకమై భూభాగముననేయుండును నీటివలనఁ గలిగి నీటిలోపలమునిగియుండు పర్వతగుహాలు మొదలగునవి నీటిమట్టముపై నెగసె భూభాగమున నున్నతముగ నిలిచియుండును సముద్రపుఒడ్డు క్రమముగ పైకిలేచుచుండుటచేతనే పూర్వమున నీటిలోమునిగియున్న జలచరముల యెముకలు మొదలగునవి బయటపడియుండును ఇట్లు (Sweedon) దేశమునందుండు స్టాకుహోము (Stolkhom) అను పట్టణపు సముద్రతీరము నూరు గజముల దూరములోపల పదియంగుళముల ఎత్తువరకు లేచుచున్నది ఇంతకంటె ఉత్తరముననున్న స్పిట్జుబర్గెన్ అను దీవిలో నూటనలువది ఏడుఅడుగుల ఎత్తువరకును లేచినట్లు ఆనవాళ్లు నాతీరమునందుచూచుచున్నాము ఇదియునుగాక ఆఫ్రికా

(Africa) ఖండమునను్న సహారా (Shahara) యను గొప్పయెడారియందు కొన్ని కొన్ని స్థలముల తొమ్మిదివందలయడుగుల ఎత్తువరకునుగూడ జలచరముల బొమికలు గన్పించుచున్నవి దీనినిబట్టిచూడఁగా సహారాయెడారి చాలకాలమువరకును సముద్రమున మునిగియుండినటుల స్పష్టమగుచున్నది

SLOW SUBSIDENCE

కొన్ని ప్రదేశములందు భూమిక్రమముగ సముద్రపుమట్టమునకు లోతుగ క్రిందికి పోవుచున్నది స్వీడన్ (Sweedon) దేశమునకు దక్షిణతీరములందుండు ంవు స్థలములయొక్క వీధులకడుగున ఇండ్లు మొదలగునవియుండి నటుల కనిపెట్టఁబడినది ఇట్లే స్కాట్లాండు సముద్రతీరమునఁగూడ నీటికడుగున గొప్పగొప్పమానుల మొదళ్లుచూడఁబడినవి ఇట్లు భూమిక్రందికి పోవుననుటకు ముఖ్యనిదర్శనములు ప్రవాళ సంబంధములైన రాతిగట్లని మొన్నమొన్నటివరకును శాస్త్రజ్ఞు లూహించుచుండిరి ఇప్పటికినిగూడ వేరొండుకారణమువలన నవి గలుగుచుండినటుల ఋజువుపరుపఁబడలేదు ఈరీతిగట్లు (Coral reefs) ముఖ్యముగ మూడు విధములుగనున్నవి

మొదటి తరగతివి—ఇవి సముద్రమధ్యమునందుండు భూభాగపు అంచునకు రెండు మూడు మైళ్లదూరమున చుట్టును గట్టుగ నేర్పరచుచున్నవి భూమికని ఈరాతిగట్టునకును మధ్యనుండు జల మంతలోతుగనుండ నేరదు ఈజాతిగట్లు ఆఫ్రికాతీరమునను, బ్రెజీలుతీరమునను, పడమటి యిండియాదీవులలోనను విస్తరించియున్నవి

రెండవజాతివి— ద్వీపమునకు చుట్టునుగాని సముద్రతీరమునకు అంటియుండిగాని యీగట్లుబయలు దేరును ఈగట్లకును భూమికని మధ్యనుండు జలములోతుగనుండును

మూడవజాతివి— పైనుదాహరింపఁబడిన రెండుజాతులును భూమిక సమీపమునను దాని నంటియుండియు లేమను కాని మూడవదిగగతి ప్రవాళపుగట్లు మిక్కిలి లోతైన మహాసముద్ర మధ్యమునఁగలుగుచున్నవి కొంచెపుదూరమునునుండి చూచినవి గుండ్రముగ నుంగరమువలెనుండు చిన్నదీవులవలెఁ గనిపించును ఇవికూడ ప్రవాళపుగట్లేకాని మరియొకటికాదు (Atoll or coil islands) ఈగట్లు ఉంగరములఁ బోలియుండి కొద్దిపాటి విరివిగలవైయుండును ఉంగరపుమధ్యమున కొద్ది నీరుండినను వెలుపల మిక్కిలి లోతుగను అపాయకరముగను ఉండును ఇందులప్రవాళములు పుట్ట పెరుగుచున్నవి ఈపైనుదాహరింపఁబడిన ప్రవాళపుగట్ల నిర్మాణమును బరిశీలించినచో భూమిక్రమముగ సముద్రమునకు క్రిందుగ పోవుచుండు నన్నమాట స్పష్టమగాక మానదు ప్రవాళము లెన్నడుగాని మిక్కిలి లోతైన నీళ్లలో పెరుగవు ఇరువది బారల

లోతు కన్న నెక్కుడు లోతున పెరుగుట యసాధ్యమని చెప్పవచ్చును మొదటి జాతిప్రవాళపు గట్లనుబట్టిచూడ భూమిక్రిందికి పోవుటచే గట్టేర్పడినట్టును అందు వలననే మధ్యనుండు నీరు కొద్దిపాటి లోతుగలిగియుండుననియు, తెలియుచున్నది ఈభూమి మరికొంత లోపలికి పోయినంగాని మధ్యనున్న నీరు లోతుగానేరదు అట్లు జరుగునపుడే రెండవజాతి గట్లేర్పడును భూమి మిక్కిలి లోతుగపోయినప్పుడే ప్రవాళపు దీవిఏర్పడును ఇదియే మూడవజాతిది

OUR GENTLEMEN

ఎంచరత్నములు

సీ. ప్రజలకుసౌఖ్యంబు పలుమారుచేసెదనని చెప్పిచేసెడు నరుఁడెవండు
నిర్దోషియగుమని నిర్ణయించుటగాని నియమంబుతప్పక నిలుచునెవఁడు
ధనికులకును మాట దానంబెయగు ననుప్రకటన పాటించుప్రాజ్ఞుఁడెవఁడు
వేత్తలమని చాల విఱ్ఱవీఁగుటగాని విద్యను బోషించువిబుధుఁడెవఁడు
ఏమి యీగతి మనలకు నేలపుట్టె
ముందుముందున కింతకు మొనసిమొనసి
కానిఘాతలిఁకేమిగలుగఁబోనో
యీశ్వరవిలాసమిది సుమ్మి యెంచిచూడ

సీ. పైఁనిజూచినయెడఁ బసిఁడి వన్నెలుగాని విప్పిచూచినఁయెడ విషపుపుచ్చె
వాక్కున నమృతంబు వఱలుచుండునుగాని హాలాహలం బెదయందునుండు
వేషభాషలకెల్ల విశ్రుతభాగ్యముకాని కదలించిచూచినఁ గందిరీఁగ
చిఱునవ్వునవ్వుచుఁ జెలఁగుచుండునుగాని దూరంబుపోయిన దుష్టబుద్ధి
యిట్టిక్రూరులె పొందుదు రీశమహిమ
కీడు సేసియు నెప్పుడుఁ గీర్తిమిగుల
నట్టిమనుజులు మనలకు నాఖ్యలయిరి
యీశ్వరవిలాసమిది సుమ్మి యెంచిచూడ

సీ. ధనలోలుఁడయియుండి ధర్మంబువిడనాడి దీనుల బాధించు ధీరుఁడొకఁడు
పరధనంబులవల్లఁ బ్రాముఖ్యమునుజెంది మర్యాదలను మీఱు మాన్యుఁడొకఁడు
అధికారబలమున నన్యులపత్నులఁ బేర్రిచే లోఁగొను పెద్దయొకఁడు
విధవలకును గతివేఱులేదని చెప్పి పలుపత్నులఁగలయు ప్రాజ్ఞుఁడొకఁడు
చూడఁజూడను లోకము చోద్యమగును
కలలలోనైన సత్యము కానరాదు
నీతిమార్గములెల్లను నిలిచిపోయె
నీశ్వర విలాసమిది సుమ్మి యెంచిచూడ

సీ. శివపూజలన్నియుఁ జెలువుగఁజేయుచు దేవకన్యలలోను దేలుచుంద్రు
పరులుసోదరులని పరికించిచెప్పుచు బక్కవారల నెల్ల బాదుచుంద్రు
సభలయందుననైన సైకతముననైన సుందరులనుజూచి సొక్కుచుంద్రు
ఐహికసౌఖ్యము లంధకారములని కాసాక్కటికినైన గడ్డితింద్రు
విరలందఱు విబుధులై వెలుఁగువారు
తోడివారిని నిత్యంబు దూఱువారు
పాపులయ్యును బాత్రతఁబడయువారు
ఈశ్వరవిలాసమిది సుమ్మి యెంచిచూడ

సీ. హిందూమత మెహాకు నిలువేల్పని నుడివి ద్రాక్ష సారాయిని ద్రావుటయును
బ్రకృతిశాస్త్రమునందుఁ బ్రావీణ్యులగుచును క్లోరఫారముచేతఁ గొల్లగొనుట
ధన్వంతరులమని తగుకుప్పచేకొని మంచివారిని నిలమాపుటయును
వేదశాస్త్రముదక్క విద్యలులేవని సంస్కృతమింతయుఁ జదువకుంట
యెల్లపెద్దలకిది నిత్యకృత్యమయ్యె
యిటులుగాకున్న నిద్రవారెప్డుఁబోరు
నరులు రూపునఁ జేష్టల నసురులయ్యె
యీశ్వరవిలాసమిది సుమ్మి యెంచిచూడ

నీ నిమిత్తమున నే నతని ప్రాణముల నిచ్చితిని కాని యాతని నా రాజ్యమున నుండ నీయను అతఁడు నా దేశము విడిచి పోవునట్లు త్వరగఁ జేసెదను నీవును సీతయు నింక నింబపుర ప్రయాణమునకు సిద్ధముగ నుండుఁడు' అని పలికి కూతునోడబరచి పంపెను ఆమధ్యాహ్నమే శ్యామసుందరుఁడు చెఱలోనుండి విడిపింపఁబడి రాష్ట్రమునుండి వెలిపుచ్చఁబడెను తుకాజీయు శివనానాయు నరిగిన రెండుదినములకు రాణి విజయభేరీకాహళీధ్వానముల శత్రువులహృదయముల వ్రక్కలుసేయ మహిషాసురనిర్మూలనశీలకరుగు దుర్గామహాలక్ష్మివలెఁ జతురంగబలములతో నింబపురముపైఁ జనియెను

ఏదునేడవ ప్రకరణము

తుకాజీహోల్కారును శివనానాయును సైన్యమును దీసికొని నింబపురమునకుం జని రాజపుత్రులచే నాక్రమింపఁబడిన నింబపురపు కోటను ముట్టడింపసాగిరి రాజపుత్రసేనకు నుదయపురరాణా నాయకుఁడై కోటలోనుండి మహారాష్ట్రసేనల నెడ తెరపి లేకుండునట్లు తుపాకులబారుచే నొప్పించుచుండెను రాణాకు రెండుకన్నులవలెఁ గపటోపాయవేదులగు భేతాళసింగు భైరవసింగు నను వారు రాజపుత్రులు సమస్తసహాయములఁ జేయుచు నిందూరు పురవార్తలను నహల్యా ప్రయాణవార్తలను విన్నవించుచుండిరి రాజపుత్రులు నింబపురము నాక్రమించుటకు ముఖ్యకారకుఁడు గోమాజీరావే గనుక నతఁ డెప్పటి వర్తమాన మప్పుడు రహస్యసంచారులగు చారులముఖమున భేతాళసింగునకు దెలుపఁగఁ జేయుచుండ నతఁడు రాణాకు దెలుపఁగఁ జేయుచుండెను గోమాజీరావు హోల్కారు రాజ్యముయొక్క గుట్టుమట్టులఁ దెలియఁ జెప్పిన పక్షమున వేయివరహాలతని కిచ్చెదునట్లు భేతాళసింగు వాగ్దానము చేసినందున నింబపురముపై రాజపుత్రులను రమ్మనియు నచట దుర్గాధిపతియగు శివనాన పరాక్రమహీనుఁడనియుఁ జెప్పి గోమాజి రాజపుత్రులను రావించెను రాజపుత్రుల మనోరథము తీరినను గోమాజీయొక్క మనోరథము తీరదయ్యెను భేతాళసింగు వాగ్దత్తముఁ జేసిన ద్రవ్యమతనికిఁ జిక్కుటఁ గాని యితఁడు వ్రాసిన యుత్తరములకుఁ బ్రత్యుత్తరము వచ్చుటఁ గాని కలుగదయ్యెను అందుచే గోమాజీ తనకిష్టుఁడైన వామనభట్టుచేతికిఁ గొన్నియుత్తరములు వ్రాసియిచ్చి యవి భేతాళసింగున కిమ్మని చెప్పి వానిని నింబపురమునకంపెను అతఁడట్లుండ జస్వంతరావు రాణిపక్షమునకుఁ దిరిగిపోవుటయు గోమాజిరావు స్వలాభపరాయణుఁడై ప్రత్యక్షశత్రువుఁ డగుచుండుటయుఁ జూచి దౌలతరావు భిల్లులను శాయాజిహోల్కారును నమ్మియుండుట కేవలము మంచిది కాదని రాజపుత్రులతోఁ గలసి మెలసి పనిఁ జేయుట యుచితమని నింబ

పురమునకుఁ దానుఁగూడ మహారాష్ట్రసైన్యముకంటె ముందుగఁజని రాణానుదర్శించి యాతనిచే గౌరవింపఁబడి యచ్చటనుండెను తుకాజీ బయలువెడలిన రెండుదినములకు శ్రీరాణి యహల్యాబాయి కొంతసేనతో నింబపురముపైఁ జనుచుమార్గమున నచ్చటచ్చట నిలుచుచు నాయాగ్రామముల ప్రజలంబిలిపించి భయపడవలదనియు భిల్లులను జస్వంతరావు సంహరించి దేశమున కుపకారముసేయుననియు దురాత్ములు చెప్పు తేనెతేటలవంటి మాటలకునోడి చెడిపోవలదనియు నుపదేశించుచుఁ బయనముసేయుచుండెను చెలియొక పల్లకిలోఁ గూరుచుండి ముక్తాబాయియు సీతయు రాణివెంట వచ్చునెడఁ గుగ్రామముల ననాగరికులఁ గనుంగొనునపుడు వారొందునాశ్చర్యమును వనములఁ బ్రయాణముసేయునపుడు నెమలిలేడిమొదలగు ముద్దుమూటఁగట్టు జంతువులంజూచి పొందినయానందమును గుట్టలను మహోన్నతపర్వతములను గొండకనమలను సెలయేళ్లను వీక్షించి యనుభవించిన సౌఖ్యమును, వర్ణింపనలవిగాదయ్యెను అదివఱకెన్నడు నంతఃపురము విడిచినవారు గాకుండుటంబట్టియు, నిట్టివినోదములకుఁ బ్రొత్తవారగుటఁ బట్టియు, యౌవనప్రాదుర్భావముచే ముందువెనుక నెఱుఁగని వారగుటఁ బట్టియుఁ, బయనమేసుఖతరమనియెంచి నిర్భయముగఁ దలుపులం దెఱచి చూచుట కారంభించిరి సైన్యమున విస్తారభాగము తుకాజీతో నంపఁబడుటచే నహల్య కొలఁదిమూకలతోఁ బయలుదేరి మదగజాధిరోహణము చేసి తానుసేనాగ్రభాగముననుండి శత్రువులొకవేళఁ బయిఁబడిన స్త్రీల కపాయముగలుగకుండునట్లు ముక్తను సీతను వెనుకరాఁబనిచెను ఇందూరువదలిన మూడవనాడు సాయంకాల మీచిన్నసేన యొకయడవిలో మువ్వురు మనుష్యులొకమాఱు వరుసగా నడచి పోవుటకుఁదగిన వెడల్పులేని యొకయిఱుకు త్రోవఁబట్టి పోవుచుండెను రాణియధిరోహించిన యేనుఁగు సుఖముగానడచుట కామార్గముచాలనందున నాజంతువును మిక్కిలికష్టముతోఁ బయనముసేయఁ దొడఁగెను వెనుకవారు ముందుకుఁగాని ముందువారు వెనుకకుఁగాని వచ్చుటకు వీలులేదు అందుచేత మనుష్యులందఱుఁ జీమలబారువలె నొకరివెనుక నొకరు నడచియక్కడికి సమీపగ్రామమునకు సాధ్యమయినంత వేగముతోఁ బోవఁజూచిరి గాఢముగ చీకటి నభమంతయు వ్యాపించి యప్పుడప్పుడే పట్టిన నల్లమబ్బుల సాయమునొంది యామార్గస్థులకు దారితెన్నుఁగాననీయకుండెను ఉరుములు మెఱుములు నట్టహాసము చేసినందున జవ్వనులిద్దఱు ప్రయాణము గొంచెము కష్టమని యోచించిరి అంతలో నొండొరుల ధ్వనులు వినరాకుండ జంఝామారుతమువీవఁదొడఁగెను ఆసమయమున నేమూలనుండియో కొండయేటిప్రవాహమువలె మహారావములతో నలుదెసలనున్న కొండలు జరజరదిగి యుగ్రధనుఃపాణులును విలక్షణాకృతులు నగుభిల్లులమూకలువచ్చి యొక్కపెట్టున సేనయొక్క

వెనుకచక్కం దాకెను తాఁకుటయు బాలికలిరువురు నాక్రందనధ్వనిఁజేసి అమ్మా దొంగలు దొంగలుఅని యరచిరికాని వారిరోదన మరణ్యరోదనమై యామహావాయువుచేఁ దిగమ్రింగఁబడి యహల్యచెవులకెక్కదయ్యెను భిల్లులయఱపులు మోటపకలింపులు కొంచెము రాణిచెవికిఁ బొడకట్టెనుగాని యామెతనసేనల వారు దాకిరని తెలియలేక పోయెను అంతట సామగ్రిమోయు కూలివాండ్రు నిర్విణ్ణహృదయులై భుజములపైఁ బరువులదింపి శత్రువులకుఁ జేతులు జోడించి దండములఁ బెట్టి తమప్రాణములఁ గాపాడుకొనిరి ఎదిరించువారెవ్వరు లేనందున గండాభిల్లుతక్కిన భిల్లుల సైన్యమున బియ్యము మొదలగు పదార్థములఁ దమసేవకుల చేతికిచ్చి బాలికలున్న రెండుపల్లకుల దగ్గఱకువచ్చి తలుపులఁ దెఱచెను అతినిభయంకరాకారముఁజూచి ముక్త బాష్పయుక్తయయ్యెను, సీతభీతియయ్యెను అనంతరము భిల్లులతోఁ గొల్లసలుపవచ్చిన హరిహర పాండ్యాజీ యామెటారులపైఁ జేతులువైచి యందు ముఖ్యముగ ముక్తయొంటనున్న యమూల్యరత్నములను జాళువాబంగరునగలనుఁ దనివిదీఱఁ దోచుకొనుచుండ నాలతికూనలిరువురు మూర్ఛిల్లి యెన్నఁడో చచ్చినట్లుండిరి ఇల్లుదోపిడిచే కోరికసఫలమైనందున హరిహరుఁడు సంతోషపారవశ్యముచేఁ బలుకఁజాలక మాటిమాటికా నగలమూటఁ జూచి యుబ్బియుమనుండ నీమెకాదామె ఆమెకాదిమెయని భిల్లులలో నొకవిధముగ వాగ్వాద ముదయించెను ఒకపట్ల నోరెత్తిమాటలాడఁ జాలని హరిహరుఁడు వ్రేలితో నొకపల్లకని జూపినందున వారువాదముమాని యిదియముక్తాబాయియని యాపల్లకి నాభిల్లులు భుజముపైనిడుకొని యనాయాసముగఁ గొండలు సెలయేళ్లు దాటి పఱువెత్తి యదృశ్యులయిరి ఇంతలో నీవార్త కర్ణాకర్ణిని రాణియాలకించి పుత్రికావియోగదుఃఖముచే వెడలుబాష్పములం దుడుచుకొనుచుఁ గతిపయ సైనికులతో రంగస్థలమునకు నొక్కనిమిషమున వచ్చివ్రాలెనుకాని దొంగలు స్థలమువిడిచి పోవుటయేగాక దృష్టిపథముందప్పిరి అంతటనామె హాముక్తానన్నువిడిచి యదువులపాలైతివే యని విచారించుచు రెండవపల్లక వద్దకరిగి మూర్ఛిల్లియున్న కన్నెంజూచి సీతా సీతా యిటురా నీచెలి భిల్లుల పాలయినది యనిలేపెను ఆపలుకులామెను మూర్ఛనుండి మేలుకొలిపినందున బాలికకన్నుదమ్ములవిచ్చి చూచి అమ్మా దొంగలు పోయినారా నాస్నేహితురాలినిఁ గొనిపోయినారు అని యహల్యకంఠమునకు చేతులుపెనవేసి కౌఁగిలించుకొనెను అహల్య యాశ్చర్యనిమగ్నయై యేమిది అమ్మానీవు ముక్తాబాయివా పాపము సీతనే దొంగలెత్తుకొని ౦ పోయినారాయని కూతుగన్నమోదము సీతచన్నఖేదము చిత్తమున మల్లడిఁగొన ముక్తాబాయిని లేవనెత్తి ముద్దుపెట్టుకొని సీతకైమిగులవిచారించి తనకంటె చెలినిమిత్తము మిక్కిలి వ్యథనొందుచూతునూఱార్చుచు నామెను సేదఁదేర్చి

వెంటబెట్టుకొని ఏనగజముపై నెక్కించుకొని సైన్యమునఁ గలకలముడిపి తిరిగి పైనము సాగించెను. త్రోవలో ముక సీతనుగలఁచుకొని అమ్మా యిఁక నేను సీతనుజూడను గాఁబోలును దానిమాటలేమమ్మా అదిపలుకుట యమృతవర్షము గురియుటగాదటమ్మా అహహా మఱువఁదలఁచినను దానిచర్యలు మఱపురావు తల్లీ యది దాసియటమ్మా పరహాల సుప్పగాని హాసీతా భిల్లుఁచెలిఁ జిక్కినలిరువాలి నీవునాకు దక్కుట యెక్కడిది, వారే దేవతకో బలిబెట్టుదురుగదా యనివిలపింప కన్నీరుదుడిచి తల్లియామె నూరడించి సీతను వెదకించితెప్పింతునని పలికి భిల్లులమీఁది కరుగునపుడు సీతాజాడయు దీయుమని ఉస్వంతరావునకు రాణియు వార్తగులనంపెను. అట్లుచని యామెత్రి సమీపగ్రామముచేరి యందుండ మఱునాడు మఱలబయలుదేరి పయనముసాగించి కొన్ని దినములలో నింబపురసమీపమునకుఁ జనిరి. రాణిరాకమున్నె విని తుకాజీ శివనానా మొదలగు సేనాధిపతులు భయసంభ్రమములతో నామె నెదురుకొని యామె యేనుంగుల కలుగెలంకులఁ దారునడచి ప్రత్యేకమామెకై వేయఁబడిన గుడారములో నామెను బ్రవేశపెట్టి దేహసంరక్షణార్థమై యేనూరుగురుజోదులను గుడారముచుట్టుఁ గావలియుంచి రాణితో శివనానాయిట్లనియెను. అమ్మా మేము వచ్చి నాలుగుదినములయినది. తుకాజియు నేనును గడుజాగరితగఁ గోటముట్టడించుచున్నాము. మీరుకూడ శ్రమపడనక్కఱలేకయే కోట లోఁబడును. మీదేహసంరక్షణార్థము మేముంచిన యీసేవకులలో నేబదుగురుతురకలున్నారు. తురకలని వీరిని తిరస్కారభావముతోఁ జూడవలదు. మనపిఱయున హిందువులకంటెను గృతజ్ఞులుగనున్నారు. అందిజమానుఖాన్ సావనపిక్రిమూర్ఖుఁడు. రాజపుత్రులువచ్చినప్పటికీశూర శిఖామణియూరలేఁడు కాని యుండిన నింబపురముమీరు రావలసియుండకపోవును ఈతనిచేత మీరన్నికార్యములు చేయించుకొనవచ్చును అనిచెప్పి యొక్కసుందరుఁడగు తురుష్కవీరునింజూపి యొప్పగించెను. రాణియాపలుపలకలరి జమానుఖాను మొదలగు మహమ్మదీయులయందు నమ్మకముంచి వారిచే సంరక్షింపఁబడుచు గాఢముగా ముట్టడిజరుపుమని యానతిచ్చి యుద్ధములనారతేఁజని స్త్రీయయ్యు భయమనక పగలనక రాత్రియనక గుఱ్ఱముపైనెక్కియు నేనుఁగుపైనెక్కియు స్వయముగా సేనలఁబురికొల్పుచుఁ బాలుమాలిన భటుల శిక్షింపుచుఁ బరభటులను జంకఁజేయుచు నిరువురిచే శ్లాఘింపఁబడఁజొచ్చెను. నింబపురాంతఃపురకాంతల గర్భంబులవియఁజేయు ఫరంగిగుళ్లు గభిల్లుగభిల్లుమని కోటగోడలు నూల్లుపడఁజేయుచుండెను. రాజపుత్రమహారాష్ట్ర సైన్యములు మూరములనుండ యొకరిపైనొకరగ్నివర్షములు కురియించుచుండిరి. ఇట్లు ముట్టడిజరుగుచుండ రాణివచ్చిన మఱునాడు రాత్రి గుడారములో రాణియు

ముక్తయుఁ గూర్చుండి సతిని గూర్చి ముచ్చటించుచుండఁ గావలిగాఁడు జమానుఖాను యొక్క కఠినమయిన కంఠధ్వని వారికి వినఁబడ రాణి యొక సేవకునిఁ బిలిచి యదియేమని యడిగెను ఆ సేవకుఁడు నమస్కారముఁ జేసి అమ్మా నలుబదియేండ్ల వయస్సుగల స్త్రీ తమ దర్శనమునకు రాఁగోరుచున్నది, యుద్ధసమయములయందుఁ బరులు రారాదని జమానుఖాను దానిని నిరోధించినాఁడు అదియే గడబిడయని విన్నవించెను రాణి యామాటలు విని నవ్వి స్త్రీలను రానిచ్చిన నేమి నష్టముండును ఆమెను రానిమ్ము ఆమె యేమి చెప్పఁగోనునోయని జమానుఖానునకు వర్తమానమంప నతఁ డామెను లోపలికి వదలెను పచ్చని దబ్బపండువంటి దేహచ్ఛాయఁ గలిగి పొట్టిగ లావుగనున్న యాయంగన యెఱ్ఱని చీర గట్టుకొని మొగమున నెఱ్ఱని కుంకుమ బొట్టుతోడను గుఱుచలగు వెండ్రుకలతోడను బలుపని మొగముతోడను వచ్చి రాణియెదుట నిల్చి అమ్మా నా మొఱ నాలకింపుఁడు నేను నింబపురవాసురాలను నా కుమారుని శివనానా నిర్హేతుకముగఁ జెఱలో నుంచినాఁడు అదిగాక యీ ముట్టడలో నాపని పట్టెదనని యిదివరకుఁ బ్రతిజ్ఞఁ జేసినాఁడు అందుచే నసహాయురాలనగు నబలనగుట మీ వద్దనుండఁ గోరి వచ్చితిని నా కుమారుని చెరనుండి విడిపింపుఁడు అని రోదనము చేయసాగెను శివనానా యామె కుమారుని నిర్హేతుకముగఁ జెరలోఁ బట్టెడన నిశ్చయముగ నెఱింగి యతని నీ సమయమున నా విషయమై యడిగినచో నేమి కార్యభంగము వాటిల్లునోయని శివనానా నడుగుటకు నుద్యుక్తురాలుగాక భయపడిన యాయంగనను మాత్రము తనతో నుండుమని ''అమ్మా నీ కుమారునకుఁ గాని నీకుఁ గాని భయము లేదు ముట్టడియగువఱకు నీవు నా గుడారమున నుండుము నేనుండ భయమేలా' యని యామె భయము డెపి రాణి యా రాత్రి నిద్రించెను

ప దు నె ని మి ద వ ప్ర క ర ణ ము

మనుష్యరక్షితములు గాక యెండకు నెండి వానకుఁ దడిసిన యడవిచెట్లనున్న పరిమళముల గ్రహించి మందమలయానిలుండు తన గంధవహనామము సార్థకముగా నరుదెంచి యున్నతి పర్వతముపై గుడారమునఁ గొలువుదీర్చిన శాయాజీహోల్కారు యొక్క శ్రమలన్నియుం దొలంగఁ జేసెను అతఁ డొక కుర్చీమీఁద సుఖాసీనుఁడై యదివఱకుఁ బీల్చిన గంజాయిమత్తు తగ్గినందున మఱలఁ గొంచెము గంజాయి తన దగ్గఱ నిలువఁబడిన బాలకునడిగి నాలుగు గ్రుక్కలు పీల్చి వహవ్వా వహవ్వా నీవు మంచివాఁడవురా కుఱ్ఱా నీ పేరెవ్వరురా మరచినాను ఘాజీకాదా యని యా బాలునడిగెను హోల్కారు రాజ వంశమున నుదయించిన వానికి నిట్టి తుచ్ఛమయిన యభ్యాసము లెట్లలవడెనని మన

స్సున నొచ్చుకొనుచు నాబాలుఁడు నా పేరుబాజీరావుకాని ఫాజీకాదండి యని
యుత్తరమిచ్చెను శాయాజీప్రత్యుత్తరమిచ్చుటకుఁ బ్రయత్నించుచుండ నింతలో గండా
భిల్లుపాండ్యాజీయు గుడారపువాకటనిల్చి హోల్కారువారి దర్శనముఁ జేయఁగోర న
తఁడు వారిరమ్మనియెను వారు లోనికివచ్చునప్పటికి శాయాజీ బాజీరావు నావలికంపివా
రచ్చటికి వచ్చినకార్యమేమనియడుగ వారిహరుఁడిట్లనియెను మహారాజా అహల్యాబాయికి
ముక్తాబాయిపై ప్రేమ మిక్కుటమని విని కూతును మనస్వాధీనములోనుంచుకొన్న పక్ష
మునఁదల్లి మనము చెప్పినట్లుఁ గొప్పుకొని కుమార్తె ప్రాణరక్షణార్థము మనకు రాజ్యమును
వదలివేయునని ముక్తాబాయినిఁ దెచ్చినాము ఈపర్యాయము తమరు తప్పక రాజ్యము
గైకొనవచ్చును కావలసినచో నీమెనువివాహమాడను వచ్చును ఈపలుకులు శాయాజీ
చెవులఁబడినతోడనే యేదీనాప్రియురాలేదియని దిగ్గునపీఠమునుండిలేచి గుడారము
వెలుపలికవచ్చెను గండాభిల్లింతలోఁ బల్లకిఁదెమ్మని బోయలకానతిచ్చుటయు వారిం
దున్న యందకత్తెను మోముకొనివచ్చి హోల్కారు నెదుటనుంచి తలుపులందెఱచిరి
తనకు మన్నెసుల్తాను బిరుదునొసంగిన తనయేలికయెడ విశ్వాసమధికముగుటచే గండా
భిల్లు పల్లవాధరింగని ప్రభువువారు నీనిమిత్తమెదురుచూడ మొద్దులాగునఁ గదలిరావేమి
యీపాటికిరాయని మృదుతరమృణాలముల నిరసించునామె బాహువల్లిఁ బట్టుకొని
లాగ మదకఱ్ఱవంటి భిల్లుని మోటచేయి సోకుటచే నరిముబెణికి గడుబాధగలుగఁజేసి
నందున నమ్మయని జాలిపుట్టునట్లు ప్రలాపములాగు సీతవాఁడు లాగినవైపుకుఁ జనినిశ్చేష్టురా
లయి పల్లకిఁ జేరఁబడెను శాయాజీశరీరము పులకలెత్తి కన్నెత్తి యాపుత్తడిబొమ్మం
జూచి మేలిముసుంగుడీయుమని యానతియ గండాభిల్లుకన్నియ యండాసి వలదువలదని
యామెచేతులతో నడ్డగించుకొనుచున్న చేతులువిడలించి మేలుముసుంగుదీసెను తీయు
టయు మేఘమునుండి వెడలు మెఱుపువలె తెరచాటునుండి వచ్చు భామవేషము వలె
భూమినిసంచరింపవచ్చిన యచ్చరవలె నపుడుదయించిన పూర్ణచంద్రబింబమువలె ముఖ
కళలు పర్వఁజేయుచు నాలతాంగినిలువ ముఱలివాఁడగు హరిహారుఁడును శృంగారరస
మెఱుంగనిమోటవాఁడగు భిల్లుండును మోహబాధ్యులై యువ్విళులూర నాగరికుఁడును
బడుచువాఁడునగు శాయాజీస్థితి వర్ణింప నెరితరము ఇట్లు మోహసముద్రమునఁ గొంతసేపు
మునకలువేసివేసి వారుమువ్వురొకరనొకరు చూచుచు భయలజ్జలచే నోరంజూడఁజాలక
ముగమాపలివైపున కాబాలిక ద్రిప్పుకొన్నను వంగి యాముఖముగనులారఁ గనుచునుండ
శాయాజీవారలతో హరిహారా' యీమె ముక్తకాదు ముక్తను నేనెఱుఁగుదు ఆమె యింత
సౌందర్యవతి కాదు ఈమె పేరెఱుంగను కాని యాకారము నాకు క్రొత్తదికాదుసుమీ
యని, సుందరీనీపేరన్నరా యని యడిగెను మహారాజుగారి ప్రశ్నకామె యుత్తరము

నో సంగుట కిష్టములేనిదయ్యెఁ దన్నువారు ముక్తభాయిగా భావించుచుండిరి గనుకఁ దనపేరు ముక్తభాయి కాదని మనవియొనర్చినగోఁ గన్నువారు విడుతురను నాసచే నామె, „నేను ముక్తను కాను నా పేరు సీత ముక్తాభాయికి నేను దాసిగనున్నాను నన్ను దయచేసి విడువుఁడు స్వామీ మహారాజులు నున్నతగోత్రసంభూతులగు తమకు దాసీసంగతి కూడదుగదా యని ప్రార్థింప నాముద్దుమాటలాలకించి శాయాజీ, సుందరీ నేను నీకు జ్ఞాపకమున్నానా, నాడు పునహానగరములో గుడిలోనికి నీవు పోయి మరలివచ్చుచుండ నేను నిన్ను పాణిగ్రహణము చేయలేదా యనిదన్నా మెకు విన్నవించుకొనెను అర్ధరాత్రివేళ నడివీధిలో స్త్రీనిఁ జెరబట్టఁ దలఁచినదోషకర్ముఁ డొంటరిగఁ జిక్కినదానిని విడువఁడనియుఁ దన పుణ్యమట్లున్నదనియు భగవంతునిపై భారమువైచి సీతమిన్నకుండె, వివాహప్రయత్నము చేయింపుమని హోల్కారు చెప్పెను ఆపచ్చనిపందిళ్లనడుమ నాపర్వతశిఖరమున పట్టాభిషేక మహోత్సవమువలెనే వివాహమహోత్సవమున జరుగుటమంచిదని గండాభిల్లు తగినముహూర్తముంచుమని హరిహరపాండ్యాజీతోఁ జెప్పి కావలసిన మృగములనుఁ జంపతెమ్మని నలుదెసలకుఁ దన భిల్లులనంపెను శాయాజీ హోల్కారున కీకన్యను వివాహము సేయుట యెందుచేతనో హరిహరునకిష్టము లేదయ్యెను ఈవృద్ధబ్రాహ్మణునకుఁ గూడ నామెయందాశగల్గుటయె ప్రాయశః దీనికిఁ గారణమై యుండఁబోలు అందుచే నాతఁడు శుభముహూర్తము నాలుగైదు దినములలోపున లేదని తెలియఁజెప్పవాఁడెందరు సీతనొక గుడారమునయుంచి చుట్టునలువురు భిల్లులను గావలియుంచిరి ముదటసీత యక్కడికి వచ్చుటతోడనే శాయాజీ బాజీరావును గుడారమునుండి యావలకుఁ దోలినందున నాతఁడు గుడారపుచాటున కరిగి యచ్చటఁ గూరుచుండివచ్చిన యాయంగన యెవ్వరోయను నాత్రముచే రేప గుడారపు గుడ్డనున్న చిన్నరంధ్రమునఁ దనకన్నులుంచి సీతనుఁ జూచెను చూచినతోడనే యాతనిమనస్సునకేమి పుట్టెనోగాని చోటచోట కన్నీరు కాలువలై చెక్కులమీదుగ నేత్ర ద్వయమునుండి ప్రవహింప బాజీరావు హా దైవమా! మాకరువురకుఁ గూడఁదగని యాపదఁ దెచ్చి పెట్టినావుగదా యని విలపించి తాను దుఃఖించిన జాడయేరికైనఁ దెలిసిన వారు తన్నుకారణ మడిగి తెలిసికొని బాధింతురని కన్నీరుసత్వరమే తుడుచుకొని యెట్లయిన సీతనొకపర్యాయము కలిసికొని మాటలాడవలయునన్న ప్రయత్నించెనుకాని యాదినమున సమయము దొరకదయ్యె అతఁడొకటిరెండుసారులు సీతయున్న గుడారము ముందటికరిగినిలువ భిల్లులతని గదిమి కొట్టిరి అందుచే నేమియుందోచక కాలుకాలిన పిల్లివలె నిటునటుఁదిరుగుచుఁ జెప్పిన మాటలుచక్కగ వినఁబడమిశాయాజీచే చీవాట్లు దినుచు మిక్కిలి చింతాప

మొందసాగెను ఆగుడారమునఁ బ్రవేశించుటాది సీత నెమ్మనమున నుమ్మలికము హెచ్చ "హా భవానీమాతా నాడు సన్యాసిరూపమున నీవే నాపరాభవము దప్పించితివి నేడు పంచాగ్ని మధ్యమందు నన్నుంచినట్లు క్రూరజనమధ్యమున నుంచితివి నన్ను భంగపుచ్చుటకు యత్నించువారేకాని నివారించువారు లేరు ఏమి పనిచేసినను నీదాననే యని వేవితముల మ్రొక్కుచు హరిహరుఁడు తనకంపించిన భక్ష్యములుగాని మహారాజుగారు ప్రత్యేకముగఁ దన నిమిత్తమై వండించి పంపించిన మాంసాదికములుగాని భక్షింపక యన్నయుముట్టక నీరుగూడఁ ద్రావక శుష్కోపవాసము చేసి భిల్లుల చెఱనుండి తప్పించుకొని పోవువఱకు నుపవాసములు చేయునట్లు ప్రతినగావించెను శాయాజీ కొల్హాల్కరు సూర్యాస్తమయమైన తరువాత మదనతాపహతుఁడై పలుమాఱు సీతయున్న గుడారముయొద్దకరిగి యటనుండి భిల్లులకు జంక మఱలుచు నుఱలనటుపై పరుగుచుఁ బతిమాలియో బలాత్కరించియో యామెను దనస్వాధీనముఁ జేసికొనఁ గోరుచుండెను హరిహరపాండ్యాజీ వృద్ధుఁడైనను వానికోరిక పడుచు తనమందుండుటచే నెట్టియిన నయముననో భయముననో బాలికను దాను స్వీకరింపఁ గోరి నిద్రలేక సమయమునకెదురు చూడసాగెను బలవంతముగ గుడారముఁ జేరిన పక్షమున హరిహరుఁ డేమనుకొనునోయని శాయాజీయు శాయాజీ యేమి సేయునోయని హరిహరుఁడు నొకరికొకరు జంక చతురంగమున నొకగుఱ్ఱ మొకగుఱ్ఱముచేఁ గట్టఁబడిన వడువున నామెదగ్గఱకరుగరైరి దైవయోగమున నావృద్ధుఁడు బాలుఁడు పరస్పరమత్సరబుద్ధులై భిల్లులు నిద్రించుచున్నను గుడారమును గాచుచుండిరి హరిహరుఁడు నిద్రలేక శవమువలె నేల మేలుకొనుచున్నాఁడో యని మహారాజు నిందింపనీకుఱ్ఱపీను గేలదయ్యము వలెఁ దిరుగునోయని హరిహారుఁడు వానినిందింపఁ దొడగెను ఒకమారు కామాగ్నికిఁ దోడు క్రోధాగ్ని కూడ జనింప శాయాజీ ఖడ్గము ధరించి హరిహరునిఁ జంపనుంకించి చప్పునఁ దెలివి దెచ్చుకొని యది తనభవిష్యదభివృద్ధికి నాశనకారణమని యాపని మాని తుదకుఁ బ్రాణములు విసిక కామపారవశ్యమునుండి తొలగింపఁబడి నిద్రాపారవశ్యము నొందెను అప్పుడు హరిహరుఁడా జాడఁ దెలిసి గుడారముఁ జేరఁబోయి యమదూతలవలె భిల్లులు మేలుకొనుటచే వెనుకకుఁ జని గవంతసేపు కునికెను ఆవగింజంత సమయ మెట్లయినఁ జేసుఱు నేని గానింబట్టి సీతాదర్శన మొనర్చి మాటలాడఁదలఁచి రేయి కునుకులేక శ్రమపడుచున్న బాజీరావు వీరిరువురు నిద్రాసక్తులుగాఁ జూచి భిల్లులంతకుముందే దేహములను మఱచి గాఢసుషుప్తులగుటఁ జూచి యది చీకటిరాత్రియగుటఁ జూచి మెల్లమెల్లగ సీతయున్న గుడారపు ప్రక్కనువచ్చి నిశ్శబ్దముగఁ గూరుచుండెను కూరుచుండి భూమిని దాకు గుడారపు ముతకగుడ్డను దనచేతులతో మీదికనెత్తి యల్లన దానిక్రిందఁ దూరి

లోపలఁ బ్రవేశించి చప్పుడుగాకుండ దేకి సీతకడ కరిగెను నిద్రపట్టకున్నను బరధ్యానముగ నేమో యాలోచన సల్పుచుండిన సీతయొక్క మృదుదేహముపై బాజీరావు చేతులువైచి తట్టిన నామె యులికిపడి శాయాజీ యేమోయని పడఁకి ఛీఛీ దురాత్మా పోపో యని గద్గద స్వరముతో నఱచెను ఆపలుకుల కలుగక బాజీరావు నేను అక్కయ్యా నేనుబాజీరావును నీవు భయపడకుమని మెల్లనఁ జెవిలోఁజెప్పెను అమృతసేచనముఁ జేసిన చందమున నామాటలు తనచెవికిఁ దృప్తియొసంగఁ జేతులతో వానిదేహముదడవి పూర్వము దానెఱింగిన యానవాళ్లనుబట్టి యతఁడు బాజీరావని యెఱిఁగి నాయనా నాయనా నీవును నిమాయభిల్లులచేతనే చిక్కితివా యని రవంతసేపు ఏడ్చి యాతనిదగ్గఱఁ దిసికొన నాతఁడు నామెయొడిలోఁ బండుకొని ముహూర్తముదాక, అక్కయ్యా నన్నుభిల్లులు రెండుసారులు వారిదేవతకు బలిఁబెట్టనెంచిరి ఈపర్యాయము మనమిద్దరముఁ గూడనట్లే యగుదుమేమోయని యేడువసాగ సీత వాని విలాపమును వారించి ఇదిదుఃఖమునకుఁ దగినయదను కాదు ఉపాయములచే మనముచ్చటనుండి దాటవలయును నీవు నేనుచెప్పినట్లుచేయుము అనివానికిఁ గొన్నిరహస్యములుచెప్పి యిక్కడ నీవున్నచో మనకు నిరువురకు నాపదవాటిల్లును సత్వరమే సాగిపొమ్ము తే యనివానినంపెను అతఁడును పూర్వప్రకారమున గుడారమునొత్తిగించుకొని యావలఁబడి తనయేలికహజారయున కరిగి తనస్థానమునఁ దానెప్పటియట్ల శయనించెను ఉదయమున హరిహరుఁడు హోల్కారుకన్నయున్నలేచి కాల్యకృత్యములం దీర్చుకొని బాజీరాయనిఁ జేరఁబిలిచి కుత్తాసీతవద్దకు నీవు సేవకుఁడవగుటచేఁ బలుమాఱు నవు పోవుటకు నీకుత్తరువు గల్గునట్లు చేసెదను నీవామెతో నాపైప్రేమఁ గల్గునట్లు నన్ను వివాహమాడునట్లునొత్తిచెప్పి నాకీయుపకారముఁ జేసితివేని నీచెఱనుండి నిన్ను వదిలించెదను కావలసినేని నీకుధనముఁగూడ నర్పించెద అట్లుచేయఁగలవాయని వినయమునఁబలికెను ముసలివానికంత కోర్కెయున్నందుకు నగివునుదన్నట్టిదుష్కార్యమునకాతఁడు నియోగించినందుకు నలుకయు నతనిమనస్సున నుదయింప బాజీరావు వానినివారించుకొని కాలానుసారముగ వర్తింపఁదలఁచి, అయ్యా నాకిదియిష్టమే శాయాజీకూడ నామెనుగోరుచున్నాఁడు వానినిఁ గడతేర్చిన పక్షమున మీకీమె దక్కునని యుత్తరమాయ హరిహరుఁడది యెంతపని యీరాత్రి చేతునని సంతోషముతో వానినంపెను

పందొమ్మిదవ ప్రకరణము.

అట్లుభిల్లుల శిక్షించుటకుఁ బ్రబలినఁబూని జస్వంతరావు రాణినడిగి కొంతసైన్యమును వెంటఁబెట్టుకొని భిల్లుల గూడెములపైఁబడి వారిలోఁ బలువురఁబట్టుకొని కొందఱఁ

జెరలో నుంచుచు ముఖ్యులగు నాయకుల వృక్షములకుఁ గట్టి యురిదీయించుచు నొకమాఱు వారు తరుగఁబడునపుడు వారితో వెనుదియ్యక కయ్యములు సల్పుచు నొకమాఱపజయము నొందుచు జయాపజయములవలన నుదయించు సంతోష విచారములకుఁ దనమనసు పుట్టునిల్లగునటుల ముక్తాభోయిపై హృదయము నిల్పి విజయకాంక్షపై దృష్టి నిల్పి విహరింపఁజొచ్చెను. ఒకమూలఁ గొండలఁ బట్టి పరిమార్చుచుండ వేఱొకమూల మఱికొందఱు భిల్లులు పల్లెలపైఁబడి దోచికొని బీదకాపుల గృహములఁ బరశురామప్రీతి సేయసాగిరి. అహోరాత్రములు నిద్రాహారములులేక జస్వంతరావు ప్రాణములకు లక్ష్యపెట్టక యందఱ శిక్షింపుచున్నను భిల్లు లిసుకపాతరవలె తగ్గరైరి కాని యాతని యెడతెగని పూనికవల్లను వహించిన క్రౌర్యమువల్లను భిల్లులకుఁ దమవినాశకాలము దాపయిన దనుమాట తెలియుటయే గాక జస్వంతరావు పేరు విన్నపుడ వారికొకవిధమయిన యడలు కూడ గలిగెను. కాని యాటవికనాయకుఁడును మున్నొకసారి చిక్కి శ్యామసుందరుని లోపమునఁ బాఱినవాఁడును శాయాజీకిఁ గుడిచేయి యయినవాఁడును నగు గండాభిల్లున్నస్థానము జస్వంతరావెఱుఁగక వానినింబట్టుకొన్న దనజన్మము సార్థకమగుననియు నతఁడు చిక్కినతోడనే భిల్లులు కోఱలు దెగిన పాములవలె లొంగుదురనియు నందున శాయాజీ యసహాయుఁడయి రాణికలోఁబడుననియుఁ దలఁచి గండాభిల్లు నిమిత్తము సమస్తప్రయత్నములను సల్పుచుండెను. భిల్లవంశమునకు జస్వంతరావుత్పాతకేతువయి పులులచందమునఁ దమవారి నతఁడు వేటాడుట విని గండాభిల్లు సహింపనోపక శాయాజీదగ్గఱఁ దాఁనుఁ గొలువుండి తాంతియాభిల్లునిచ్చి తినసేనలఁ గూడ దేశనాశనము సేయుమని పంపెను. భిల్లులతోడనే గాక సకలపాపములు మూర్తీభవించినట్లు బహుదురాత్ములతో నీసెనగూడియుంట నది గ్రామములపైఁబడిన దాదితల్లులకుఁ బాసిన పిల్లలతోడను మగలకుఁ బాసిన భార్యలతోడను దినుటకన్నములేని బీదలతోడను దేశమెంత క్షోభపడవలయునో యంత క్షోభపడసాగెను. కాని లయకాలరుద్రుఁడయిన జస్వంతరావును మృత్యువుమూర్తిగైకొన్న తెఱఁగున కృష్ణపంతను నొక యోధవరుఁడును గలసి విధివిరామము లేక శతసహస్రములుగా వారిని యమాలయమున కంపుచుండిరి. హరిహరపాండ్యాజీ సితకును శాయాజీకని వివాహము జరుగు ముహూర్తము నాలుగు దినములున్నదని చెప్పినతోడనే గండాభిల్లు తాంత్యాను వెంటఁబెట్టుకొని జస్వంతరావుయొక్క ఘాటీచవిచూపుమని తనకొండవిడిచి తక్కిన భిల్లులకును రాణిభటులకును గయ్యములు జరుగు స్థలమునకుం జనెను. ఆ స్థలమునకరిగి మొగమున కన్నులకుమీద చేయివెట్టికొని యతఁడు పాఱఁజూచునప్పటికి నిరువదిమంది గుఱ్ఱపురౌతులతోఁ బోవుచున్న యొకయోధుఁడు దూరమునఁ గనఁబడ, ''తాంత్యా అతఁడు జస్వంత

రావని తోఁచుచున్నది మన మీసమయమున వాని నెదుర్పఁజాలము నీవుపోయి యీచుట్టుపట్లనున్న మనవారి నందఱసిద్ధముగ నుండుఁడనిచెప్పుము ' అని వాని నంపి తా నొక గుహలోఁ డాఁగెను తాంత్యాభిల్లు తన యజమానుని సెలవుప్రకారముగ సమీపముననున్న పల్లెకరిగి భిల్లులకు గండావచ్చిన వార్త తెలియఁజేసి మరల నాగుహావైపు పోవుచుండెను ఇంతలో నిరువదిమందిగల యాసమూహము గుహావద్దను నిల్చి పలు దెసలు పరికించునప్పటికి వృక్షములచాటున నక్కియున్న యొక భిల్లుఁడుగనఁబడ "అదె భిల్లుఁడు' అదెభిల్లుఁడువచ్చె" ననియఱచిన తోడనే జస్వంతరావుమార్గాయాసమున నదివఱకు మిగుల వసివాడిన కృష్ణపంతును గుహాముఖమున నొక చెట్టుక్రింద నిల్పి తానుం దక్కినభటులుంగలసి యాభిల్లుని దెస కరుగడును లేడివలె దాటులు వైచుచు ముండ్లపొదలను రాతిగుట్టలను నవలీలగ దుముకుచు వీరికిఁ జిక్కక పరుగెత్తిపోఁగెను ఇచ్చట కృష్ణపంతొక్కఁడును వృక్షచ్ఛాయ విశ్రమించుటఁజూచి గండాభిల్లు మెల్లగనీవలకువచ్చి "తమరెవరి నిమిత్తమిందున్నవారు స్వామీ" యని వానిఁబలుకరింప నాతఁడు "భిల్లులనిమిత్తమై మేమువచ్చినాము గండాభిల్లును నీవెఱుఁగుదువా! అతని నొప్పగించిన పక్షమున నీకపాయములేకుండఁజేసెదను ' అనికృష్ణపంతు ప్రత్యుత్తరమిచ్చెను అంతటగండాభిల్లు "స్వామీ! గండాయింతకుముందె యీప్రాంతములకు వచ్చినాఁడు ఒక నిమిషము క్రిందట మీరు వచ్చితిరేని నేనుఁజూపియుందును అయినను వాఁడీగుహలోనుండవచ్చును నావెంటరండి యని యాతని నాగుహాప్రవేశముచేయించి యందతని నొక ఱాతిపైఁగూర్చుండఁబెట్టి యేరయినవచ్చుచుండిరేమో యని మఱల నొకమాఱు గుహాద్వారమునకువచ్చి యేరున్వచ్చుటలేదని సంతసించిలోనికిం జనెను చనిపరధ్యానముగనున్న కృష్ణపంతునుం బలిమిని వెనుకకుఁబడఁద్రొబ్బి తన మొలలోనున్న సూరకత్తితో నాతని ముక్కుఁగోసి యొక చెవిలో నొకభాగము ఖండించి "యోరిదురాత్మా నేనేరా గండాభిల్లును నన్నుఁబట్టుకొనువారు మీరా?" యని తత్క్షణ మాగుహానువిడిచి కొండమీదికెగఁబ్రాకి తనయొంట వ్రేలాడు నిడుదగొఱకొమ్మున విపరీతమయిన విధమునఁ గెవ్వుమనునటులొత్తెను ఆకొమ్మునూదుట యానవాలుగఁగొని ప్రాంతవాసులగు భిల్లులు మఱల నొకకొమ్మునొత్తి ప్రతిధ్వనిచేసి పుట్టలోనుండి వెడలు చీమలవలె నొకవరుసను రెండుమూడువందల మందిగండాభిల్లున్న దెసవచ్చిరి తాంతియాభిల్లు తమకాసఁగొల్ప చిక్కనందున జస్వంతరావు తనచిన్న సేనతోఁగూడ వెనుకకుందిరిగి గుహాముఖమున బోసిముక్కును దెగినచెవియునుగల్గి స్రవించురక్తముతో బాధగొనుచున్న కృష్ణపంతునుజూచి తెల్లపోయి స్పష్టముగఁ దెలియని వాని ముక్కుమాటలవల్ల గండాభిల్లుచేసిన పరాభవము నెఱిఁగి క్రోధోద్దీపితుఁ

డైయుండ నింతలో గుమిగూడిన భిల్లులు కొండమీదనుండి వీరిమీద నమ్ములవర్షములు
గురిపింప నారంభించిరి మూడువందలమందితో నిరువదిమంది కయ్యము సేయుట మృత్యు
స్నేహము సేయుటయే యని జస్వంతరావు స్పష్టముగ నెఱింగియుఁ దాము వెన్నిచ్చి పారిన
చో వారు దఱిమికొట్టి మొదలే బ్రతుకనీయరని తుపాకులతోఁ గొంతయుద్ధము చేసెను
ఇట్లు జరిగినకయ్యమున మహారాష్ట్రులు తుపాకీదెబ్బలు తిని ముప్పదుగురుకంటె నెక్కువ
సంఖ్యగల భిల్లులు నేలపాలయిరి జస్వంతరాయని బలములో సగముకంటె నెక్కువ
హతులైరి అంతట జస్వంతరావు రంగము విడిచిపోవఁజూచుచుండ దూరమున నాతని
సేనలో నొకభాగము వానిని వెదకికొనుచు వచ్చుచుండెను ఆబలము దృగ్గో
చరముకాఁగా భిల్లులు పిట్టలవలె తుఱ్ఱునఁ గొండమీదనుండి నానాముఖములఁ బాఱి
యదృశ్యులైరి ఇట్లు పూర్వము లక్ష్మణునిచే శూర్పణఖకు జరిగిన పరాభవమే గండా
భిల్లుచేఁ గృష్ణపంతునకు జరుగ నాతఁడు యుద్ధమునుమాని సిగ్గుచేఁ దనవికలాంగత తనకే
యసహ్యాకరముగఁ దోప మెల్లగ నింటికిఁ జనెను గండాభిల్లు తాంతియానుగూడుకొని
మఱునాఁడు సాయంకాలమునకు శాయాజీహోల్కారువారి సమ్ముఖమునకు వచ్చి దన
పూర్వోద్యోగముఁ గైకొనెను అట నింబపురమున దౌలతరావు రసపుత్రులతోఁ గలసి
యహల్యాభాయి సైన్యమును నోడింపవలెనని యెంతప్రయత్నము సల్పుచున్నను మహా
రాష్ట్రులే యీముట్టడిలోఁ బయిచేయిగలవారుగ నుండిరి గోమాజీరావు రాజపుత్రు
లకుఁ గావలసిన ప్రతిసహాయముఁ జేయుదునని వారినిఁ బిలిపించి తనలంచము వారు
సత్వరముగ నందఁజేయింపరైరని వారిపైనలుకఁ బూనెనే కాని తాను వాగ్దానమొనర్చిన
సాయము వారికిఁ దానొనర్పఁజాలనందుకుఁ జింతిల్లఁడయ్యెను కొత్వాలు పద్దనుండి యే
సహాయము లేకున్నదని రసపుత్రప్రభువగు నుదయపురరాణావారు, భిల్లులను శాయాజీ
సైనిఁ దమకుఁదోడుగ రప్పింపుమని దౌలతరావును బల్మమాఱడుగుచు వచ్చినను
శాయాజీరా వప్రయోజకుఁడనియు వానినిబిలిచిన మును పున్నగోడు చెడుననియు,
భిల్లులాటవికులగుటచే దేశమును గొల్లకొనుటకే యర్హులుకాని నిల్చికోటలుముట్టడించి
క్రమమయిన యుద్ధములుచేయుటకు తగరనియు నెఱిఁగి వారినిరప్పింపఁదలఁపక యట్లున్న
చోఁదనకు సేమములేదని ఇదిగోవచ్చెద రదిగోవచ్చెదరని ఱేపుమాపని కాలయాపనము
నర్చుచుండెను రసపుత్రులకాగ్రహము వచ్చి తన్నెపుడు తుదముట్టింతురోయని భయము
గలిగి వారి నాతఁడు వదలఁ బ్రయత్నించునుగాని వారతనిని దాటిపోనీయక వేయి
కన్నులతోఁ గాచుచుండిరి ఒకవేళ నేమాయోపాయము చేసియైన నీబందెనుండి వద
లించుకొని పోవుదమన్న నీవల జస్వంతరావు భిల్లలనిర్మూలమునకు నొడలు దాచుకొనక
పనిచేయసాగుటచేఁ దనకు వారికడ సేమ ముండదనుమాట నిశ్చయమని తెలిసికొని

యక్కడికిఁ బోవుట యవివేకముగ నెంచి యెట్లయినను రసపుత్రులతో నుండుట యుక్తమనుకొనెను. రసపుత్రప్రభు వాడినమాట తప్పనిపురుషుఁడగుటచే గోమాజీ రావునకుఁ దాను వాగ్దానముచేసిన వేయివరహాలును భేతాళసింగుచేతికిచ్చి యంపినను జిత్తులమారితనమున నక్కనుజంపి పుట్టినభేతాళుఁ డావిత్తము దానే యపహరించి గోమాజీరాయనకిచ్చినట్లు రాణాకు విన్నవించెను. గోమాజీరావువద్దనుండి భేతాళసింగు వద్దకు రాయబారమంపఁబడిన వామనభట్టు మెల్లగాఁ గోటలోఁ బ్రవేశించి కొత్వాలు కీయవలసినసొమ్ము నిమ్మనియు సొమ్మిచ్చినవెనుక నెంతయు సహాయము చేయుననియు వానినడిగెను. భేతాళుఁడాతని పలుకులువిని ,,యోరాయీ, వామనభట్టా! గోమాజీరావు నకు నేను సొమ్మునిచ్చుటకు వాఁడుమాకుఁ జేసిన సాయమేది. నేనొక్కదమ్మిడీయైన వాని కీయను. నీకు నూరురూకలనిచ్చెదను. నీవాసొమ్ముఁ దీసికొని యీసంగతి రాణాకుఁ దెలియ నీయకుండు" మని వానినొడఁబఱచి వానికిముందేఁబదిరూకలిచ్చి తక్కినది తరువాత నొసంగఁగలనని చెప్పి వానిసమ్మతింపఁ జేసెను. తరువాత దౌలతరావు రాణానుదర్శించి శాయాజీమహారాజు పక్షమున నహల్యాబాయికి సందేశమంపుట కర్తవ్యమనియు రసపు త్రులు శాయాజీతోఁ గలసిరని విన్నచో రాణి తప్పక కోరిన పద్ధతులప్రకారము నొడం బడిక గావించుకొనుననియు నట్లు వామనభట్టు రాయబారిగ నేగఁదగిన వాఁడనియు నచ్చఁబలికి రాణాతోఁ జెప్పవలసిన యంశములనెల్ల మనస్సునకు నాటఁజెప్పి వామన భట్టును రాణాయనుమతిమీదఁ దగుపరివారముతోడను జెండాలతోడను రాయ బారమంపెను. వచ్చియహల్యాబాయి యనుమతిని నామెహజారముఁ బ్రవేశించి వామన భట్టు ప్రాణముల నగ్గఁబట్టుకొని భయపడుచుఁ గూరుచుండ జమానుఖాను మొదలగు తురకలు పదుగురు తుకాజీశినానా మొదలగు సేనాధిపతులు రాణిని బరివేష్టించి యాసందేశమును వినఁగోరిరి. అంతట రాణిమొగముఁ జూచి వామనభట్టిట్లనియెను. అమ్మా శాయాజీహోల్కారుమహారాజుగారు నన్నుఁ దమవద్దకంపినారు. ఇందూరు రాజ్యమున మీకులేశమైన భాగమీయమనియు సర్వస్వము తనపాలకజనకులగు మలహారురావుగారిదే యగుటఁ దమకే రావలయుననియు మనోవృత్తిగ మీకుఁగొన్ని జాఘీర్లిచ్చెదమనియు రాజ్యము వదలవలసినదనియు వదలకున్న పక్షమునఁ దాము రస పుత్రులతోఁ జేరుదుమనియుఁ దమతో మామహారాజుగారు మనవిచేయు మన్నారు. రాజపుత్రులకుఁగూడ నాలవవంతు రాజ్యమొసంగవలయునట. దీనికుత్తరముఁ జెప్పి నన్ను సత్వరమంపవలయునని ప్రార్థించుచున్నాను. అని చెప్ప నహల్యాపక్కననవ్వి ,,మీ మహారాజుగారెందున్నవారు వారు మాకగపడుదురా" యననాతఁడు చిత్తము, వింధ్యపర్వతములలోనున్నారు తల్లీయని ప్రత్యుత్తరమిచ్చెను. ఇచ్చునప్పటికి జమాను

ఖాను వెనుకపాటునవచ్చి వామనభట్టుయొక్క భుజదండము గట్టిగఁ బట్టుకొని రాణి తో " అమ్మ వీడుకుట్రలలోఁ జేరినవాఁడు వీనినిబట్టి చెఱఁబెట్టినచో నద్భుతములు గొన్ని మనకుఁదెలియఁగలవు సుండీ"యని విన్నవించి వానిరెండుచేతులకు నరదండలు బలిమిచే వేసి ""నీవు ఖయిదీవయినావురా" యని నిలువఁబెట్టెను ఇంతలో నీకార్యముసహింప నోపక వానితోవచ్చినరాజపుత్రులు వరిలలోనుండి తళతళమెఱయు కత్తులనూడఁ బెఱికి మహారాష్ట్రులపైఁ బడినఱుకఁ బోనఁ బ్రతివిధానము నొనర్పఁబోవు తుకాజి మొదలగువారి వారించి, జమానుఖాను వారిపై సింగపుఁ గొదమచాడ్పున దుమికె యీ పదువురిలోసగమునుతత్క్షణమే మృతినొందించెను తక్కిన తురకలు రసపుత్రులఁ బోరిఁ గొనుటచే రసపుత్రులు దక్కిన యేవురునంతమడిసిరి వామనభట్టును చెఱఁ బెట్టినవార్త దౌలతిరావువిని యుక్కుఁదక్కి శవమువలె కళకాంతులులేక దీర్ఘనిశ్వాసములచేఁ దన యటమటముఁ బ్రకటితముగాఁగ నింకఁ దనమరణము నిశ్చయమని బెంగఁగొనెను

ఇరువదియవ ప్రకరణము

హరిహరపాండ్యాజీ తన హృదయమును తెరచి మనోరథమునుఁ దెలియఁబరచి బాజీరావు నాకార్యమునఁ బనిసేయుమని నియోగించిన తరువాత శాయాజీ మహారాజు మెల్కొని బాజీరావును జేరఁబిలిచి యదివఱకెన్నఁడుఁ జూపనిదయ నాతనిపైఁజూపి మెల్లగా నాతనితో నిట్లనియెను ఓరీ కుఱవాడా! నీవునాకొకకార్యముఁ జేయవల యును సీతనునాకు వివాహము సేయుటకు గండాభిల్లు మొదలగువారు నిశ్చయించి నారుకాని యామెకిష్టములేనట్లు గనఁబడుచున్నది నామీఁద గాఢానురాగ ముద యించునట్లు నీవామెతోఁ బలుకవలయును నీవామెయొద్దకుఁ బలుమాఱుఁ బోఁగలుగు నటుల నేను త్వరువుఁజేసెదను నావంటి మహారాజుఁ జెట్టపట్టిసుఖింపఁ గలుగుట యామెకెన్ని జన్మములకైనను దొరకునా ఇప్పుడీపర్వతముమీద నొంటరిగ నే నుండుటచేత నామెకలక్ష్యముగనున్నది కాబోలును ఉదయపురాజ్యము స్వాధీనమైన తరువాతఁ దానురాణీకావచ్చును వెండిగొలుసుల తూగుటుయ్యాలలోఁదుఱలేని రత్న భూషణములు ధరించుయోగ్యత కామెనోచుకున్నది గనుక తనవంటి దానిపై నావంటి మహారాజునకుననురాగముదయించినది నాకుట్రకొల్లాపురిమహారాజుగారుసింధియామహా రాజుగారుపిల్లనిచ్చెదమని వర్తమానమంపించినారుకానినామనస్సీమెపైఁదగిలియున్నది ఈమెనన్ను నిరాకరించినను బలిమిచేనైన నేనీమెపొందునొందకమానను కాఁబట్టి

యీవివాహమునకు సమ్మతింపుమనియు ముందుగా నేను దానితోఁ గొన్నిరహస్యములు మా
టలాడవలయును గనుక సమయమెఱింగి జేయుమనియు నామెతో నాపలుకులుగా
మనవిచేసి యొడఁబఱచిరమ్ము ఇదియేరికిం దెలియనీయవలదుసుమీ' అని మహారా
జునడుగ బాజీరావు కొంచెము యోచించి తనసేవకుఁడనగు నేను దమకుఁ బ్రియమును
జేయనా! ఆమెను హరిహరపాండ్యాజీకూడ మోహించియున్నాఁడు వానినిమీరురహ
స్యమునఁగడ తేర్తురేని యీమెమిమ్ముదప్పకవరింపఁగలదిసుఁడీయని విన్నవించుకొనమహా
రాజుబ్బియీవేళసాయంకాలముననే హరిహరునకు స్వర్గసుఖమిప్పించెద చూడు నాశక్త
యని ప్రతినఁజేసికుట్టువానిలోనికం జననిమ్మని భిల్లులతోఁజెప్ప మదనాయత్తచిత్తుండైతవం
తిహాఁ బొందుమశాయాజీ హరిహరునిఁ జంపుటకుఁగనలుమండెను జస్వంతిరావుచేఁ దన
బలగము ముక్కముక్కలుగ ఖండింపఁబడుటకు ఎగచి గండాభిల్లు ప్రభువును దమ
ముందు పోకలగూర్చి కరినముగ నడుగఁదలంచివచ్చి గుడారముసొచ్చి యిట్లనియె
"మహాప్రభూ! ఏలినవారికిఁ బట్టాభిషేకమయినది మొదలు జస్వంతరావు మాచుట్ట
ములను మేకపోతులనటికనట్లు నఱుకుచున్నాఁడు దౌలతరావు ల్వరలో వత్తునని చెప్పి
యీవఱకు రాఁడయ్యె మేముదోచుకొనివచ్చిన ద్రవ్యమంతియు వ్యయముచేసి హాయిగాఁ
బిండివంటలతో మీరుముమ్మారు భోజనముసేయుచు మానిమిత్తము శ్రద్ధచేసినారు
కారు మీరు పరాక్రమవంతులనుకొని యింతమహాపదవి మీకిచ్చితిమిగాని మొదట నే
యింతటివారగుట దెలిసినచోఁ బట్టముఁ గట్టింపకుందుము మాతో మీరుకలసి యుద్ధము
నకు వచ్చెదరాలేదాయని నిష్ఠురోక్తులనాడిభిల్లుఁడు నిలువ శాయాజీవానింగన్నెత్తిచూడ
లేక తలవంచి మెల్లగానిట్లనియెను నేనుమిమ్మునడిపించి మీకుసేనానాయకుఁడనై
రాజ్యముఁగొన యత్నించుచుండఁగా నన్నిట్లాడఁదగునా! వివాహమైనతరువాతకత్తిగట్టి
యుద్ధముచేయవలెనని యున్నది అదియటుండ హరిహరపాండ్యాజీ మనపై రాణితో
నేరములుచెప్పుచున్నాఁడట ఇతఁడున్నపక్షమునమనము నెగ్గఁజాలము నీవీరాత్రి వీనిని
గడతేర్తువేని బెండ్లియైన వెనుక మనమరుగుదము అనిచెప్ప భిల్లుఁడు గోపముతోఁ
గనులెఱ్ఱఁజేసి యుద్ధమైనఁ దరువాత నీవువివాహమాడ వచ్చును ముందుగా వద్దు అది
గాక యీదినమున నారెండవకొడుకును నాకు జయముగల్గుటకై కాళికబలియిచ్చు
చున్నాను బలియైనవెంటనే మనము వెళ్లినచో జయముగల్గును ఈపుతిప్పుడు హరి
హరుఁడు మనపైఁగుట్రలెన్నఁడుఁబన్నకుండఁ జేసెదనుతెయని గుడారము వెడలియావలకుం
జనెను ఆతఁడరిగినవెంటనే బాజీరావు మహారాజువద్దకువచ్చి నిలిచి సంతోషముతో
స్వామీ మీరుచెప్పినట్లు సీతతోఁ జెప్పినాను. మీవంటి నవమన్మథుని మహారాజును
జెట్టపట్టుటామె కిష్టముగ నుండకపోవునా? అన్నిటికినామె యొప్పుకొన్నదిగాని మీ

రాఁగుడారమునకు రావలదనియుఁ దానే మగవేషము వేసికొనియాగుడారమునకు రాత్రివత్తు ననియుఁ జెప్పుమన్నది గాని తమరునన్నీదినమునఁ జెరవిడిపింపవలయును లేకున్న నేనిది చక్కఁజేయనుసుడీ యని కర్ణానందకరముగఁ బలుక మహారాజుయొక్క శరీరము పులకలెత్తమనోరథసిద్ధి నేటికిగదా చేకురుటయని యానందమొందుచు నాతఁడు నిన్నివేళ సాయంకాలముననే చెరవిడిపించిపంపెదను భయపడకు నీమేలు నేనుమఱువఁజాలను మిత్రుఁడాయని గాఢాలింగన మొనర్చి యభ్యంజనము చేసి నూతనవస్త్రాలంకృతుఁడై సూర్యుఁడెపుడస్తమించునాయని పరితాపమొందసాగను ఒకమారు బాజీరావును బిలిచి నీమాటలు నాకు నమ్మకముగలేవు ఆమచేనట్లుసమ్మతముని పలికఁపుము అని వేడుకొనుటచే గుడారము ప్రక్కను మహారాజునుగొనిపోయి, బాజీరావు, సీతా నీవిందాకఁ జెప్పినట్లు చేయుదువుగా అని యావలనుండి కవేయ నామెయు నిశ్చయముగఁ జేసెద సందేహమేల యని మృదుమధురస్వరముతోఁ బ్రత్యుత్తర మొసంగెను అంతట గుండెదుడుకు తీరనందున శాయాజీ బాజీరావును బంపుప్రయత్నము చేయుచు దేలరావునొద్దకు నాతనినంపెదనని గండాభిల్లుతోఁ జెప్పియొడఁబరచి పల్లకిని బోయలను సిద్ధముగఁ జేసెను ఇంతలో సాయంకాలమైనందున సీత బాజీరావుచెప్పిన చొప్పున మాటఁ దప్పకుండ వర్తింపఁదలంచి, చక్కని తెల్ల యిజారును నట్టిదే యంగరకాయు నట్టిదే తలపాగయుధరించుకొని చెలి నొక ఖడ్గముంబూని తన గుడారమునుండి సమయముఁ బ్రతీక్షింపఁదొడఁగె ఆరాత్రి సిలనిమిత్తము శాయాజీని సంహరింపఁదలఁచి హరిహరపాండ్యాజీ రెండుజాముల రాత్రియైన తరువాత గాఢనిద్రాసమయమున వాని ద్రుంపఁదగునని ముందుగాఁదాను నిద్రింపుచుండెను ఇంతలో గండాభిల్లు గండ్రగొడ్డలి భుజముపై వేసికొని యెవరితోడం జెప్పక హరిపంతుని గుడారముచొచ్చి నిద్రాసక్తుఁడై తలనిండనున్న కోర్కెలచే గడియకొక స్వప్నముఁగను చున్న యానిర్భాగ్యునిఁ గని గొడ్డలినెత్తి సత్తువమీఱ నాతనికంఠభాగమున నొకదెబ్బదీసెను వెంటనే శిరమును ముండెమును వేఱుగఁదొలగింపఁబడె ముండెముకొట్టుకొనుటయు యెఱ్ఱనిరుధిరప్రవాహము గుడారము నిండుటయు భిల్లుని నయనములకుఁ బర్వము సెయ నాతఁడు జుట్టుపట్టుకొని చచ్చినవాని తలయెత్తి తిన్నగా శాయాజీయున్న గుడారమునకుంజని వానింగని „చూడు నీహరిహరుఁడెట్లున్నాఁడో" యని యారక్తసిక్తమగుబుఱ్ఱ వానితోడపైఁబెట్టెను అదరిపడి శాయాజీలేచి గడగడవడక భిల్లుఁడలుక వహించెనేని తన పనియట్లయగునను తలంపుమదికిఁ దట్ట మెల్లగా „నీవు సాహసుఁడవు మంచిపనిచేసినావు నీవంటివాని నెందుఁజూడలేదు మన్నెసుల్తాను బిరుదుకంటె ఢిల్లీసుల్తాను బిరుదు నీకుఁదగునుమీ" యని వానిని స్తవమొనర్చి చల్లనిమాటలతో సాగనంపి తనపనిమీదఁ దానుండెను

MARRIAGE REFORM వివాహ సంస్కరణము

(కాకినాడసంఘసంస్కరణమువారియెదుటఁ జదువఁబడిన యుపన్యాసము)

భూమిపై జన్మమెత్తినందుకు, సార్థకముగ ప్రతిమానవుఁడును తాను సుఖపడి యితరులను సాధ్యమయినంతవరకు సుఖపెట్టవలెను తనచేయు పనులవలన తనచుట్టు ప్రక్కల, నిరుగుపొరుగుల నున్నవారికి క్షేమము సంతోషము గలుగవలెను ఉపకారము, సదుపాయము నాలోచించి ప్రతికార్యమును జేయుచు, తనమూలమున నితరులకు లేశము తొందరగలుగకుండఁ జూచి, శక్యమైనచో, నిరుత్సాహులను సోత్సాహులను గావించుచు విద్యాధిక్యములోనగువానివలనఁగలుగు సంతోషాతిశయములను, సామాన్యులకు లభింపఁజేయుచు కాలముఁగడుపుట కర్తవ్యము మనయుష్వవిషయమున శ్రద్ధాళువులమై, సత్యసంధులమై ధారాళవర్తనముగలిగియున్నంతమాత్రమున నేవానివలన లోకమునకుపకారముకానేరదు ఈసుగుణములకుతోడు, భగవంతునిముఖముచూచి, పరోపకారసాధనములగువాని నవలంబించుచు, పలువురకు సంతోషదాయకములగువాని ననుష్ఠించుటయ పరమధర్మము ఏకార్యమునైన నిహపరసాధనముగ నెంచి చేసినచో నది నీతిదూరము గాక, సర్వకాలములందును సర్వజనరంజకము కాఁగలదు ఏవిధముననైన నందరిని సంతోషపెట్టవలెనని తలపోయుచు, క్రియలవలన నెన్నటికి లేకున్నను, అప్పటికెదుటివారు వ్యామోహితులై కొండంతయాశతో నుండులాగున మాటలతోనే యావజ్జీవమును మోసపుచ్చువారు గణనాతీతములుగఁ గలరు అట్టివారిగుట్టు నెఱుఁగక, జనులు భ్రమసి, వారిమందహాసములను, వారితేనెమాటలను, వారియాలింగములను, వారి శూన్యసత్కారములను వారినైజగుణమున కంకణములనుగా భావించుచు, భ్రమఁ జెందుదురు నీతికకట్టుపడి, యథార్థమునే వచించుచు, పామరజనస్తవమున కాశపడక, స్థిరసుఖసాధనమైన మార్గముఁ జూపువారప్పుడునుతమ కాలమునజనులకష్టులు కానేరరు రాజ్ఞీచక్రవర్తినిగారి మృతుఁడైన మనుమఁడు ప్రిన్సుఆల్బర్టు హిందూదేశమునకు వచ్చినప్పుడు కలకత్తామైదానమున బాణవినోదాదుల కొరకు రు 45000 వెచ్చించుటకు లిప్టినెంటు గవర్నరు మొదలగువారు నిర్ధారణముచేయఁగా, నిష్కపటుఁడై, ప్రజోపయోగ కార్యాచరణరతుఁడైన సురేంద్రనాథ బెనర్జిలేచి, యాధనము నాతీరున పాడుచేయుట కన్న కుష్ఠురోగపీడితులకు వైద్యశాలను స్థాపించుట కొరకు వినియోగించిన

ప్రభుభక్తి సూచకముగ నుండునని చెప్పఁగానే, నిప్పును ద్రొక్కినకోతులవలె నంద
రాతనిపై క్రోధావేశులై లేచిన యంశమును మీరు మఱచి యుండరు వాస్తవముగ నొక
నాటిరాత్రి కాల్చినమందు గుండు సామానుల వలన కలకత్తాలోని లక్షలకొలది జనులకు
గలుగు సంతోషము, బెనర్జిగారి యేర్పాటువలన రానేరదు కాని యీరెంటిలో
నెద్దానివలన నుపయోగ మెక్కువగనున్నదను సంశయమును విచారించు వివేకము జనసము
దాయమునకు సామాన్యముగ నుండఁబోదు పలువురు లెప్పక బాణవినోద సుఖము నే యాసిం
తురు మనమేపని నాచరించినను ప్రస్తుతమున నది జనానుకూలముగ నుండును గదా, దీని
వలన నిప్పటికి మనల నిందింపరు గదా, ముందుగతి మన కేలయని యెంచక, నిష్ఠురమున
కోర్చియే యుండవలెను లను యంతరార్థము బోధించువానిని జవదాటి, పామరస్తవ
మును, స్వప్రయోజనము నాసించువారెన్నటికిని లోకోపకారులు కానేరక, పైకి
నెమ్మదిగ నన్నిటిని కూడఁగట్టుకొనివచ్చుచున్నట్టు కనపడినను, తుదకు మహాపకారు
లగుదురు "నలుగురితో గోష్టునాకేల, బ్రదికిన నాలుగుదినములు పదిమందిచేత మంచి
వాఁడననిపించుకొని చత్తున"ని మెట్టవేదాంతమును చెప్పుచు కడుపులోని నీరుకదల
కుండ కూర్చుండి, తుదకు భూభారమును వదల్చువారితర దేశములందుకన్న మనలో
నెక్కువగనున్నారు అట్టివారాత్మగౌరవహానికైన నొప్పుకొని పామరస్తవమునే గొప్పగ
భావింతురు తమరేపక్ష మెక్కడ నవలంబించిన నందరికి మంచివారగుదురో దానినే
వెదకుచు, ప్రతిదానికి వల్లెయనుచు, నెమ్మదిగ కాలమును గడపు నుపాయముల
గ్రహించి నిజమును కపటవర్తనమును త్రాటితో బిగించి యురిదీయుదురు ఇట్టివారె
పరులనొప్పింపక తామునొవ్వక తప్పించుకొని తిరుగు ధన్యులు అట్టివారికి విరోధులు వెదకి
నను కానరారు ఎట్టిమహాకార్యము నైన నీవిధమున చులకనగ తేల్చుటచేత, భగవం
తుఁడు కూడ వారినడత నామోదించునని భ్రమఁజెందుచున్నారు. సద్వర్తనుఁడు కొన్ని
వేళల తనప్రాణహానికైన వెఱవక సత్యమునే పలికి, దానినాచరింపక తప్పదు లోక
క్షేమము, సత్యము, గౌరవము, న్యాయము పుణ్యము గురియలందుండెనేని, కష్టము
లను పాటింపక, ప్రజ్ఞను వెల్లడించి ప్రమాదమును తొలగింపవలెను అట్లుచేయక ప్రతి
మనుష్యునిచేతను మంచివాఁడనిపించుకొనవలెనని యత్నించువాఁడు తుదకెవ్వరికిని
మంచివాఁడుగానేరక, లోకమున కపకారియు, తానును తీరని మనోవ్యథకు పాల్పడును
కాని మనదేశమునకు ముందు మంచికాలము రాఁబోవు సూచనలుండుటవల్ల, కేవల
మందరు కపటనాటకసూత్రధారులు గాక, జనాపవాదమునకు వెఱవక సత్యప్రతి
పాదనరతులై, చరించువారు నలుదిక్కుల చెదరియుండి, స్వశక్త్యనుసారముగ సంఘాభి
వృద్ధికి పాటుపడుచున్నారు అట్టివారి యుద్దేశమున వివాహసంస్కరణము ప్రధానమై

దానికి శాసన నిర్మాణసమయముకూడ వచ్చినందున, దానింగూర్చి నేడు ప్రసంగించెదను నిజమాడుట నేరముగ నెంచవలసినకాల మీదేశమునకింకను రాలేదని కలకత్తా న్యాయవాది సభవారీనడుమ దొరతనము వారికి వ్రాసియున్నారు ఆకాలమింకను రాలేదనియే నమ్మి వివాహములలో నాకులోపములుగఁ దోచినవియు, మనము విశ్వప్రయత్నముఁ జేయ నక్కఱలేకుండ చక్కపరుచుకొనఁగలిగినవియు నైనవానిని కొన్నిటి నుదాహరించెదను

1 <u>వరశుల్కము</u> కొంత కాలమువరకు మన యాంధ్రదేశమున సామాన్య బ్రాహ్మణ కుటుంబములలో కన్యాశుల్కము ప్రబలియుండెను దాని నివారించుటకు మృతులైన విజయనగరము మహారాజు శ్రీఆనంద గజపతిరాజుగారు ప్రస్తుతము నెల్లూరు మండల కోశాధికారిగానున్న రాయబహద్దరు శ్రీవల్లూరి జగన్నాథరావు పంతులవారి ప్రోత్సాహమున, చన్నపురి శాసననిర్మాణసభలో నొక చట్టమును పుట్టించుటకు 1888 సం॥రమున నుద్యమింపఁగా, కొంతవరకుమత సంబంధమైనదానిగా నెంచి, దాని జోక్యముకలిగించుకొనుటకు దొరతనమువా రంగీకరింపరైరి ధనాశాపీడితులై తలిదండ్రులుతమ కన్నబిడ్డలను వయోవృద్ధులకు, అంగవైకల్యులకు, బధిరులకు పెండ్లిచేసి, వారలసౌఖ్యము లేశము నాలోచింపక, తుదకు వారలతీరని వైధవ్యమునకుపాల్పరచి, పెద్దింటి చిన్నమ్మ యవస్థకుఁ దెచ్చుటవలన, మన దేశమున మనోహర రూపములతో నొప్పుబాలికలు, చిన్ననాటనే, ముష్టముండలుగను, నిటిమోతికత్తెలుగను, వంటబ్రాహ్మణక్కలుగను గుడిసెవేటులుగను, రెండవపెండ్లి భార్యకాపురమునను రానిగౌరవనీయులకు ఆతుర నివారణ సాధనములుగను మారి మన సంఘమున కపకీర్తిని దెచ్చుచున్నను, దాని నివారణమునకు పట్టుదలతో మనలో నెవ్వరును బ్రయత్నింపరైరి కన్యాశుల్కము కేవల నరమాంసవిక్రయమేయనియు, శాస్త్రదూష్యమనియు, శుల్కము గైకొన్నవాఁడు నింద్యుఁ డని చాటునగుసగుసలాడిక అట్టివాని సంఘమున నగౌరవము పరచిరేని, దానివలన నితరులకు బుద్ధిరాక మానదు ఎవనిపాపమున వాఁడేపోవునను వైరాగ్యము కుదురుటచే, సంఘమున నెవ్వనికి భయములేక, మీఁదు మిక్కిలి ఎవ్వరైన తెంపరినోరెత్తిన, వానిని న్యాయాధికారులకడకీడ్చి, మాననష్టమిప్పించే, వానివలన గొప్పయపరాధములనులంకించుట కూడ తటస్థించుచున్నది ప్రతివానికి నామమాత్ర స్వాతంత్ర్యముండుటచే, మనలో దూష్యాచారములు ప్రబలి నివారణమార్గములులేకయవిదినదినప్రవర్ధమానములగుచున్నవి మతగురువులు సహితము భిక్షావందనములతో సంతుష్టులై పొట్ట పోసికొనవలసివచ్చిన కాలమున నేమియభివృద్ధి మనలో కానఁబడును! సామాన్యపంథినివలెనే మఠాధిపతిని కూడ న్యాయసభకీడ్చి శిక్షించుటవలన మతభయము జనులకులేదు సంఘమున పామర జనవాక్యము, స్వప్రయోజనపరులైన విప్రుల యుపదేశము, బలీయమై, సదుపదేశము

కఠోరముగనుండును యుక్తాయుక్త పరిశీలనమున్నగిల్లి, ఒక్కరికన్న తాము నిష్ప్ర
యోజనాంశములలో నాధిక్యము గనపర్చవలెనన్న యభిలాష హెచ్చుగుచున్నది కావు
ననే వివాహములలో వియ్యపుకాని లాంఛనములు, వియ్యపురాలిలాంఛనములు, ఆడు
పడుచుల లాంఛనములు, పందిరియలంకారములు, కర్పూర హారములు ప్రధానములై,
వధూవర వయోనిర్ణయము, సంప్రదాయము, విద్యావివేకము, రూపరేఖా విలాసము,
రండవపక్షముగనున్నవి ఇంతటితో సరిగాక, హూణవిద్య దేశమున వ్యాపించిన
కొలది వరశుల్కముకూడ దినదినప్రవర్ధమానమై సామాన్యగృహస్థుల నష్టపెట్టఁగలుపు
మన్నది దీనిబారినుండి తప్పించుకొనుటకు సాధనాంతరముగానక పలుకుటుంబములు
దేశమందన్నిచోటుల చెప్పరానికడగండ్లపడుచు, మెకాలే, బెంటింకులను మన
దేశమునకు మహోపకారులనుగా భావించుచున్నారు పట్టణములలో కొంచెము ధనము
చేరుటవలన, నచ్చటి యుద్యోగియులు, వర్తకులు కందుమీఁదెరుగక చేయు దుర్వ్య
యమును జానపదులు వింతగాఁజూచి, ఆచొప్పున తాముకూడ జరిగించిన లెస్స
ను నాగరికులనుకొందురను భ్రమచే, వారి మార్గముల నవలంబించి, సర్వసర్వత్ర దు
ష్ప్యాచారముల నెలకొల్పుచున్నారు హిందూవివాహ హిందూశ్రాద్ధకర్మలలో జనులు
శరీర పరవశులై, పామరజనస్తోత్రమునకు దాసులై, ఋణగ్రస్తులగుచు దరిగానన
కుండుటఁజూచి, వారలనుద్ధరించుతలంపుతో పాంచాలదేశపు లెఫ్టినెంటు గవర్నరు సర్
ఫిట్జిపాట్రిక్కు దొరగారు 1894 సంవత్సరమున నాదేశపుమండల కరగ్రాహుల కంద
రకుకొన్ని యుత్తరువులనిచ్చెను వివాహవ్యయములలో మూఁడువంతులనావశ్యకములైనవి
గలవని ప్రతివానికిఁ దెలిసియున్నను, వానిని ముందెవ్వఁడు తగ్గించిన వానిని లుబ్ధుఁడను
కొందురను భీతిచేతను, తనమార్గము నితరులు త్రొక్కకుండిన తానొక్కఁడనే దృష్టి
బొమ్మవలె నుండిపోదునను శంకచేతను, శక్తనిమించి పరుగులెత్తువారే యెక్కుడుగ
నుండుటఁజేసి, అట్టివారి సంరక్షణముకొరకొకశాసనము నేర్పరచి, దాని చొప్పునవారు
నడువకుండిన వారికపరాధమును విధించుట యుచితముగనుండునని తలపోసియు,
కొంత కాలమువరకు మండలాధికారులు స్థానిక సమాజముల నేర్పరిచి, యందలి సభికులు
తమనిబంధనల జవదాటకుండఁ బ్రవర్తించినవారినే నగరిపారిశుద్ధ్య విచారణసంఘములు,
స్థానిక స్వపరిపాలన సంఘములు, గ్రామపంచాయితీసభలు లోనగువానిలో సభికులుగా
నియమింప వలయుననియు, నీతిబలములేక నేలబీరకాయలవలెనుండు విద్యాధికు
లను, ధనాధికులను, వారివందిమాగధకవారములతో సంతుష్టులైయుండునటు చేయుట
మంచిదని తలపోసెను వరశుల్క బాధను పుత్రికలుగల మీలోకొందఱు నాకన్న
వేయిరెట్లు చక్కగవర్ణింపఁగల్గుదురు విద్యాబుద్ధులుగల్గిఅక్కరకురాఁదగిన యల్లునిసంపా

దించుకొనవలెనని కొందరు, చదువుసంధ్యలు లేకున్నను పూర్వార్జిత విత్తక్షేత్రములున్న వాఁడు దొరికిన చాలునని కొందరు, వియ్యంకునినున్న నిగడ్డమును, కోటిఫలితట్టును కట్టిన తిటతటబండిని, చావడిలోని పాతవార్తాపత్రికలను, అందమునకు తెచ్చి పెట్టుకొనిన అకాలపుచత్వారపు సులోచనములనుజూచి, అట్టి వానితో వివాహసంబంధముండుట కన్న కావలసినదే యున్నదని తలచువారు కొందరు, తమకడుపున పుట్టిన కొమరులగతి నాలోచింపక శ్రీ తిరుమల వెంకటేశ్వరునకు నిలువుదోపిడి నిత్తుమని మ్రొక్కుకొను మూర్ఖులవలె, ముక్కుపచ్చలారని యల్లునకును, పూటకుగతిలేని యల్లునకును, గొప్పకట్నములనిచ్చి విజృంభణముగ పెండ్లిచేసి, పిమ్మట పశ్చాత్తప్తులగుచుండుట మన మెఱుఁగని యంశముగాదు వరునితలిదండ్రులు సంరక్షకులు దయావిహీనులై, పుత్రికాసంతాన పతితుని పూతుని జేయుటకు విధించు బహుమానరూపక దండనధనము నిచ్చుకొనలేక, తమకును పుత్రులనొసంగక, జీవనమార్గనాశహేతువులైన పుత్రికలనిచ్చినందుకు మాల విధిని నిందించుచు, కన్నబిడ్డలయ్యును వారల శత్రుప్రాయులనుగఁ జూచుచు, వారల కొకయేడు పైనిబడినకొలది వేదనవృద్ధియు, తుదకు వారల కన్నెచెఱ నెట్లో దీర్చుచున్నారు వివాహవ్యయనిరోధముకొరకు సర్ ఛార్లసు యిలియటుదొరగారు చేయించిన విచారణలో, నోకల్లిమండలాధికారియైన మే॥ అగస్థిగారు రెండు దృష్టాంతముల నుదాహరించియుండిరి ఒకానొక సంపన్నగృహస్థును కొమార్తెకు యుక్తవయసువచ్చినను, ఏలయింకను పెండ్లిచేయలేదనియడుగఁగా, మండలమునసంకురించియున్న విషూచిజాడ్యములలో తనకొమార్తె కూడ కడతేరకుండునా యను ధైర్యముతో వేచియుండెఁగా, తనసర్వస్వమును కడతేర్చుట కాచిన్నదే బ్రతికియుండెనని చెప్పెను ఇంకొకఁడు వృత్తివలన వైద్యుఁడయ్యును, బాలపాపచిహ్నరోగముచే బాధపడుచున్న తనకూతునకొక్కసారియైనను మందువేయక యూరకున్నను, మొండిజీవముగల తనకూతురు తనకొంపనుముంచుటకు బ్రదికెనని వాఙ్మూలమిచ్చెను దీనివలన చూడఁగా కాలక్రమమున మనయాంధ్రదేశమునకూడ తండ్రులు పిల్లలచావును మనస్ఫూర్తిగ కోరుకొనుగతి పట్టుననితోచెడిని గంగానదిలోని మొసళ్లకు బిడ్డలను పారవేయు నాచారమును దొరతనమువారు కష్టముమీద మాన్పించినను, వివాహప్రతిబంధకమున మరల మనలో కొన్నాళ్లకు శిశుహత్యలారంభము కాఁగలవేమోయని శంకపొడముచున్నది లోకుల ధనమును వడ్డికిఁ దెచ్చి వర్తకము సాగించుచు, నూటక నూర్గుల నిముపచ్చినట్లు నటించి యాదాయపుపన్నును మూడునాలుగేడులిచ్చి, ఈనడుమ భార్యదేహము నంతను సువర్ణమయముగావించి, తుదకాంధ్రదేశపు ఆల్సేషియా (Alsatia) యనఁబడఁదగిన యానామున సుఖాన నివసింపఁ దలచిన వణిక్శిఖామణులు వేలకొలది కట్నముల నల్లురకీయఁ

జెల్లునుగాని, పులినిజూచి నక్కవాతలఁబెట్టుకొనినట్లు, గోచికిపెద్దయంగవస్త్రమునకు చిన్నగనున్న సంసారులుకూడ వారల వితరణము నవలంబించి చెడిపోవుటకన్న విచారకరమైన యంశమును వేరొక్కటి యూహింపఁజాలను కన్యకకు వివాహకాలనిర్ణయము నేర్పరచి, దానిఁజవదాటిన కులభ్రష్టత విధించుటవలనను, వరునకు వివాహకాల నిర్ణయములేక, వాఁడు పేరునకు బ్రహ్మచారియై దుష్ప్రవర్తనమున నున్నను కులభ్రష్టతలేక పోవుటచేతను, ధనాతురతచే వరునిసంరక్షకులు కొన్నివేళల స్వతంత్రుఁడైన వరుఁడు, నిరాధారుఁడైన కన్యకతండ్రియొక్క యాతురతను జూచి తమబేరమును హెచ్చుచేయుదురు కులమువారిలో బుద్ధియున్న చక్కపడవలసిన యీయంశమునకు దొరతనమువారి సహాయము నావశ్యకమని నాయభిప్రాయము ఈయనర్థకమును దొలగించుటకు మనలోని విద్యాధికులకు పూర్ణసంకల్పమున్నను, స్వవిషయమున మాత్రము సమయము వచ్చినప్పుడు గుట్టుబయటపెట్టుదురు చాలమంది బాలురకు యుక్తవయసు వచ్చునందాక వివాహములఁ జేయకుండిన, వారికి పాఠశాలలో కరచిన విద్యవలనఁగలుగు యుక్తాయుక్త వివేచనజ్ఞానమువలనను ప్రపంచానుభవమువలనను, ధనమునే ప్రధానముగాఁ జూడక, తాను పెండ్లికాఁబోవు బాలికయొక్క రూపగుణాతిశయములను, సంప్రదాయము నాలోచించుకొని, తనకుతగిన యర్ధశరీరిణిని సంపాదించుకొనును ఇట్టిస్వతంత్రము తలవంద్రులకు వదిలి కొమరులపైఁబడిన, నుభయపక్షములకు క్షేమము నిశ్చయము కొద్దికాలముక్రిందట కలకత్తా సర్వకలాశాలాపరీక్షలలో రు 1500 ల విలువగల ప్రేంఛందు రాయచందు బహుమానము నందిన పట్టపరీక్షాసిద్ధుఁడు తనవిద్యా ప్రయోజనమును కనపరిచి, తండ్రితెచ్చిన బేరములన్నిటిని తిరస్కరించి, తుదకు తనకునచ్చిన బాలికను వివాహమాడి, కన్యకతండ్రి సంతోషపూర్వకముగ నిచ్చినకట్నము నంగీకరించి, ఆకొమరుని వివాహపుటంగడిలో గొప్పబేరమునకు విక్రయించిలాభము పొందఁదలచియున్న తండ్రికి నిరాశగల్గించెను కొంచెము స్వాతంత్ర్యము బాలురకిచ్చి, వారికి 18 యేండ్లవరకు పెండ్లిఁజేయకుంటిమేని ఆడుపిల్లలఁగన్న పాలకులకు తరుణోపాయము కనఁబడకమానదు చూడచూడఁగ నీపాడు పద్ధతివలన మనవారందఱు బాలికలను విడిచి, ధనమును పెండ్లియాడుచున్నారుగాని, వేరుగాదు రంగూనులో నొక యూరోపియనుఁడొకబాలికను వరించి, తుదకంతయు నిర్ణయమై వివాహకాలము సమీపించునాటికి, బాలికతండ్రికడనున్న యశ్వమును కూడ తనకిచ్చినఁగాని పెండ్లియాడననఁగా, బుద్ధికుశలతగల యాబాలిక వానిది కపట ప్రేమగాఁదలచి, గుఱ్ఱమును మాత్ర మీయకుండ జాగ్రతపరుపగా దానితో నప్పటికా పెండ్లియాగిపోయెను లోనమాత్ర మన్యోన్యము ప్రేమ బలిష్టముగ నుండుటంజేసి,

కొన్నాళ్ళవరకిరువురును దూరముగనుండియు, తుదకు మరల సమావేశులైనప్పుడు జాణయగు హరాణకన్యక తన ప్రేమమును వెల్లడింపక, మెల్లని వాక్యములతో తన నాయకుని బుజ్జగించి, తన తండ్రి శుల్కమునిచ్చుట కప్పటి కంగీకరించెనుగాన, దానిని శీఘ్రముగ పెండ్లియాడవచ్చునని హెచ్చరించెను. ఆప్రత్యుత్తరమున కాతఁడు తెల్లబోయి, ఏమియుఁ బల్కనేరకుండఁగా, "ఏమి సంకోచించెదవు, నీవు శుల్కమును వరించితివి గాని నన్నుఁగాదు. నీ మనోభీష్టముచొప్పున దానిని పెండ్లియాడుటకు నాతండ్రి నేటి కంగీకరించెను. నేను నామార్గము చూచుకొందుననఁగా" వాఁడు చిన్నబోయి, తనబుద్ధిహీనతకు ఖిన్నుఁడై క్షమార్పణము వేడుకొనెను. చిన్నతనమున వార్తాపత్రికలలో చదివియుంటిని. దీని ఫలితార్థము ప్రస్తుతము మనకక్కరకు రాకమానదు. సరి శుల్కమును దండించి పుచ్చుకొనువారు తమబిడ్డలకు శుల్కమును పెండ్లిచేయుచున్నారు గాని బాలికను గాదు. ఎక్కువకట్నము నిచ్చినవారి బాలికయందు అత్తవారికి ప్రేమ యెక్కువగనుండి, సాధారణపు కట్నములనిచ్చువారి బాలికను ఓరగంటఁజూచుట మన కుటుంబములలో సామాన్యమయియున్నది. దీనివలన కుటుంబకలహములు కూడ ప్రబలమై తుదకు తిరిగి విరోధములు కూడ సంభవించుచున్నవి. కొడుకులను 'ఎత్తున కెత్తుగ' విక్రయించుకొనిన దానికి ఫలితముగ తుదకు పోట్లాటలు మిగులుచున్నవి.

అల్లునకు కట్నము నిచ్చుట దోషమాయని కొందరికి శంక పుట్టవచ్చును. దాని సాధకబాధకముల నిచట సవిస్తరముగ నాచేతనైనంతవరకు వ్రాయుచ్చెదను. ఈకాలమున వరుని తలిదండ్రులు, వధువు తలిదండ్రులను కట్నముల విస్తారముగ నిమ్మనియడుగుటకు కారణములు మూడుగలవు (1) తమకొమరులవిద్య (2) తమ దారిద్ర్యము (3) స్త్రీలకు పిత్రార్జితమున భాగము నీరూపమున నిప్పించుట. ఈకాలమున పుత్రులవిద్యకొరకు పూర్వముకన్న తలిదండ్రులు విస్తారధనమును వెచ్చించవలసిన యావశ్యకమున్నమాట వాస్తవమే. స్త్రీవిద్యకొరకు మనకు వ్యయములేనేలేదు. పురుషులలో విద్యావ్యాప్తివలన, తలిదండ్రులు చాలినంతధనమును తేలేక, సాధనాంతరములచేత మనోభీష్టమును నెరవేర్చుకొనుటకు, నిరాధారులైన యత్తవారిపై తమపుత్రికవిద్యాభారమును వైచుచున్నారు. నలువురు కొడుకులున్నవారందరు ప్రయోజకులై కుటుంబమునకు ఖ్యాతి తేవలెనన్న యభిలాష తండ్రికుండుట నైసర్గికమేయైనను, వారియందరి విద్యకొరకు ధనమును తెచ్చునప్పటికి గుడ్డుమీదకు వచ్చి కాపురము నేలపట్టమగును. దీనివలన కొన్ని కుటుంబములు కేవలదారిద్ర్యదశకు రాకున్నను, విస్తారధననష్టమునుమాత్రము పొందుచున్నవి. వారముల పద్ధతివలన కొందరు మన యాంధ్రదేశమున భోజనమున కిబ్బంది లేకున్నను, వారికసహితము గుడ్డలకు పుస్తకములకు జీతమునకుఁ గల్గుబాధ మనకు

తెలిసియేయున్నది అట్టిచో, గౌరవము నే యాలోచించి సొంతద్రవ్యములో విద్య నేర్పవలెనన్న కుటుంబములవారి పాట్లు, భగవంతునకెరుక పరీక్షలలోని ఫలితములఁ జూచితిమేని, కష్టనిష్ఠురములకోర్చి చదువుకొనువారి బిడ్డలేవృద్ధిలోనికివచ్చి బాగుపడుచున్నారు రాజధానీతరస్థలములలో నిభోజనసదుపాయమైనఁ గలదుగాని, చెన్నపురివంటి పట్టణమున విద్యకరచువారి కీసదుపాయము లెవ్వియైనఁగలవా? అక్కడ చదువుటకు చేతినిండ ధనముండవలెను లేదా చదువు మానుకొనవలెను ఎక్కడనో నూటికొక్క యదృష్టవంతునకు ధనికులైనవితంతు వొక్కరితె దొరికిన సమస్త సుఖములక్కడ జరుగును కావున నెందరుబాలురకో తగుసహాయము, ఉపాధిలేక కొద్దిపరీక్షలతో సంతుష్టులై జీవనము నెట్లో జరుపుకొనవలసినగతి సంభవించుటమనము చూచుచునేయున్నాము ఇట్టివారికి స్థితిగతులుగల యత్తవారుదొరుకుట తప్పక పేదకుపెన్నిధి దొరకుటవంటిదే కాని ధనికులను పెండ్లియైన మరునాఁడే తమకొడుకుని విద్యావ్యాజమున నత్తవారింటి కడ నేయుంచి తమచేతిసొమ్ముక కాసువీసమైన కడపకుండ తప్పించుకొనుట మాత్రము నిందాస్పదము అట్టిమహానుభావులు నేటిసభ నలంకరించినవారిలో లేరనినమ్మెదను హిందూధర్మశాస్త్ర ప్రకారము పుత్రికకు పిత్రార్జితమున దాయభాగము లేకుండుటవలన, వివాహవ్యయము కట్నము పుత్రికాభాగమున కుపాంగములని కొందరు సంతోషించుచున్నారు అల్లునికట్నము నాతని సొంతసొత్తుగ నెంచుదురుగాని బాలికకు చెందవలసినదానిఁగా మనలో నెవ్వరు నను కొనుటలేదు పైబట్టకొతగలవచ్చి, పెండ్లికూతురి వారిచ్చుకట్నమును రొక్కరూపమునగైకొని, దానిలోకొంతభాగమును నచ్చుటనే వ్యయపరచి నిజస్వరూపములతో మరల స్వగ్రామముఁజేరు పెండ్లికొడుకువారు బాలికక్షేమము నెన్నడు నాలోచించు వారుకారని నమ్మియుండుఁడు తమ పిల్లవానికి నాలుకపై నక్షరపుముక్కలున్నవి గనుక, పుత్రికలున్నవాఁ డెవ్వఁడైన వానికి బ్రహ్మరథముపట్టునన్నదుర్గర్వము తండ్రులకంకురించి వారు తమ ప్రస్తుతస్థితినిమరచి, విఱ్ఱవీగుట స్వాభావికమైనది ఇట్టిసమయమున బాలికతలిదండ్రులు పుత్రులఁగల పుణ్యాత్ముల నేవిధముననైన నొప్పించి, వారడిగినంత ధనమునిచ్చి వారుచేయఁబోవు దౌర్జన్యములకును పరాభవములకును తలయొగ్గి రజస్వల కాకమునుపు పెండ్లిచేసితిమను మనస్సంతోషమును పొందుదురు వెనుకనుండితమ వియ్యాలవారు పశువులకన్న నికృష్టులని తలపోయుచు, వారు స్వగృహకు వచ్చినప్పుడెల్ల ముఖముకందగడ్డవలె నెఱ్ఱచేయుచు, చూపులు మాటలు సక్రత్తయినను, కులనిందతప్పినదన్న సంతోషము మిగతిలోపములను కప్పివేయఁగలుగుచుండుదురు ఈవరశుల్కపీడనము, ముందుముందు తగ్గుటకు మారుగ వృద్ధియగునేమోయని నాకు శంకగలదు హానరబిలు

రత్నసభాపతి పిళ్లగారు తెచ్చినశాసనము చొప్పున వివాహము 10 సంవత్సరములు రాకుండ జరుగకూడదని నిర్ణయింపఁబడెనేని, పుత్రుల నమ్ముదలచుకొన్నవారు, ధరలను హెచ్చుచేయుటకు సదుపాయమెక్కువగును పదేండ్లు బాలికకు వచ్చునందాక తండ్రి వివాహప్రశంస చేయరానిచో, ననుకూలసంబంధము లీలోన దాటిపోయి తుదకు పరుగు లిడవలసివచ్చును అప్పుడు వ్యవధిచాలక, మగవాఁడగువాఁడు దొరకిన చాలునని అడిగి నంతధనమునిచ్చి, సంబంధమునిశ్చయపరచుకొనవలసివచ్చును ఈబాధకమును పిళ్లగా రాలోచించినట్టుతోచదు దొరతనమువారొకవేళ పిళ్లగారియుపన్యాసమున వాదమును యుక్తులనువిని సంతుష్టులై చట్టము నేర్పరచినను, వరశుల్క సంగ్రహణ దీక్షాపరులైన తలిదండ్రుల నది యేవిధమునను బాధింపదు మాపిల్లకు పదేండ్లున్నవి, మీపిల్లవాని కియ నిచ్ఛగలదుగాన నంగీకరింతురాయని యడుగఁగా, దానికేమియాటంకము రెండు వేల రూప్యములకట్నము, వియ్యపురాలికి ఆడుపడుచునకు నైదు దినములు మొగ రీలు, రాకపోకల కర్చులు పెట్టుకొనిన మాయాటంకమేమియు లేదనియు, కట్నము రాకపోకల కర్చులు, ముందురొక్కముగ నీయవలెనని యడుగగా, గుండెలలో రాయివడి, హా దైవమా నాకు పుత్రికల నేల సంప్రాప్తముచేసితివని వగవని తలిదండ్రులుందు రా యని శంకపుట్టుచున్నది ఆచొప్పున దండనధనము నిచ్చుకొనలేకపోయిన నా సంబంధము కుదరదు తుద కావివాహము దుకాణములోని సరుకు నడిగినధరకు విక్రయిం పని పదార్థమువంటిదగును ఒక దుకాణములో బేరము కుదరకపోయినను రెండవ యంగడిలో నావస్తువు కొంచెము తక్కువధరకు దొరకవచ్చును కాని బాలికయను వివాహయోగ్య పదార్థమును తండ్రియను వర్తకుఁడు ఫలములరీతి నింటింటికిఁ గొని పోయి యమ్మఁజూపుటవలన, ఫలము నిక రెండుదినములుంచిన డాగువడి, చెడిపోవునని యెరిగి, తామడిగిన ధరకీయక పోరవేయునాయని యెవ్వరుకొనకుండినట్లే, పండ్రెం డవయేడు రాకమునపే పెండ్లిచేయునాత్రముతో నుండుతండ్రి కోరినంతధనము నిచ్చి ముప్పుదప్పించుకొనవలసి వచ్చును దీనికి దొరతనమువా రేమిచేయఁగలరు ఈ బాధయిట్లు నిరాతంకముగ నుండవలసినదే తుదకు మనకాలమున వివాహ మైహికా ముష్మికసాధనము, ధర్మశాస్త్ర నిహితబంధనముగాక, సంపన్నాంధతానివారకము, పితృమనోవ్యథాకారణము నైనది ఇట్టిలోపము లకన్నులారఁజూచుచు, వానిని చక్క పరుచుకొన నిచ్ఛలేని మనము భగవంతున కుత్తరవాదులమై పరితపించవలసిన కాలము రాకమానదు మనపూర్వుల నాటి పాపములు పెక్కులు మనలఁబట్టి బాధించుచున్నవి మననాటి యపచారములు కూడ మనసంతతివారిని పీడింపకమానవు వరశుల్క పీడా నివారణమునకు మనలోకొంతవరకు వ్యాపించియున్న ప్రధానము ను తంతు సహకా

రిగ నుండునని కొందరకు దోచవచ్చును ప్రధానమువలన సంబంధములు దాటి పోకుండ వధూవరుల బాల్యముననే ప్రతిజ్ఞలు చేయఁబడునుగాన దానిని జవదాటుటకు వీలుపడదనియు, అప్పుడు నిర్ణయమైన నిబంధనల నతిక్రమించుట కుభయపక్షములవారు వెరితురనియు తలపోయుదురేమో! నీటిలో గేదనుంచి కొమ్ములఁజూచి బేరమాడినరీతి ముక్కుపచ్చలారని బాలునకు, స్తన్యపానము వదలని బాలికకు ప్రధానముచేసి, తుదకా యిరువురలో నొక్కరు బాలరోగముచే మృతినొందుటో, యంగవైకల్యము నొందుటో, లేక, విద్యాబుద్ధులులేక మందమతులగుటో, మాటలురాక మూగలగుటో, సంభవింపఁగా పరమేశ్వరా యేల బుద్ధిహీనులమై త్వరపడి, మధ్యవారిమాటలచే భ్రమపడి, యిట్టి యనవసర ప్రధానమున కొడఁబడితిమని వగచుటకన్న, యుక్తకాలమున సంబంధమును కుదుర్చుకొనుటయే క్షేమము ఇట్టిసంబంధములవలన ధననష్టము, ప్రాణనష్టము, గలదా లేదో మీలోకొందరికి స్వానుభవమువలనఁ దెలిసియుండును కొంతకాలము క్రిందట నొకగృహస్థు లనపసి కొమరునకు, ధనికుఁడైన యొక గృహస్థుని బాలికను పెండ్లిచేయుటకేర్పరచి ముందు ప్రధానము చేసుకొనుటకు ముహూర్తమును నిశ్చయించెను మరునాడు ప్రధానము జరుగఁదలచి యుండఁగా, ఆనాఁడాబాలుని మేనమామ భార్యప్రసవమై, ఆడుపిల్లనుగనెను వెంటనే మేనమామ తనపట్టణమునుండి ,,stop ప్రధానము మేనరికము born అని తంతీవార్తనంపెను దీనినిబట్టి వివాహమును మనవారు నాటకముగ నెంచి జరుపుచున్నారనుటకు సందేహమేమిగలదు వధూవరులిరువురును యుక్తవయసు గలవారై, అన్యోన్యానురాగబద్ధులై, స్వతంత్ర జీవన సామర్థ్యము లేని కారణమున, కొన్నాళ్లవరకు వివాహము నాపుకొనుట కట్టకట్టుబాటులఁ జేసికొనవచ్చునుగాని, సంలేమున పెండ్లినాడు మంగళసూత్రము నైన కట్టసామర్థ్యములేని బాలునకును, తల్లి నప్పుడుకూడ ,,అమ్మాబాయే యని యేడ్చు బాలికకును, ముందుప్రధానములఁ జేయుటవలన మనకు వివాహము లన్నలేశము గౌరవము లేదని, జ్ఞానముగల ప్రతివానికి స్ఫురింపకమానదు ముందుతొందరపడి కొన్నికారణములచే కొందరు ప్రధానములఁ గావించినను, తమకాఁబోవు అల్లుర విద్యాబుద్ధులు, వారి శరీరసౌఖ్యము, అభివృద్ధి సూచనలను గ్రహించి, నైపుణ్యముతో వాని దప్పించుకొనుట ప్రధానముకాని, యర్థములేని తొలిప్రధానము నేనన్మియుండి, తమముద్దుబొమ్మల నిష్ప్రయోజకుల కంటఁగట్టుట తండ్రులకు భావ్యముగాదు భగవంతుఁడు మనదేశమున స్త్రీలను గోవులవలె విచక్షణలేకుండ దానముచేయ సంకల్పించి సృజింపలేదు అరువదేఁడులు వచ్చునందాక పురుషుఁడెన్నిసారులైనను పెండ్లియాడఁగలిగినను, భార్యపోయిన పదునేనవనాఁడే యేఁబదేండ్లవాఁడెనిమిదేండ్లబాలికను పెండ్లియైనను, కంటగించుకొనక,

చందనతాంబూలాదిసత్కారములఁ గైకొనుటకును, వారవనితా జనతాప్రయుక్తనృత్త
గీతవినోదంబులందనియుటకును నుత్సాహముతోఁజనుచు, స్త్రీలకు భర్తృవియోగబాధ
సంప్రాప్తమైనప్పుడుశిలాకఠినహృదయములతోఁ బ్రవర్తించు మనము, బాలికావివాహ
విషయమున, జాగరూకులమై పసిబాలురకును,శతవృద్ధులకునుగాక సాధ్యమయినంతవరకు
మంచిసంబంధములఁజూచుట కర్తవ్యము పిమ్మటి భారమును దైవముపైనుంచవలెను

వక్తవ్యాంశమును వదలి కొంతవరకప్రస్తుతప్రశంసకు దిగితిని తమకొమరుల
విద్యాభారమును తమపైనుండి తప్పించుకొని మామగారిపైవేయుట నీతిమంతునకు లక్ష
ణముగాదు తమ దారిద్ర్యముచే కట్నములనడిగితిమంటిరా, ఆడపిల్లల కనినవారం
దరు ధనికులై, మగపిల్లలు కలవారందరు పేదలై పుట్టలేదు ఒకమగపిల్లవాఁడు ఒక
ఆడపిల్లయుండన, వారి వివాహముల కొరకు తండ్రిదరిద్రుఁడు ధనికుఁడుకూడ కాలేఁడు
ఈచేతితోనిచ్చుచు, నాచేతితో యాచింపవలెను కాఁబోలు వాస్తవము నాలోచించితి
మేని కట్నముల నిమ్మని బలవంతపెట్టుట యాంగ్లేయవిద్యాదోషముకాని వేరుగాదు
నూవుగంజను పొత్ల, కోటీశ్వరుఁడు కాఁదలచినవానివలె, ఫురుషసంతానముగల వారం
దరు, కొమారుల వివాహకాలమున కొంతధనమును సంపాదింపవలెనన్న యభిలాషను
వదలి, బాలికనే ప్రధానద్రవ్యముగఁ జూచుకొను కాలము త్వరగరావలెనని కోరుకొం
దము దీనికి సర్వకళాశాలాధికారు లొకవిధమున తోడుపడవచ్చును పిల్లగారి
చట్టము, మొదలారిగారి శాసనము మనకక్కరలేకుండ, ప్రవేశపరీక్ష ప్రథమశాస్త్రపరీ
క్ష, పట్టపరీక్షలోనగు వాని కవివాహితులేగాని చేర్చుకొనఁబడరని యొకయుత్తర్వును
పుట్టించిరేని దానివలన తలిదండ్రులు జాతకములనమ్మి తమకొమరుల యదృష్టమున
కూటలూరక, పిన్నతనముననే వారికొరకు తముపాడయి, యితరుల వాడుచేయరు
ఈనాఁడు డిప్టీకలెక్టరుగారికొడుకని, తండ్రిగారినిచూచి పిల్లదానియదృష్టమును గణిం
పక, మరునాఁడు కావడిమోయునో, జూదరియగునో తెలిసికొనుటకు వీలుపడును
చిన్నతనముననే భార్యావ్యాసంగములేక బాలుర చదువునకదిసహకారియగును చిన్న
తనముననే పెండ్లిచేసిన తమపిల్లలను పాఠశాలలలోఁ జేర్చుకొనరుగదా యని తండ్రులు
భయముగల్గియుండి, వారధమ మొక్కపరీక్షయందైన తేరుదాక పెండ్లిమాటదలపెట్టరు.
తమపుత్రులు బొడ్డున కనకముతో పుట్టిరని తండ్రులుచాటుచు, ధనమునులంకించు
సాధనోపాయము రూపుమాయును బాల్యముననే వివాహమాడుట శరీరసౌఖ్యమునకు
భంగమని యెరిగియున్న బాలురు ప్రాజ్ఞులై తమకునచ్చిన బాలకనుకోరుకొని, తండ్రుల
ధనాశను కొంతవరకు మాన్పఁగల్గుదురు ఇది సమకూడిన వరశుల్కబాధ క్రమక్రమమున
క్షీణించుట నిశ్చయము

(2) వివాహ కాల నిర్ణయము —దీనినిగూర్చి శాసననిర్మాణసభలో రెండుబిల్లులు తేఁబడియున్నవి వానియుపయోగానుపయోగములను బుద్ధిమంతులు వార్తాపత్రికలలోఁ జేయు వాదములను మన మీనడుమ తరుచుగ చదువుచునే యున్నారము మొత్తము మీద విద్యాధికులు బాలికకు పదిసంవత్సరములైన రాకుండ వివాహముచేయ కూడదని యభిప్రాయముగలవారైయున్నట్లుకనఁబడుచున్నది జంబులింగమొదలియారిగారేర్పరచిన యెనిమిది సంవత్సరముల పరిమితము చాలదని నాయభిప్రాయము పదిసంవత్సరములు దాటినఁగాని పెండ్లిచేయుట భావ్యముగాదని మహామహోపాధ్యాయ శ్రీపరవస్తు రంగాచార్యులయ్యవారు గడచిన నవంబరు నెలలో శాస్త్రప్రమాణములతో నిచ్చట నుపన్యాసమునిచ్చియున్నారు జనాభిప్రాయముతో శాస్త్రమేకీభవింపుచుండఁగా, దానిచొప్పున నడచుకొనుటకు మాత్రము మనోబలము పలువురయందుఁ గానరాకున్నది. మనుస్మృతి చొప్పున పురుషుని వివాహమునకు యుక్తకాలము ముప్పదేండ్లు స్త్రీకి పండ్రెండేండ్లునై యున్నది లాభకారియైన యీ నిర్ణయమును జవదాటుటకు "అష్టవర్షా భవేత్కన్యా, నవవర్షాతు రోహిణీ, దశవర్షా భవేద్గౌరీ, అతఊర్ధ్వం రజస్వలా" యను మృషాస్మృతి యాధారమైనది "దశవర్షాభవేత్కన్యా, గేంవర్షాతు రోహిణీ, బారావర్షాభవేద్గౌరీ, అతఊర్ధ్వం రజస్వలా' యనిన్యాయముగ నీస్మృతిని హిందూస్థానీ పదముకు సంకోచింపకచదివి, యాచొప్పున ననుష్ఠించిన దేశమునకు కొంత యనిష్టముతగ్గుటనిశ్చయము ద్వైకోనాష్టవర్షాతువివాహ్యాబ్రాహ్మణేనతు, నాతో వివాహశ్యాస్త్రీక్తశోచ్ఛత్తమాతూత్తరోత్తరా' ఇత్యాది శ్లోకములుగూడ బ్రాహ్మణుఁడెనిమిదేండ్ల దానినిగాని, పదేండ్లదానినిగాని వివాహముచేసికొన వలెనేగాని యంతకంటె నధికమైనవయసు గలదానిని చేసికొనఁగూడదని బోధించుటకేర్పడినవి పూర్వాచారపరాయణులు దివ్యజ్ఞానసామాజికులుమనతొంటిగౌరవమ్మును తలచి లోలోనుప్పొంగుటకన్న ఆ కాలమున వివాహమునకు నిర్ణయమైనపద్ధతుల నవలంబించిన, అమపూర్వుల యందుఁగల గణ్యతను లోకమునకు వెల్లడించినవారగుదురు ఆ కాలమున బ్రాహ్మణులలో స్త్రీవిద్య, స్త్రీపునర్వివాహములు, రజస్వలావివాహము సామాన్యముగా వ్యాపించి యుండినట్లు బ్రాహ్మణుఁడు మతభంగము లేశములేకుండ బ్రాహ్మణేతర జాతుల స్త్రీలను పెండ్లియాడువాడుకయున్నట్లు, పెక్కునిదర్శనములు కానఁబడుచున్నవి పురాతన హిందూ మతోద్ధారణమునకు పాటుపడు నవనాగరికులు పూర్వకాలమునమున్న సద్ధర్మముల నెలకొల్పుటకుఁ బ్రయత్నించి దేశమునకు మేలుచేయుటభావ్యముగాని "Foreign Spiritualism" నకు "country Spiritualism" నుజతకూర్చి, దేశమునుద్ధరింపఁదలచుట కలలోనివార్త మనలనువేనోళ్లఁబొగడిన బ్లావట్స్కీదొరసాని భరతఖండమున

నివసించియున్న కాలమున మనశాస్త్రములందు విశ్వాసముగలదైనపక్షమున శిరోజములఁ దీయించుకొన నేలయత్నింపదయ్యె? మనగొప్పనుగూర్చి, పదేపదే శ్లాఘించు బిసాంటుదొరసాని పగలు మక్కలుపొడిచినను, తనకంకొక పెండ్లికావలసినకూతురున్న నెనిమిదవయేట పెండ్లిచేసి, రజస్వలయైనవెనుక వీధిలోనిక రాకుండకట్టుదిట్టముఁజేసి, పెనిమిటి తిండితినినయెంగిలి విస్తరిలోభుజంచుట కంగీకరించునా? ఆల్కటుదొరగారి కొకకొడుకుండిన, ఆతనికి 10దవ యేట నేప్రధానముచేసి, లోపలు శెకండరీపరీక్షయందైన తేరకుండ పెండ్లిచేసి, మనలోమహనీయులు పలువురు చేయురీతి, కోడలు రజస్వలగాకమునుపే గర్భాధానమును జేయునా? కావున మనము భగవంతుఁడిచ్చిన నయనములను, కర్ణద్వయమును, చక్కగ వినియోగించి మన మనస్సాక్షి బోధనలకు చెవియొగ్గి స్తోత్రపాఠకులవిడనాడి న్యాయమార్గమున సంచరింతము పూర్వపు గౌరవము తలచుకొని సంతోషించిన ప్రయోజనములేదు ప్రస్తుతపు నీచదశనుజూచి ఖేదపడుటమంచిది క్రమక్రమముగ స్త్రీలనభివృద్ధిలోనికి తేఁదలచితిమేని వారలగలచక్కపరుపఁ బ్రయత్నింపవలెను అథమపక్షము పదేండ్లయిన రాకుండ బాలికలకు వివాహము చేయమనిమనలో కొందరు ప్రతిజ్ఞపట్టవలెను బ్రహ్మచారి భార్యయు, కన్యకబిడ్డలును మంచికట్టుదిట్టములలో నుందురన్న సామెతచొప్పున సంతానహీనుఁడనైన నాబోటివాని ప్రతిజ్ఞలతో పనిలేదు కూతులఁగన్నవారే దీక్షను వహింపవలెను వారు లోకమునకు మార్గదర్శులుగనుండవలెను ఇట్టిశపథములఁబూనిన, సంఘమువారవలన కలుగు ప్రమాదమెద్దియుఁగానరాదు ఎవ్వరికి బాధకములేకుండ మన మేగొప్పకార్యము నెన్నడును చేయలేము అయోమార్గము నేర్పరచునప్పుడు నానావిధఫలవృక్ష భరితమైన యారామమును ఛేదింపవలసివచ్చును రాజవీథుల నేర్పరచునప్పుడు నిరాధారుఁడైనవాని కుటీరమును బలవంతమ్ముగ నాక్రమించుకొనవలసివచ్చును పదేండ్లురాకుండ బాలికలకు పెండ్లిఁజేయుమని శపథముపట్టిన నెవ్వరికని బాధకముగనుండునని యూహింపఁజాలను

<u>వివాహవ్యయములు</u> వీనినిగూర్చి సాకల్యముగ నొకయుపన్యాసమును వెనుక మన విద్యాప్రసంగ సమాజమునచదివియుంటిని అది చింతామణీకార్యస్థానమున విక్రయింపఁబడుచున్నది అందలి యంశములను మరలవ్రాయుట చర్వితచర్వణముగ నుండును గాన సంక్షేపముగఁ బ్రశంసించి విడిచిపెట్టెదను సంభావనలుమానవలెనని గడచిన మూడుగోదావరీమండల సంఘసంస్కరణసభలలో నిర్ధారణలుచేసియుండిరి వచ్చిన వారికి లేదనకుండ నన్నప్రదానముచేయువాడుక లగ్గింపవలెనను కుతూహలము క్రమక్రమమున తగ్గుచున్నది పెండ్లివారితో వచ్చినవారికందరకు వస్త్రములనీయు నాచారము కేవల ధనవ్యయహేతువుగాని యుభయత్రలాభకారిగాదను నమ్మకము కుదిరినను, జనాప

వాదమునకు వెఱచి పట్టణములలోను, పల్లెలలోను చాలమంది మానలేకున్నారు. పిఠాపురము, నర్సాపురము, ఏలూరులోనగుతావుల కొందరు గృహస్థులు తాముకట్టుబాటులఁజేసికొని యీపద్ధతినిమాని కృతకృత్యులగుచున్నారు. వేశ్యాంగనాసమాదరణము సకలానర్థహేతువని యెఱిగి యుండియు, వారల వలలోఁబడి పలుకుటుంబములు శిథిలములగుటకన్నులారఁ జూచుచు, కోమట్లును, కొందరు విప్రులును మేళములు మానలేకున్నారు. పెండ్లికి తలిదండ్రులు రాకున్నను సంకోచములేని మహానుభావులు దూరమున నేకొండవాఁడో యుంచుకొన్న ముదిముండ మేళముకొరకు విశ్వప్రయత్నముఁజేసి అదివచ్చినఁగాని పెండ్లికి శోభలేదనితలచి దానిరాకనిర్ధారణయగువరకు నిద్రాహారములు లేక పరితపించుచు తుదకు దానియుంపుడుకాని సమ్మతిని వినినతోడనే చచ్చినవాఁడులేచివచ్చినంత సంతోషముపొందుచుండఁగా, అట్టివారి యనుగ్రహమును స్నేహమును నీతిమంతులమని చాటుకొనువారపేక్షించుచు, చాటునవైన వారిమందలింపలేక ఫలాభావాపేక్షితులై యున్నకాలమున మనలో నీతియెట్లువృద్ధికాఁగలదు. సంస్కరణములెట్లుజరుగఁగలవు. ఈపట్టణమున భోగముమేళము పెట్టినవారింటికి తాంబూలములకు వెళ్లమని మనలోకొందరు ప్రతిజ్ఞలపట్టుటవలన నెట్టిమార్పుగలిగెనో మీలో పలువురకు స్వానుభవముగలదు. వివాహములలో వ్యయముల తగ్గించుటకు దేశమందంతటను ప్రయత్నములు జరుగుచున్నట్లు మనముకనుచున్నాము, వినుచున్నాము, చదువుచున్నాము. వానిలో కొన్నిటి నిచ్చట సంక్షేపముగ వివరించెదను. (*a*) వాల్టరుకృతి రాజపుత్రహితకారిణీ సభయనుపేర 11సంవత్సరములక్రిందట రాజపుత్రస్థానమున స్థాపింపఁబడిన సభవారి ప్రయత్నమువలన రాజపుత్రులలో వివాహములకు శ్రాద్ధములకు దుర్వ్యయముతగ్గి సుఖపడుచున్నారు. 1896 వ సంవత్సరపు రిపోర్టునుపట్టిచూడఁగా, ఆసంస్థానములలో పదునేడింటిలో జరిగిన 5458 వివాహములలో 3021 ల యందు వరునకు వయసు 20 సంవత్సరములపైని, వధువునకు 820 టిలో 16 సం॥ రములపైని నుండెను. 15 వివాహములలో వధువునకు, రెంటిలో వరునకు, మూడింటిలో వధూవరులకు వయసు 10 సంవత్సరములకు తక్కువయుండెను. వారి సంరక్షకుల ప్రవర్తనము విచారణయందుండెను. ఈసభలోఁజేరినవారు పెండ్లికి రు 150లు మించకుండవ్యయము చేయుదుమని ప్రతిజ్ఞపుచ్చుకొందురు. దాని నతిక్రమించిన వారి నడతనుగూర్చి సభవారు విచారించి వారిని కఠినముగ మందలింతురు. (*b*) ఈచొప్పుననే కాయస్థులు వారుప్రతిసంవత్సరము ఉత్తరహిందూస్థానమున నొకప్రసిద్ధపట్టణమున సభకూడి తమ సంఘాభివృద్ధికరములగునంశములవిచారింతురు. వారిదివరకు లక్నో, అలహాబాదు, బాంకిపురము, లాహోరు, బెరెల్లి, అజమీరు, మధుర, కాశి, మురాదాబాదు, అల్లిఘురు,

గయలలో సభకూడి, వివిధాంశములఁ బ్రసంగించిరి. గయలో జరిగిన సభముగియు నాటికి నే నచ్చటనుండుట తటస్థించెను. ఆసభకు మన ప్రాంతముల ప్రసిద్ధనాముఁడైన దివాన్ చందూలాల్ మునుముఁ డగ్రాసనాధిపతిగనుండెను. వారి నిర్ధారణలలో వివాహములకు సామాన్యులు రు 200 లు సంపన్నోన్నతులు రు 2000 లు మించకుండ వ్యయపరచవలెనన్న దొకటి. ధనికులు చాలమందిగల యీసంఘమున నిట్టికట్టుబాటు నేర్పరచుకొనుట క్షేమకరమే. (c) పశ్చిమోత్తర పరగణాల వైశ్యసభవారు బాల్యవివాహముల మాన్పుసంకల్పముతో బాలురకు 16 ఏండ్లు బాలికకు 12 ఏండ్లు వయసు రాకుండ పెండ్లిచేయకూడదనియు, విద్యాభ్యాసము చేయుచున్నంత కాలము బాలురను బ్రహ్మచారులనుగ నుంచుటే శ్రేయోదాయకమనియు, సంతానముగలవారు, భార్య పోయినయెడల, నలువదేడులు దాటిన వెనుక మరల పెండ్లిమాట తలపెట్టఁగూడదని నిర్ణయించుకొనిరి (d) బేరిసల్ ధర్మరక్షణీసభవారు కులీన బ్రాహ్మణులలో కన్యాశుల్క వరశుల్కముల మాన్పుమని బంగాళా దొరతనము వారికి యుందుశేడు విజ్ఞాపనము నంపుకొనిరి (e) ఘాజీపుర సంస్కరణ సభవారు వధూవరుల వయస్సు 14, 18 గా నుండవలెనని యేర్పరచుకొనిరి (f) బంగాళా దేశమున బ్రహ్మసమాజ మతావలంబకులగు హిందువులు తమబాలికలకు 14 ఏడులురాకుండ పెండ్లిచేయరు. వారిలో కొందరకు స్వయంవరముకూడ గలదు. (g) పాంచాలసంస్కరణ సమాజమువారు వివాహములలో తంతు పెంచి పురోహితులకు విప్రులకు నిష్కారణముగ భూరిసంభావన లిచ్చుపద్ధతిని, అనాహూతమిత్రబంధు సముదాయమున కన్నదానము చేయు దురాచారమును, భోగముమేళములను పిలువకుండుటకు నిశ్చయించుకొనిరి (h) విదర్భసంఘ సంస్కరణ సభవారిలో దశమఖులు తమకొమరులకు 16 ఏండ్లు, కొమార్తెలకు 10 ఏండ్లువచ్చినఁగాని పెండ్లిఁ జేయమని, కట్నములనడుగమని, వివాహములకొరకొక యేడాది యాదాయమున కన్న నెక్కువవ్యయపరుపమని నలువదేడులు దాటినవెనుక మగల పెండ్లియాడమని ప్రతిజ్ఞలువట్టిరి (i) గుజరాతుదేశ భాషాసంఘము వారిలో కొందరు తమ యిండ్లలో శుభకార్యములకు వేశ్యలను పిలువమని, వేశ్యలునాట్యమాడుచున్నచోటికి తాంబూలమున కైనఁబోమని ప్రతిజ్ఞచేసికొనిరి (j) సుక్కురురోరి (సింధుదేశము) సంస్కరణసభవారు బాలురకు 18 ఏండ్లు, బాలికలకు 12 ఏండ్లు రాకుండ వివాహముచేయమని ప్రతిజ్ఞ చేసికొనిరి (k) ఈచొప్పుననే సింధుదేశములోని హయిదరబాదుపుర హిందూసంఘ సంస్కరణ సభవారును ప్రమాణములఁ జేసికొనిరి (l) ధార్వాడ లిబరల్ అసోసియేషన్ వారు, 45 సంవత్సరములు దాటిన పురుషుఁడు తగినకారణములు లేకుండ, తిరిగి పెండ్లియాడకూడదని, కొడుకులకు కూతులకు 18, 10 ఏడులు రాకుండ

పెండ్లిఁజేయకూడదని, ఈనిబంధన నతిక్రమించినవారు సమాజము వారికి తృప్తికరమైన సమాధానము చెప్పవలయునని, ఒకవేళ వియ్యాలవారివద్ద కట్నమును పుచ్చుకొనినను, అది పిల్లదానితండ్రి సంవత్సరపు ఆదాయమున నాలవపాలును మించకుండవలయునని తీర్మానించుకొనిరి (m) కొంచెమెచ్చుతగ్గుగ షోలాపురీ లిబరలస్సోసియేషన్ వారినిబంధనలనే యేర్పరచుకొనిరి (n) కార్వాదుభక్తసమాజము వారు కన్యాశుల్కము మాన్పుటకు, కట్నములు పుచ్చుకొనకుండుటకు, వివాహవ్యయముల తగ్గించుటకు శపథమూనిరి (o) పునహాడక్కన్ లిబరల్ అస్సోసియేషన్ వారి నిబంధనలు ధార్వాడ వారివియొక్కటే ఏబాలికతండ్రిగాని స్వేచ్ఛాను పూర్వకముగ రెండు నెలల యాదాయముకన్న నెక్కువ కట్నమునిచ్చినదానిని వధువుపేరిట శేవింగ్సుబ్యాంకిలోఁగాని వేరొకచోటఁగాని భద్రముగ వడ్డికివేసి యాధనమును వధువుయొక్క స్త్రీధనముగ నుంచవలెనని నిర్ణయించుకొనిరి (p) మనపట్టణ వాసులలో బ్రాహ్మణకులభూషణుఁడైన మ-రా-రా-శ్రీ దురిసేటి శేషగిరిరావు పంతులుగారి యగ్రాసనాధిపత్యమున రాజమహేంద్రవరమున జరిగిన రెండవమండలసంఘ సంస్కరణ సభలో, బాలురకు 16 ఏండ్లును, బాలికలకు 10 ఏండ్లునురాకుండ వివాహముచేయఁగూడదనియు, 8 ఏడులలోపు బాలికను పెండ్లిచేయుట నేరముగ నెంచవలెననియు నిశ్చయించిరి ఈచెప్పిన వివాహసంస్కరణమునకు జరుగుచున్న ప్రయత్నములు మిక్కుటముగనున్నవి ఆసేతుహిమాచల పర్యంతము, మనలోఁగలయనర్థనివారకప్రయత్నములలో వివాహసంస్కరణమందరకుఁబ్రథమగణ్యమైయుండఁగ, దానిని సామాన్యదృష్టితోఁజూచి విడుచుట దేశాభిమానుల కెవ్వరికి క్షేమకరముగాదు ఒక్కొకరాజ్యమున నొక్కొకలోపము బలకరముగనున్నను, వివాహవిషయము సామాన్యమయి, యందరికి సమముగ నాందోళముగలిగించుచున్నది కావున దాని చక్కఁబరుప యత్నించుటే మాకందరకు ముఖ్యోద్దేశమైయుండవలెను మనలో నైకమత్యము, సహనబుద్ధి, పెద్దలయందుభక్తి, లేమిచేతను ప్రతివాఁడు నాయకుఁడుగ నుండవలెనను నభిలాషచేతను, స్వల్పకార్యములైనను మనము నెరవేర్చుకొనలేక మాటిమాటికి దొరతనమువారి సహాయము నపేక్షించవలసిన గతిపట్టినది, వారు మతసంబంధమున్నట్లు కనపడు దానితో చొరవచేసి జోక్యము గల్గించుకొనరు ప్రాణహానికభంగము దప్పు సహగమన శిశుబలి నరబలులను బానిసవృత్తినిమాత్రము ప్రజాభిప్రాయము నాలోచించక ధైర్యముతో నివారించిరి మిగత విషయములను జనులకు విడిచిపెట్టుటవలన బ్రిటిషు ప్రభుత్వమున సంఘసంస్కరణము కొంతవరకు దుష్కరమైనది ప్రతి మంచికి చెడ్డ సిద్ధముగనుండునని ఎమర్సన్ వ్రాసిన చొప్పున, బ్రిటిషు దొరతనమువారు మత విషయమున తటస్థులుగ నుండుటవలన మనకేమియు మేలు లభింప

లేదు సంఘ విషయములందు మనకు పూర్ణ స్వాతంత్ర్యము నిచ్చి, దానిననుభవింపనిచ్చు చున్నను, అది పూర్వము యూదులు రోమకరాజ్యమున ననుభవించిన దానికన్న నొకింత తక్కువగనున్నది. మన సాంఘిక విషయములలో, జూడియాను పాలించెడి రోమకులు, శాన్‌హేడ్రిము (Sanhedrim) సభవారి తీర్పులచొప్పున నడచుకొనవలెనని యేర్పాటుండుటచే, ఏసుక్రీస్తు నిర్దోషియని, తెలిసికొని, అతని శిక్షించుటకు పైలేటు (Pilate)న కిష్టములేక, యూదుల సమాధానపరుప యత్నించినను, దానివలన ప్రయోజనములేక తుదకు శాన్‌హేడ్రిమువారి తీర్పుచొప్పున జీససును సిలువవైచి చంపించక తప్పనిదాయెను. బ్రిటిషు ప్రభుత్వమున మనకట్టి స్వాతంత్ర్యమున్నను మన ప్రభువుల దృష్టికి నీతిమార్గములుగ దోచని కార్యములయందే మనకు స్వేచ్ఛావ్యాపారము గలదుగాని, నిరంకుశాధికారము మాత్రములేదు. దీనికి పైనిచెప్పిన సమాగమవాదులు తార్కాణములు. వారు చెప్పఁబడగలిగినంతవరకు నిర్భయముగ నిదివరకే ప్రవేశించి మిగతదానిని మనకు విడిచిపెట్టిరి. వారు సౌఖ్యము కలుగఁజేసికొనకుండ తటస్థమాత్రముగ నెప్పుడుండఁదలచిరో, వారి హాయి యప్పుడే పోయినది. ఇట్టి స్థితిలో సంఘసంస్కరణము యుక్తముగ నెరవేరుటెట్లు? పూర్వకాలమున భరతఖండమున రాజులు బ్రాహ్మణులు కలిసి దీని నెరవేర్చుచుండిరి. కాలానుకూలములగు సంహితలను మేధాశాలులగు బ్రాహ్మణు లేర్పరిచిన, వానిని రాజులాచరణమునకుఁ దెచ్చుచుండిరి. ఈచొప్పున నొక సంహిత వెనుక నింకొక సంహిత యేర్పడి, సంస్కారములు నిరాతంకముగ జరుగుచుండెను. మహమ్మదీయ పరిపాలనారంభముతో వ్యవహారమున కొంత భేదము గల్గినను, తొంటపద్ధతి పూర్ణముగ మారిపోలేదు. స్వతంత్రరాజ్యము లడుగంటినను, సాంఘిక విషయముల గొప్ప జమీందారులకు పూర్ణాధికారము నిలిచియుండుటఁజేసి, బ్రాహ్మణ సహాయాధారమున జనులకు ధర్మములు నేర్పరచుచుండిరి. ఆకాలమున జరిగిన సాంఘిక సంస్కరణము లన్నియు ప్రజానుకూలములని మనమంగీకరింపఁ జాలకున్నను, పండితులు జమీందారులు కలిసి, తురుష్కప్రభుత్వమునందుఁ గూడ సంఘసంస్కరణమునకు నవకాశముండెనని యేర్పడుచున్నది. బ్రిటిషు ప్రభుత్వమున జమీందారులకు సర్వాధికారములు తొలగిపోవుటచేతను, సంస్థానములందైన వారి మాటకు గణ్యతలేదు. తమ సంస్థానములోని రయితులు పన్నులనీయక మొఱకితనముచేసిన, మనయందఱవలెనే వారును మునసబుకోర్టులకు వ్యాజ్యమును వేసి సొమ్ము రాఁబట్టుకొనవలసిన కాలమున, వారిమాటయందెవ్వరికి లక్ష్యముండును? ఆంగ్లేయ విద్యావ్యాప్తివలన బ్రాహ్మణాధికారము, గౌరవము, చాలకాలము క్రిందటనే మంటఁగలిసినవి. శ్రౌతస్మార్త విద్యలు వారి పూర్వార్జితములుగ నెంచుకొను కాలము పోయి, బ్రాహ్మణులకంపినీవారి నతయినవి కలియుగమున క్షత్రియులను శూద్రాదులు

చెప్పఁగ నాప్యాయముతో బ్రాహ్మణులు విందుగని భాగవతముననున్న వాక్యమును సందేహింపఁ బనిలేదు. దేశమున జమీందారులగతి యిట్లుండఁగ వారివలన జరుగు సహాయములేదు. బ్రాహ్మణులే స్వతంత్రించి కార్యము నిర్వహించఁ గలరింటిరా, బంగాళమున పండిత ఈశ్వర చంద్ర విద్యాసాగరుఁడు, మన మండలమున రాయబహద్దరు కందుకూరి వీరేశలింగము పంతులవారు పూనుకొనిన విధవా వివాహ విషయముయొక్క గతి నాలోచింపుఁడు. దీనివలన సంస్కరణమునకు పురాతన పద్ధతి పనికిరాదని విస్పష్టమగుచున్నది. విదేశీయ పరిపాలనమువలన మనకు సంభవమైన సాధక బాధకముల నాలోచించి సంఘసంస్కరణము నుపక్రమింపవలెను. పరిపాలకుల సహాయము లేకుండ ఏక్రొత్తపద్ధతిగాని సర్వజనావలంబితము కాదు. బ్రాహ్మణులు, మతగురువులు, శాస్త్రిములు శోధించి, సముద్రయాత్ర, స్త్రీపునర్వివాహము, అన్య కుల స్త్రీపరిణయము, శాస్త్రసమ్మతములని నిష్పక్షపాతబుద్ధితో చూపినను, వానిని లక్ష్యముసేయువా రెవ్వరు? సముద్రయానము శాస్త్రనిషిద్ధముగాదని వంగదేశమునను, మనరాజధానియందును, పండితు లైకకంఠ్యముగ చెప్పిన నేమి లాభమయ్యె? అట్టి పండితాభిప్రాయము మైసూరువంటిచోట్ల నతిబాల్యవివాహ నిర్బంధమునకు సహకారి యయ్యెను. కట్టుబాటు నతిక్రమించిన వారికి శిక్షవిధింపఁబడునుగాన, కాలక్రమమున వాల్టరుకృత రాజపుత్ర హితకారిణి సభవారి యుద్యమములు పూర్ణముగ ఫలోన్ముఖమునకు రాఁగలవు. కులపుపెద్ద లనఁబడువారులేమిని మతగురువులు భిక్షమాత్రసంతుష్టులగుటను పట్టణములందును పల్లెలందునుగల సభాపతులు భోగముదానిచే లక్ష్మీవ్రతమును, పల్లెవానిచే సత్యనారాయణ వ్రతమును చేయించుట కక్కరకు వచ్చువారగుటచే, సంఘసంస్కారమందు దృష్టిగలవారు, తాము ప్రత్యేకమైనకూటముగ నేర్పడుటయే యుచితమార్గము. వారు దీక్షతో పనిచేయఁ దలచిరేని, కులమువారిని లక్ష్యముసేయక వారినుండి విడిచిపోవలయును. ఉన్నపటున సంస్కరణము జరుగునని, ప్రజలు తమంత మేల్కొందురని తలపోయుట భ్రమ. మీదు మిక్కిలి ప్రజలకు వేదాంతము ప్రబలిన కొలది దేశోపద్రవము హెచ్చుగునని భయము గల్గుచున్నది. దేశక్షేమము మదినుంచి సాహసముతో పనిచేయఁ దలచిన వారు, ప్రత్యేక సంఘముగ నేర్పడవలెనుగాని, అందరిని సమాధానపరుప యత్నించుట శశవిషాణమువంటిది. కేవల ప్రత్యేక సంఘములుగ నేర్పడుట వలననే కార్యసిద్ధికానేరదు. మంత్రములకు చింతకాయ లూడిపడవు. పట్టిన పని నెరవేర్చు సంకల్పముతో శపథమూనవలెను. ఈకాలమున శపథములు బహిరంగముగ చేసిన ప్రయోజనమున్నదిగాన కార్య నిర్వహణోత్సుకులు రహస్యముగ సంచరింపరాదు. సర్వజనానుకూల కార్యముల, శపథము లేమియావశ్యకములని కొందరు తలపవచ్చును. మనలో దీక్షను వహించుట సామాన్యమయి యున్నసంగతి మనమందర

మెఱిఁగినదే ఏకాదశి యుపవాసములు, మాసశివరాత్రులు, కార్తిక నక్తములు, శనివార దీపారాధనలు, వితంతువుల యేకభుక్తములు, గయాక్షేత్రమున నిష్టవస్తు విసర్జనము, భోజనసమయమున మౌనము, దీక్షలలో చేరినవే తమకాప్తులును ప్రేమాస్పదులునైన వారికి కఠినరుగ్ణతవచ్చినప్పుడు, వ్యాధికుదిరిన దూరయాత్రలకేగుదుమని మ్రొక్కుకొని దాని చెల్లుబడికొరకు సకలప్రయాసలకోర్చి తీర్థయాత్రలుసల్పుట ప్రతిజ్ఞానిర్వహణమే, కానిమనచేయు ప్రతిజ్ఞలలో కొన్ని యుపయోగకరములు, కొన్ని బాధకములు, కొన్ని నింద్యములు ప్రతిభానువారమునాడు లేదనకుండవచ్చినంతమంది పేదలకు దుర్బలులకు చేరసోలెడుబియ్యము నిత్తునని ప్రతిజ్ఞచేసికొనుట యుపయోగకరమైనది ప్రాణము పోయినను సరే, వైద్యుఁడు ముఖ్యబంధువులు వేయివిధముల బోధించినను సరే, ఏకాదశినాడు పడుచులినమువలెనే వార్ధక్యమునను క్రొత్తవరదనీటిలో స్నానముచేసి జాముప్రొద్దెక్కువరకు నీటిలోనిలువఁబడి జపముచేసి యుపవాసముందునని బింకము పోవుట బాధకము పుణ్యముపోయినను సరె, బంధువులు పురజనులు ద్వేషించి మారునాడినను సరె, సంపదపోయినను సరె, నేనుమాత్రము మీపణ్యస్త్రీసంభోగ సౌఖ్యమును మాననని చింతలపాటి ఎలాద్రిరాజుపూనిన శపథము నింద్యము వీనిలో ప్రాజ్ఞుఁడు మొదటిదానియందు గణ్యతయుంచి, అట్టిదాని ననుష్ఠేయముగ భావించును వివేచనాశక్తిహీనుఁడు, కార్పణ్యప్రధానుఁడు, మిగతి రెంటినిపాటించును ఇట్టిశపథములవలన మననీతిబలము పాపభీతి హెచ్చునన్న సంతోషముతోనే మనలో కొందరము భోగము మేళము లున్నచోటికిఁబోమని ప్రతిజ్ఞపట్టితిమి దాని తలచుకొనినప్పుడు కొంతవరకు భగవంతుఁడు మనకు మనోబలమునొసగి యిప్పటికి పెడదారిని త్రొక్కకుండ కాపాడుచున్నాడను సంతోషము కలుగుచుండును కొందరా రఘుపతి వెంకటరత్నమునాయని జీవమున కుస్సురని యేడ్చుచు, ఆశుద్రుని వాగ్జృంభణమున వ్యామోహితులమై యేలప్రమాణములఁ జేసితిమని వగచుచు, భోగము మేళమాడుచుండ, చుట్టుప్రక్కలపంచలనుండి సంగీతమును విని, నడిబాట పైనిలిచి, దీపములయందు తళుకు తళుక్కుమని కనపడు మోముఁజూచి పరవశులగుచు, ప్రతిజ్ఞల పట్టినవారితో పేరునకుఁ దిరుగుచున్నారు అట్టివారి విడనాడి మనోప్రథిమ గల్గినవారి సన్మార్గముననే ప్రవర్తింతము మనము పూనుశపథములు సన్మార్గసూచకములై సత్ఫలదాయకములై యుండవలెను మనము మనబాలికలకుఁ బండ్రెండేండ్లు రాకుండ పెండ్లిచేయమని ప్రతిజ్ఞపట్టితిమేని, ఎన్ని సంబంధములు వచ్చినను, మనదాక రాకుండ వీధిగడపలో మనవాకిటి కావలివాఁడే ప్రధానవాక్యము నప్పగించి వచ్చినవారిని సాగనంపును అప్పుడు తల్లి, భార్య, సోదరులు, సహితము మననిశ్చయము నెఱిగినవారగుటచే నేప్రశంసను చేయుటకు సంకోచింతురు కావున మనము ప్రతిజ్ఞలపట్టితిమేని కలుగు

లాభము లెవ్వియనఁగా (1) మనము పూనిన దాని నిర్వహింపవలెనన్న యభిలాష వృద్ధియగుట (2) ఒకవిషయమున దృఢనిశ్చయులమై యుండుటవలన, కష్టానుభవము యుపవచ్చినప్పు డూగులాడవలసిన యావశ్యకముండక మార్గము చక్కగ నుండుట (3) మనశపథములు ప్రజాసౌఖ్యదాయకములును, నీతివృద్ధికరములునగుటవలన వానిదిరస్కరించి, తమదారికి రమ్మని మనహితులు బంధువులు ప్రోత్సాహపరుపఁజాలకుండుట కావున చొరవచేసి ప్రతిజ్ఞలపట్టినవానికి, సంకోచముతో నల్లాడుచున్న వానికన్న కష్టములు తక్కువగ నేయుండును వానివలన ప్రాజ్ఞతచాలని భార్యలు, పురాతనధర్మ సంరక్షణాభిలాషులైన తలిదండ్రులు, పరిశీలనశక్తిచాలని స్నేహితులు పరాభవులై మిన్నకుందురు ఇట్టి శపథముల కొన్నిటినైన యుక్తముగ నెరవేర్చితిమేని మనము మనోబలము సత్ప్రవర్తనములు గలవారమనియు చెప్పినదానిని మరువకనుష్ఠించు నభిలాషయు నిశ్చయమునుగలదనియు లోకమునకుఁ దెలిసి మనలనమ్ముదురు

ఇంతవరకు చెప్పినవానిలో కొన్ని యప్రస్తుతములున్నను వానినన్నిటిని గుదిగుచ్చి మీకు వినిపించితిని వాని నాదరించుటయు నిరాకరించుటయు మీపని మనమేపనికిఁ బూనిచ్చినను వానిజయాపజయములు కార్యనిర్వాహకుల ప్రవర్తన ననుసరించి యుండును మనకు నిజమని తోచినదాని నవలంబించుటకు దురభిప్రాయముతోఁ బక్తి యుండఁగూడదు జనులందరు మనమార్గమునకు, దిరుగునందాక నిరీక్షింపఁదలచితిమేని, అది యెన్నటికి నమకూడక, మనసు సరిపెట్టుకొననలసివచ్చి, తుదకు మే॥ జాన్ మార్లీ వ్రాసినచొప్పున ,, నాసత్యమును మీకు నచ్చచెప్పలేకపోతిని గనుక, మీ యసత్యమున కంగీకరించినట్లు నటింతు ననవలసివచ్చును దేశమున సంస్కరణము లావశ్యకములను నమ్మకము జనులయందంకురించినది దాని నివారించుట దుర్ఘటము ఆంక్షలకు బహిష్కారములకు జనులంత జడియుకాలము పోయినది లోనగల యభిప్రాయములు పైకి నందు దొరకనప్పుడెల్ల పొరలివచ్చుచునేయున్నవి ఈపట్టణమున బ్రాహ్మణులు కోమట్లు శూద్రులు కలిసి నిత్యము ఫలాహారములను భక్ష్యములను అంటువస్తువులను యథేచ్ఛగా తినుచుండఁగా తప్పనెంచువారు మందునకైన కానరాకున్నారు ఈచొప్పుననే మనోనిశ్చయమున్న నితర సంస్కరణములు జరుగఁగలవు ఉదరవిషయమున మనము భయమువదలి తరుగుచున్నారము నీతిసంబంధకవిషయములలో నూత్నగర్భాధానవధువునకున్నంత సిగ్గు పసిబాలునకున్నంత బలహీనత ప్రతివారియందు కనఁబడును నీతిబల మనోబలము రెంటిని సమముగ నుపయోగించి, మహాకార్యముల నొనర్చిన శ్రీ వీరేశలింగము పంతులవారిని లక్ష్యమునసుంచుకొని, శక్తికొలది ప్రజాహితము కొరకు పాటుపడుదము భగవంతుఁడు మనకు తోడుపడక మానఁడు

సహోదరులారా! ఇంతవఱకు మన యథాకృత్యములనఁగా మనము మన సంసారములకు గాక దేశోపకారమునకై జనించితిమనియెంచి పరోపకారము నిస్స్వార్థక బుద్ధితోడను వివేకముతోడను నెరవేర్చుటయని తెలియవచ్చుచున్నది. అట్టి యుపకారము దేశముయొక్క గొప్పతనము, క్షేమము, న్యాయము, వీనికాకరమైన సర్వవిషయములయం దుండవలయును. ఒకమనుష్యునియొక్కగాని దేశముయొక్కగాని యభివృద్ధి, సుఖము, నీతి, గొప్పతనము మొదలయినవి వారి మత, రాజ్య సంఘస్థితుల ననుసరించియుండును. దొరతనము వారని యొకరున్నంతవఱకు వారికి జనులు విధేయులై యుండి వారు తమ రాజ్యతంత్రములను సరిగా నిర్వహించునట్లు చూచుచుండవలెను. సంఘమున్నంతవఱకు దాని యాచారములును విధులును దత్సభికులగు జనుల కుత్సాహమును, నీతిని, అభివృద్ధిని గలిగించునవై యుండవలెను. మఱియు మనము భగవంతుని యుత్తరవాదులమై యున్నంతవఱకు మనతోడివారిం దఱను ప్రేమ గౌరవించి సన్మార్గచరులగునట్లు చూచుచుండవలెను. మనుష్యుఁడు, లేక జనులు సుఖించి యభివృద్ధి నొందుట కీమూడును వృద్ధిఁ జెందవలెను. వీనిలో నేది కడమవానికంటె బాగుగా నున్నను బూర్ణమయిన యభివృద్ధికవకాశముండదు. ఏలయనఁ నొకటి బాగుగా నుండ మనము మన్నతిపదవికిఁ దీసికొనిరాఁ బ్రయత్నించుచుండఁగా సంఘబంధములు బలమై వెనుకకులాగుచు దానికిఁగూడ హానికలిగించును. సంఘ, రాజ్యవిధులెంత చక్కగా నుండినను మతవిధులు కూడ వానికి సరిగా నుండనియెడలఁగూడ నిట్లేజరుగును. జనులయందైకమత్యము గలుగఁజేయుటకు మతముకన్న మఱేమియు గలదు! దీనినిగూర్చి యమ్. బెటామ్ ఎడ్వర్డ్స్ (M Betham Edwards) అనునాయన తన గ్రంథము (A Year in Western France)నందిట్లు వ్రాసియున్నారు. "విద్యావ్యాపనము, శాస్త్రాభివృద్ధి, రాజకీయవ్యవహారస్వాతంత్ర్యము (Political liberty) ఇవన్నియు సగము నాగరకమునే తెలుపును. మతము, అధికారము, గౌరవముకూడ వీనితోఁ దులతూగినంగాని యవి ప్రకాశింపనేరవు." దేశస్థుల సుఖస్థితి రాజ్య మత, సంఘ నిబంధనల ననుసరించి యుండును. కాఁబట్టి వానిని సమానముగా నభివృద్ధిపరచుటకు వారు కృషిచేయవలయును. మన దేశమునందది ముఖ్యముగా యౌవనమందున్న మనమందఱము జ్ఞాపకముంచుకొనవలసియున్నది. మనమాతృభూమిని చక్కపరుపవలసినభారము నిందుమనమె వహింపవలసియున్నది. ఈజగన్నాటకమునందు మనగురువులు మొదలగు పెద్దలందరును దమపాత్రములను వదలి కథాశేషులగుచున్నారు. మనము కపటము మాని ధ్యేయము దరిఁజేరనియ్యక మన పాత్రములను దైవప్రీతికరముగా నుగింపవలెను. రాజకీయవ్యవహారసభలవలన దొరతనమువారు మనకంకెను గొప్పలాభములను గలుగఁజేయువలసి యున్నారనియు వారిలోపములను దెలిపి యామేళ్లను బొందవలెననియు జనసామాన్య

మునకు బోధింపవలెను ఈవిషయమం దిట్లభివృద్ధియున్నను సంచిలాభము చిల్లి కూడఁ దీసినదన్నట్లు మతివిషయమునందుండకున్న నదివెనుకకు లాగునని యిదివఱకే వ్రాసి యున్నాము ఆంగ్లేయులలో నొకరేదైన తప్పుచేసినను ఒకపనినిసానుకూలముగా నెరవేర్పలేకపోయినను తోడివారు పరాభవమని పరిహాసింతురు మనవారిలో నొకరిట్లుచేసినఁ బెద్దలందరు దయచేసి “అదృష్టంలేదండీ కర్మవిధి అల్లావుండగా బాగు ఎల్లాజరుగుతుంది అవవలసంది కాక మానదుగదా అది మాన్పడానికెవరివశం అని పరామరిసచేయుదురు ఓనవ విద్యార్థులారా ఒక్కనిమిషమాగియిప్పుడు మనయుక్తా కృత్యముయొక్క నిరూపణము (Definition of duty) చేసికొందము విధాయకర్మ మనఁగా మనముదేశలాభమునకై జనించినామనియెంచి మత సంఘ, రాజకీయ, వ్యవహారములందు నిష్పాక్షికబుద్ధితో దేశమునకుపకారము చేయుటయని నేను వ్రాసినదానిని బట్టి మీరుగ్రహించియుందురని నిశ్చయముగాఁ దలచుచున్నాను ఇదివిని యట్టి గొప్పయూహలు మనకప్పటినుండియు నెందుకని మీరడుగవచ్చును దానికి సమాధానముచెప్పెదనువినుఁడు ప్రస్తుతము మనమభ్యసించు విద్యయంతయు స్వదేశస్థులందు ముందుమనము గౌరవోన్నతపదవి నందుటకు సహకారినుడీ విద్యాధికులముగా నుండి యిప్పుడు మనము స్వదేశమునకు “మనస్సు” వంటి వారమగుదుము మన స్సునుబట్టకదా కర్మలుండుట దీనినిగురించి లార్డు బేకన్సుఫీల్డ్ (Lord Beaconsfield) అనుఘనుఁడు తన యుపన్యాసములం దొకచోట నిట్లువ్రాసినాఁడు “భుజబలమునకుఁగాక యిప్పుడు మనోబలమునకు జయముగలుగుచున్నది మీరుబలాత్కారమును సింహాసనమునుండ తొలగించి యాయున్నతాసనమున వివేకమునుంచినారు భుజబలులకుఁగాని యర్థసంపన్నులకుఁగాని వివేకికివలెనాలుసాగవు కాఁబట్టి విద్యాధికులే దేశక్షేమమునకు త్తరవాదులును మార్గదర్శకులనుగానున్నారు అట్టివారికి విధాయక కృత్యముల విషమైయుండును హాల ననుసరించియే హీనజాతివారి యూహలును మారుచుండును కాఁబట్టి యవలంబించుటకు వారెప్పుడును మనలనె చూచుచుందురు” దేశమునకు నిష్పాక్షికబుద్ధితో, నుపకారముచేయవలెనని మనకున్నందుకు దానిని క్రియలచేఁ దెలుపకున్నదానివలన నేమియుఁ బ్రయోజనములేదు అట్లు తెలుపుటకై మనకు మనోధైర్యముఁ (Moral Courage) ముఖ్యముగానుండవలెను మనోధైర్యమనఁగా సత్యమునువెదక పలుకుటకును న్యాయముగానుండుటకును మర్యాదఁగలిగియుండుటకును దుర్బుద్ధుల నణచుకొనుటకును విధ్యుక్తకార్యముల నెరవేర్చుటకును గావలసినధైర్యమని స్మైల్సను (Smiles) హరణకవి నిర్వచించియున్నాఁడు అంతేగాక యే దినమందిదని బోధించినప్పు డట్టిసదభిప్రాయమునందు దృఢవిశ్వాసము గలిగి జనసామాన్యముయొక్క ముఖస్తుతికిఁగాని దయకుఁగాని యెదురుచూడక నిర్భయము

గాఁ దనసద్ధర్మముల నవలంబించువాఁడే మనోధైర్యముగలవాఁడు. దీనిం గుఱించి బొంబాయి రాజ్యమునందు గొప్పఋషియని ప్రసిద్ధిచెందిన తుకారాముఁడను పావనపురుషుఁడిట్లుచెప్పియున్నాఁడు "ఈప్రపంచమునందనేక వైపరీత్యములుగలవు. ఎవఁడైన దైవభక్తిగలిగియుండినవాఁడు మూఢుఁడనియు, నీశ్వరభక్తిలేకున్న నాస్తికుఁడనియు, సన్మార్గుఁడైనఁ బ్రపంచమునకుఁ దగఁడనియు, దుర్మార్గుఁడైన నీచుఁడనియు, ఇటులాడిన వదరుబోతనియు, నూరకున్న గర్వియనియుఁ బరిహసించుచుందురు. లోకుల మాటలను గణించుట నిష్ప్రయోజనము. నిజమని నమ్మినదానిని నిర్భయముగాను నిష్పాక్షికబుద్ధితోడను జేసి విధాయక కృత్యములను (Duty) నెరవేర్చుకొనుటయే మనుష్యులకుత్తమమైన మతధర్మము. ఇదియే మనోధైర్యము. మనుష్యజాతికి మేలుచేయుటకును నిజమును దెలిసికొనుటకును సాధనమైన యిదియే యథార్థకృత్యమునకు జీవము వంటిది. విద్యాధురీణులమై దేశస్థులలో నున్నతపదవిని బొందఁబోవు మనమీ మనోధైర్యమును మనహృదయక్షేత్రమునందు నాటవలసినయక్కఱ మిక్కిలి యెక్కువగానున్నది. ఇప్పుడుకొందఱు విద్యాధురీణులు జనులకు మార్గదర్శకులగుటకు మారుగా వారి దురాచారములకు వారు చూపుదారినె త్రొక్కవలసినవారగుచున్నారు. మఱికొందఱు ఘనులింతటితోఁ దనివిఁ జెందక తమశాస్త్రజ్ఞానము పదటుఁగలిపి తీరికసమయములను జూదము పేక, చతుర్గంగము, దశావతారి మొదలగువానితోఁ గడపుచు మదస్యగస్థులమని మింటిని మంటిని నంటక తిరుగుచు చెప్పినది చేయుము కాని చేసినది చేయకుము అను నీతిని (Do as I say, but not as I do) బోధించుచున్నారు. ఇది యంతకాదు. జనులు దురాచారపరులైకాని, దురభిప్రాయులైగాని యున్నారని తమకుఁ దెలిసినపుడు వారిని సన్మార్గమునం దుంచుట వారివిధి (Duty) యైయున్నది. అట్లుచేయలేనివాఁడు తనవిద్యను దుర్వినియోగము చేయుచున్నాఁడని నిశ్చయముగా నమ్మవలసినదే. ఎట్లైనను దునకు దేశాభివృద్ధి విద్యాధికులై జనస్తోమంబుఁ గోరు భాషాక్రియలయందు వారినెపోలుచు, వారకష్టములను మాన్పుటకు మారుగా వానిని, దాముగూడఁ గుడుచుముండెడి వారివలనఁగాక లోపలనంతరాత్మను పైనిదేవునినమ్మి తము నిజమనినమ్మిన దానిని జనసామాన్యమునకు, వారి యుద్దేశములను నాచారములను భేదముగానన్నను, బోధించి దానినభ్యాసమునందుంచఁ జూచుమహనీయులవల్లనే జరుగుచున్నది. మనము దేశచరిత్రమును (History) గాని జీవచరిత్రమును (Biography) గాని పద్యకావ్యము (Poetry) నుగాని, చదువునపుడెవ్వరిని మెచ్చుకొందుము? అశాశ్వతమైన జనస్తుతి కెదురుచూచి, మూఢవిశ్వాసమును లోపములను జాగ్రత్తగా నిలిపి వానినవలంబించు మందుఁ గారినా? లేక, జనసమ్మోహకిలక్ష్యపెట్టక దైవప్రేరితని విధాయకకృత్యమును జూచుకనుచు, స్వదేశస్థులకనిష్టముగానున్న సుహృల్లోపములను గలిపి

వారిని సంస్కరింపఁజూచి యట్లుచేయుటచే వారినలనఁ బరిహాసమును, బాధలను, దుదకు మరణమును గూడఁ బొందుటకు సిద్ధపడి, దృఢనిశ్చయులై, సత్యవాదులై, స్వచ్ఛమైన తమ నడతచేతనే, జనసామాన్యమును ఎంపంచమిక నిప్రతిపక్షులపై జయమంది ఘనతకెక్కినవారినా! నిజముగాఁ గడపటివారినే సంస్కారము (Reform) మూడవస్థలను జెందును అందులో మొదటిదశయందు సంస్కారకర్తలను మతభ్రష్టులని దూషించిబాధింతురు. రెండవదశయందు సంస్కారము నిరాతంకముగా జరుగుచుండును వారుమాత్రము మెగతాళి నొందుదురు కడపటిదగు మూడవదశయందు జనులు సంస్కారము మాటంకములున్నను మెల్లమెల్లఁగా దేశమంతటను వ్యాపించెఁగదాయనియే కాక యది చిరకాలము క్రిందటనేల ప్రారంభింపఁబడలేదని గాని, వేగముగా నేలవ్యాపింపలేదనిగాని యద్భుతపడుదురు ఈసంగతి యనేకులు మరచియున్నారు సోదరులారా! మనము దేశము నుచ్ఛస్థితియందుంచఁ గోరితిమా మనము యథార్థవాదులమై మనోధైర్యము గలిగి యుండవలెను దాంభికులమై యంధులము మార్గదర్శకులముగా నుండఁజనదు అట్లయిన నిద్దరును గోతిలోఁ బోదురు స్వదేశస్థులయందుఁ దప్పులున్నయెడల నిదితప్పని ధైర్యముగాఁజెప్పి వారిని సంస్కరింపవలెను అది ప్రస్తుతము జనాభిప్రాయమునకుఁ బ్రతికూలముగానున్నను టుదకు లోకులు దానిలాభములను గనిపెట్టలేకపోరు మనోధైర్యమునకుఁదోడు స్వశక్తివిశ్వాసము (Self reliance) కూడ నుండవలెను అట్టి విశ్వాసమున్నవారే యెట్టి కార్యమైనను నెరవేర్చుటకు సమర్థులైయుందురు మనహిందూదేశమునం దదికొరవడి ఎల్లయ్యా దేశమునకేమియు నుపకారముచేయుటలేదు మల్లయ్యా తినవిద్య నెంతమాత్రము సద్వినియోగము చేసికొనుటలేదు మొదలగు సంభాషణములచే దామశక్తుల మనుకొని యితరుల సహాయమున కెదురుచూడవలసిన వారగుచున్నారు భ్రాతృవరులారా! ముందు దేశస్థులము కాఁబోవు మనమిప్పుడె తెలిసికొని యాత్మశక్తివిశ్వాసము ధైర్యము గలవారముగా నుండవలెను ఎన్నికష్టములు వచ్చినను సహించి యట్లుండుటచేతనే సంస్కారకర్తలందరును జయమందినారు శ్లో॥ యత్కర్మకుర్వతో స్యస్యా త్పరితో కాలరాత్మనః। తత్ప్రయత్నేన కుర్వీత విపరీతంతు వర్జయేత్ అనుమనువచనమును మూలమాత్రముగాఁగొని మనమేపనిని జేసిన మనయంతరాత్మ సంతోషించునో యాపనిని జేయుచు నంతరాత్మ కతృప్తికరమైన పనినిమానవలెను పామరులమాటలను పాటగాఁ బట్టకయుండి మనయుత్కృత్యములను నెరవేర్చుటకై కావలసిన మనోధైర్యమును స్వశక్తియందలి నమ్మకమును మనకుదయచేయుటకై జీవదయాపరుఁడైన భగవంతుని ప్రార్థించి యింతటితో విరమించు మీసహవిద్యార్థి— పోడూరి విశ్వనాథము

అబలాసచ్చరిత్ర రత్నమాల.

ఉపోద్ఘాతము

అబలాసచ్చరిత్ర రత్నమాలయను పేరిట ఉదాత్తములైన స్త్రీల చరిత్రములు వ్రాయఁ దలఁచినాను ఈచరిత్రములు వ్రాయుటయందు నాముఖ్యోద్దేశము లేవనఁగా —

(౧) స్త్రీలు అబలలనియు, బుద్ధిహీనలనియు, వివేక శూన్యలనియు, సకల దుర్గుణములకు నివాస స్థలములనియుఁ గొందఱునిందింతురు, అనేక పూర్వగ్రంథముల యందును ఇటులే వ్రాయఁబడియున్నది స్త్రీలపయిని దెచ్చిన యీదోషములన్నియు నబద్ధములనియు, స్త్రీలయం దత్యంత శౌర్యధైర్యవతులును, అసామాన్య విద్యావిభూషితలును, జ్ఞానవతులును, రాజ్యకార్య ధురంధరత్వమును గలవారును, స్వదేశాభిమానినులును, సకల సద్గుణ విభూషితలును, బూర్వముండిరనియు నిప్పుడున్నవారనియు స్థాపించుట నామొదటియుద్దేశము ఇంతియకాదు స్త్రీలయొక్క స్వాభావిక ప్రవృత్తి సద్గుణముల వైపునకేకాని దుర్గుణముల వైపునకుఁ గాదనియు సిద్ధాంతీకరించుట నా ప్రథమోద్దేశములోని యుద్దేశమే

(౨) స్త్రీలకు విద్యనేర్పినయెడలను, వారికి స్వాతంత్ర్య మొసఁగినయెడలను, వారు చెడిపోవుదురనియుఁ బతుల నవమానించెదరనియుఁ గుటుంబసౌఖ్యమును నాశము చేసెదరనియుఁ గొందఱు మహానుభావులు వక్కాణించెదరు ఈయారోపణములన్నియు నిరర్థకములనియు, స్త్రీవిద్య దురాచారప్రతీకారానుకూల మగునేకాని దురాచార ప్రవృత్త్యనుకూలము గానేరదనియు, స్త్రీవిద్యా స్వాతంత్ర్యములవలన మన దేశమునకు లాభమేగాని నష్టము గలుగనేరదనియు, స్త్రీవిద్య యత్యంతావశ్యకంబనియు, సోదాహరణపూర్వకముగా నిరూపించుట నాద్వితీయోద్దేశము

(౩) ఆంధ్రదేశములోని భగినీగణములకు మనోరంజకముగాను, ఉపదేశకరముగాను ఉండుపుస్తకము నొకదానిని రచించుట నాతృతీయోద్దేశము వట్టియుపదేశ గ్రంథములవలనను, కేవల కల్పనాకథలవలనను జేసినయుపదేశమునకంటె నిజమైన చరిత్రంబులవలనఁ జేసిన యుపదేశము అధిక ఫలప్రదంబగునని యందఱికిఁ దెలిసిన విషయమె గాన నిజములైన యీస్త్రీచరిత్రములవలన నాంధ్రసోదరీమణులకుఁ బాతివ్రత్యము, స్వదేశాభిమానము, స్త్రీవిద్య మొదలయినవాని గుఱించి కొంచెం విన్నవించుకొనవలయునని నామూలోద్దేశము

నేను వ్రాసెడి యీచరిత్రములలో ననేకములు మహారాష్ట్రభాషనుండియు, హిందీభాషనుండియు నాంధ్రీకరింపఁబడును గనుక నీచరిత్రములయందలి యుత్తమ భాగమునకై యాయాభాషలలోని గ్రంథకర్తలను మెచ్చవలయునేగాని నన్ను శ్లాఘింప

వలసినపని యెంతమాత్రమునులేదు

ఇట్టి రత్నమాలలు మూడుగ్రుచ్చి జనులకు సమర్పింపవలయునని నేఁ దలంచితిని అవియేవియనిన —

(౧) అబలాసచ్చరిత్రమాలయొక్క మొదటిభాగము—ఇందు హిందూదేశమునందుఁ బుట్టినయైతిహాసిక స్త్రీలచరిత్రములుండును ఐతిహాసిక కాలమనఁగా వేయిసంవత్సరముల నుండి నేటివఱకు జరిగినకాలము ఈభాగమునందు పద్మావతి, సంయుక్త మొదలైన ప్రాచీనస్త్రీలు మొదలుకొని, ఆనందీభాయి మొదలైన యర్వాచీన స్త్రీలవఱకు నయిన యుత్తమస్త్రీల చరిత్రములు రాఁగలవు

(౨) రెండవభాగము—ఇందు వైదిక పౌరాణిక స్త్రీలయొక్క చరిత్రములు రాఁగలవు వైదిక స్త్రీలనఁగా వేదమందువర్ణింపఁబడిన గార్గి, మైత్రేయిమొదలైన స్త్రీలు పౌరాణిక స్త్రీలనఁగా పురాణాదులలో వర్ణింపఁబడిన పార్వతి, సీత, తార, దమయంతి, ద్రౌపది మొదలైన స్త్రీలు

(౩) మూడవభాగము—ఇందు ఇంగ్లండు మొదలైన పరదేశములలోని స్త్రీల చరిత్రములుండఁగలవు

కాలమానమునుబట్టి చూడఁగా రెండవభాగములోని వైదిక పౌరాణిక స్త్రీలు మొదటిభాగమునందును, మొదటిభాగమునందలి యైతిహాసిక స్త్రీలు రెండవభాగమునందును రావలసియుండును కాని ప్రస్తుతము రెండవభాగము వ్రాయుటకై కావలయుసాధనములు నాయొద్దలేనందునను, ఆసాధనములు సమకూరు వఱకు నైతిహాసిక స్త్రీలచరిత్రములను ఆపుట యోగ్యమని తోఁచనందునను వైదిక పౌరాణిక స్త్రీలను రెండవభాగమునందుఁ జేర్చెదను ఇదియొక గొప్పదోషముగాదుగనుక చదువరులు మన్నింతురుగాక!

మొదటిభాగమునందలి చరిత్రములన్నియు నావద్ద నొకసారి గూడనందునఁ జరిత్రములు కాలక్రమముగా వ్రాయుటకు వీలుగలుగదు ఏయే చరిత్రము నాకెప్పుడెప్పుడు దొరకునో యాయాచరిత్ర మప్పుడప్పుడు వేయఁబడును చరిత్రాధ్యయనము మనముఖ్యోద్దేశము గాని, పరీక్షలకుఁ జదువువారివలె కాలక్రమానుగతమైనచరిత్రములను జదువుటమనయుద్దేశము కానందున నీచిన్నదోషమునుగూడ చదువరులుమన్నింతురుగాక!

మొదటిభాగమునందు రాఁగల రాణీభవానిగారియొక్కయు; రాణీ సువర్ణమయిగారియొక్కయు చరిత్రములలోని కొన్నిభాగములు జనానాపత్రికయందుఁ బ్రచురింపఁబడినవి ఆభాగములుగూడ నిందుఁ జేర్పఁబడినవని యెఱుఁగునది

భండారు - అచ్చమాంబ

అబలాసచ్చరిత్రరత్నమాల.

ప్రథమ భాగము

రాణీభవాని.

‘‘గుణాః పూజాస్థానం గుణిషు నచ లింగం నచ వయః’ - భవభూతి

ఉత్తరహిందూస్థానమునందు పూర్వము రాజకార్యధురంధరత్వమును వహించిన నారీమణులలో రాణీభవాని ప్రముఖురాలని చెప్పుటకు సందేహములేదు. ఈమె, బంగాళదేశమందలి రాజశాయి పరగణాలోని ఛాతీమను గ్రామమునందుండు ఆత్మారాంచౌధరి యనుగృహస్థుని కూఁతురు. ఈమె వార్ధకమునందీమెనుజూచినవారిప్పటికిని బంగాళమునందుఁగలరని చెప్పెదరు. ఈమెతండ్రి మిక్కిలి ధనవంతుఁడు కాకపోయినను, ఈమెయసమానసౌందర్యమును, అనుపమేయసద్గుణములనుజూచి నాటూరు సంస్థానాధిపతియగు రాజా రామజీవనుగారీమెను తమ కుమారునికి వివాహము చేసిరి.

ఈమె చిన్నతనమునందే విద్య నేర్చుకొనినదని కొందఱు వ్రాసియున్నారు. కాని యేయేవిద్య యెంతంతవఱకు నేర్చినదో తెలియదు. అయినను తరువాత నీమె చూపిన బుద్ధికుశలతనుబట్టి విచారింపఁగాఁ జిన్నతనమునందీమె చాలవఱకు విద్య నేర్చినదనియే తోఁచుచున్నది. దైవభక్తి, ధర్మబుద్ధి, కార్యనిర్వాహకత్వము నను నీగుణత్రయం బీవనితయందుఁ జిన్ననాటినుండియు వాసముచేయుచుండెను. పెనిమిటి రాజ్యము చేయుచుండినప్పుడును, పతిమరణానంతరము తనకు సర్వాధికారము సంప్రాప్తమైనప్పుడును, ఈలలన తనసుగుణములచేఁ బ్రజలనందఱిని రంజింపఁజేసెను. కావుననే, యీమెకీర్తి యజరామరముగనున్నది.

ఈమె పరిపాలించిన నాటూరుసంస్థానమును సంపాదించుటలో వీరిపూర్వికుఁడైన రామజీవనరాయగారుచూపిన ధైర్యచాతుర్యములు బహువర్ణనీయములు, గావున రాణీభవానిగారు చెందినయమితకీర్తికి మూలకారణమయిన యా యైశ్వర్యప్రాప్తిని గుఱించి యిచ్చట సంగ్రహముగ వ్రాసెదను.

కామదేవుఁడను బ్రాహ్మణునకు రఘునందన రామజీవనులను ఇరువురు పుత్రులుండిరి. వారు దర్పనారాయణుఁడను చిన్నజమీన్దారునివద్ద నుద్యోగములు చేయు

చుండిరి రఘునందనుఁడు మిక్కిలి సూక్ష్మబుద్ధిగలవాఁడు రామజీవనుఁడును తెలివి గలవాఁడే కాని రఘునందనుని యంతటివాఁడని చెప్పుటకు వీలులేదు ఆజమీన్ దారుఁడు రఘునందనుని బుద్ధికుశలతకు సంతసించి, ముర్షిదాబాదు నవాబుయొక్క దర్బారులో నతనిని తన వకీలుగా నేర్పరచెను తదనంతర మా దర్బారులోని వారంద ఱాతని చాతుర్యమునుజూచి యతనిని బహుసన్మానింపుచుండిరి ఆదర్బారులోని దివా నునకును ఇతఁడెంతో ప్రియుఁడయ్యెను ఇతని సచ్ఛీలమునుజూచి యాదివాను తన చేతిముద్రసయితమీతనియొద్దనుంచుట కిచ్చుచుండెను

ఈసమయమునందు ముర్షిదాబాదు నవాబునకుఁ జాలద్రవ్యము కావలసినందున, సర్కారు బొక్కసములోని ధనమంతయు నా నవాబు వ్యయపరచెను కావున ఢిల్లీబాదుషా తన్ను రాజ్యభ్రష్టునిజేయునని యతనికి భీతిగలిగెను వ్యయపరచిన ధన మెచ్చటినుండియయినఁ దెచ్చి బొక్కసము నింపుటకు వీలులేనందున నబద్ధపులెక్కలు వ్రాసి ఢిల్లీకిఁబంప నిశ్చయించిరి కాని యిట్టి నీతిమాలిన పనిఁజేయుట మంచిదిగాదని తలఁచి రఘునందనుఁడు, తాను ఢిల్లీకివెళ్లి యబద్ధపులెక్కలు లేకయె ఢిల్లీశ్వరుని సమా ధానపరచెదనని నవాబుతోఁ జెప్పెనఁట అందుకు నవాబు సంతసించి యతనిని ఢిల్లీకిఁ బంపెనఁట అప్పుడాతఁడు తనవక్తృత్వవైభవముచే ఢిల్లీశ్వరుని సమాధానపఱచి ముర్షిదా బాదకు వచ్చెనఁట అప్పటినుండి నవాబు రఘునందనునికి గొప్పగొప్ప యధికారముల నిచ్చి, తుదకతనికి తన దివాన్ గిరియిచ్చి 'రాయ' యనుబిరుదు నొసఁగెను ఇంతియ కాదు పేరుమాత్రము నవాబుది, అధికారమంతయు నితనిదేయని చెప్పుటకు సంది యములేనంత యధికారమీతనికి సంప్రాప్తమాయెను ఇట్లు పూర్ణాధికారములోనున్న సమయమం దాతఁడు, తనతమ్ముఁడయిన రామజీవనునికి రమారమి రెండుకోట్ల జమీన్ దారి యిప్పించెను తదనంతరము కొద్దిదినములలోనే రామజీవనునకు 'రాజా' యను పదవి నవాబువలనఁ బ్రాప్తమాయెను ఇప్పటివఱకీబిరుదు వీరవంశస్థు లనుభవించు చున్నారు

రాజా రామజీవనున కిరువురు పుత్రులుగలిగిరి వారిలోనొకఁడు బాల్యావస్థ యందే గతించెను రెండవవానిపేరు రామకాంతుఁడు తండ్రిగలించిన పిమ్మట, ఈ యన రాజ్యమునకధిపతియయి 'రాజా' యను పదవినిపొందెను ఈరామకాంతుని భార్యయే, మనచరిత్రనాయికయగు రాణీభవాని వివాహసమయమున రామకాంతు నికి ౧౭ సంవత్సరములును, భవానిగారికి ౧౪ సంవత్సరములును వయస్సుండెను. భార్యాభర్తలిరువురికి నొండొరులయెడ ప్రేమానురాగము లెక్కువుగ నుండినను త్వర లోనే రాజకార్యవిషయములందు వీరికి బహుకష్టములు ప్రాప్తించెను

రాజా రామజీవనుని కాలమునం దతనియొద్ద దయారామను బుద్ధికుశలతగలయొక మంత్రియుండెను రామజీవనుఁ డితనిని కుమారునివలెఁ బ్రేమించుచుండువాఁడు రామకాంతుఁ డితనిని ,,అన్నా యని పిలుచుచుండును మృతిసమయమునందు రామకాంతుఁడు, ప్రతికార్యమునందు నిఁక దయారాముని సమ్మతిచొప్పున నడవవలయునని బోధించి మఱి ప్రాణములువిడిచెను చిన్నతనమునందే గొప్పసంస్థానమున కధికారము లభించినందున రామకాంతుఁడు గర్వపడి, రాజకార్యవ్యవహారములయందు మనసుపెట్టక, స్వేచ్ఛానుసారముగా వర్తించి రాజ్యమును పాడుచేయసాగెను చేతఁ జిక్కిన ధనరాసులన్నియు హేయసుఖములకొఱకు వ్యయపరచెను ఇదంతయుఁ జూచి దయారాముఁ డనేకపర్యాయములు రామకాంతునికి బుద్ధిచెప్పెనుగాని యాగర్విష్ఠుఁ డాతనిమాటలు లెక్కసేయక మీఁదు మిక్కిలియాతనినిల్లు వెడలఁగొట్టించెను

నాటూరునుండి యిట్లు వెడలఁగొట్టఁబడిన దయారాముఁడు రామకాంతునిపయి మిక్కిలిద్వేషమువహించి, యచ్చటినుండి బయలుదేరి ముర్షిదాబాదుకు వెళ్లెను అప్పుడచ్చట రాజ్యముఁ జేయుచున్న నవాబు పేరు అలీవర్ద్ఖాన్ అచ్చటికి వెళ్ళినతరువాత దయారాము నవాబుకొలువుకూటమునకుఁ బ్రతిదినము వెళ్ళుచుండెను కొన్నిదినముల కాతఁడు తనబుద్ధికౌశలముచే నవాబు ప్రీతిని సంపాదించెను దయారాముఁ డొకనాఁడు నవాబు సమీపమునకుఁ జని ,,దేవరవారిధనమంతయు రామకాంతుఁడు వృథా వ్యయపరుచుచున్నాఁడు, సొత్తంతయు నపహరించి రాజద్రోహముచేయఁ దలఁచియున్నాఁడు ' అని చెప్పెను అప్పటినవాబులు విచారశూన్యులు, సారాసారవిచారముతోఁ బనిచేయువారుకారయిరి ఒకశబ్దముతో నొకరిని లక్షాధీశునిగాను, ఇంకొకరిని భిక్షాధీశునిగాను జేయుచుండిరి గాన దయారాముని మాటలువిన్నతోడనే, యీమాటసత్యమా యసత్యమాయని విచారణచేయక, రామకాంతుని ధనమెల్లఁగొల్లగొట్టుటకును, అతనిఁ బదచ్యుతునిజేసి యతని పెత్తండ్రికుమారునికి రాజ్యమిచ్చుటకునయి, నవాబు తనసైన్యములనుబంపెను నవాబుయొక్క యాజ్ఞప్రకారము దయారాము సైన్యములతో వెళ్ళి రామకాంతుని ధనభాండాగారములోనికిఁ జొచ్చి ధనమంతయుఁ గొల్లగొట్టసాగెను కోటలోనికి సైన్యములు చొచ్చినప్పుడు రామకాంతుఁ డంతఃపురములో భార్యాసమేతుఁడయి యుండెఁట

నవాబు సైన్యములు దండెత్తివచ్చిన సమాచారము విని, వాని నెదిరించుటకసమర్థుఁడగుటచే రామకాంతుఁడు వజ్రలాడితునివలె నేమియుఁదోఁచక నిశ్చేష్టితుఁడై యుండెను అతఁడిట్లింకఁ గొన్నినిమిషములుండినయెడల, శత్రువులాతని చెరఁబెట్టియే యుందురు కాని కుశాగ్రబుద్ధిగల యాతనిభార్యయగు భవాని, ప్రసంగావధానముఁ

గలది గనుక, భర్తభయమును దుఃఖమును శాంతింపఁజేసి, మోయఁగలిగిన నగలను చేతఁబుచ్చుకొని భర్తయుఁదానును ఎవరికిఁ దెలియకుండ పట్టణమునుండి వెడలిపోయిరి చిన్నతనమునుండియు భవాని కలలోనైనను కష్టములెఱుఁగని శ్రీమంతురాలు, పల్లకి లోనుండి కాలుక్రిందఁబెట్టుటయైన నెఱుఁగని భాగ్యశాలి ఇట్టిలేమ కీకష్టముప్రాప్తించి నప్పుడామె యెనిమిదిమాసముల గర్భవతిగానుండెను ఇన్నికష్టములు ప్రాపించినను పతిప్రాణములు దక్కినను సంతోషముతో నామెధైర్యముతో నడువసాగెను వీరిట్లు మిగులప్రయాసముతోనడచి పద్మానదీతీరముచేరియచ్చట నొకయోడవాని నాశ్రయించి, నదిదాటి మూర్షదాబాదుచేరి, యచ్చట బెదవారవారినొక చిన్నగృహమునకుండిరి అక్కడకుఁబోయినతరువాత రామకాంతునకుఁ దనపూర్వపు దురాచారమునకయి పరితాపముగలిగి, బుద్ధికుశలతగల తనభార్య చెప్పినచొప్పున నికనడచుకొనుటకు సమ్మ తించెను భవాని తిన్నఁ పెంపుడు కన్యగా భావింప ఎలసనదని చెప్పి, యనేకయుక్తుల తో నవాబుయొక్క బొక్కసదారుఁడగు జగత్సేటువానిని అనభర్తకు వశునిఁ జేసెను తన నగలలోఁ గొన్నిటని అమ్మి, యాధనముచె నవాబుయుద్యోగస్థులఁ గొందఱిని తనభర్తపక్షము నవలంబింపఁజేసెను తమకుఁబూర్వము మంత్రిగనుండి, పమ్మట అమ్మునీదశకుఁ దెచ్చిన దయారాముని బిలువనంపించి, అతని పాదములకు పెనిమిటిచే మ్రొక్కించి, తప్పులన్నియు క్షమింపుమని వేఁడుకొనెను ఇట్లు ప్రార్థింపఁగా, దయా రాముని మనసుకరఁగి, అతఁడు తిరిగిరామకాంతునికి రాజ్యమిప్పించెదనని ప్రతిజ్ఞ చేసెను తరువాత రాణిగారు తనయొడలి నగలన్నియు నేఁబదివేలరూపాయిలకమ్మి దయారాముచే నాధనమంతయు లంచములిప్పించి, నవాబువద్దనుండు అధికారుల నందఱిని వశపరుచుకొనెను ఇట్లుపీరిపక్షమవలంబించిన రాజకీయోద్యోగస్థులును, దయారాముఁడును, జగత్సేటునుగూడి, యెట్లో నవాబుమనసుత్రిప్పి మరల రామ కాంతునకు రాజ్యమిప్పించిరి ఇట్లు పోయినరాజ్యము మరలసంపాదించుటయందు రాణీభవానిగారు చూపిన యసామాన్యబుద్ధికౌశలమును, అనుపమేయ పతిభక్తియుఁ జూచి, స్త్రీబుద్ధిఃప్రళయంకరీ యన్నమాట సర్వథాయసత్యమనియే చెప్పవలసి యు న్నది. రాజ్యముతిరుగ సంప్రాప్తమయినపిదప ౧౫ సంవత్సరములు రామకాంతుఁడు, తనభార్యామణియొక్కయు, మంత్రిపుంగవునియొక్కయు ననుమతిప్రకారము సుఖ ముగారాజ్యముఁజేసి, మృతినొందెను పతిమరణకాలమున భవాని ౩౨ సంవత్సరముల ప్రాయముగలదైయుండెను

రామకాంతుని రాజ్యము పోయినప్పుడు రాణీభవాని గర్భవతిగా నుండెనని వెనుక వ్రాసియుంటినిగదా ఆమెకుఁ గొద్దికాలమునకుఁ బుత్రుఁడు గలిగెను లెద

నంతర మింకొక కుమారుఁడు పుట్టెను గాని యీయిరువురు పుత్రులును బాల్యమునందే గతించిరి తరువాత నామెకు తార యను కూఁతురుమాత్రమే కలిగెను తార చిన్న తనమునందే వితంతువయినందునఁ దల్లియొద్దనే యుండుచుండెను

భర్త మరణానంతరము భవాని సింహాసనమెక్కెను ఆసమయమున బంగాళా దేశమునకు సురాజ ద్దౌలాయను తురుష్క ప్రభువు నవాబుగ నుండెను హిందూదేశ చరిత్రముఁ జదివినవారికి సురాజ ద్దౌలాయొక్క దుశ్చేష్టలు బాగుగఁ దెలియును ఇతఁడు వ్యభిచారాది దుష్కర్మలకయి తమధనమంతయు వ్యయపఱచి తనచేతి క్రింది మండలాధిపతులయొద్దనుండి, బలాత్కారముగా ధనము స్వీకరించుచుండెను ధన మీయనివారిని మిగుల బాధపెట్టుచుండెడివాఁడు పరస్త్రీల నక్రమముగఁ జెరపట్టుట కీదుష్టుఁడు వెనుకదీయువాఁడు కాఁడు న్యాయమనుమాట యీయనరాజ్యమున నౌషధమునకయినను గానరాక పోయెను తన రాజ్యమున కట్టి దుష్టునివలన నెన్న డయిన ముప్పురాఁగలదని యెంచి, రాణీభవాని తన సైన్యములఁ జక్కపెట్టుటకు నారంభించెను సైన్యములోని భటులసంఖ్య హెచ్చించి, యుద్ధమున కసమర్థులగు భటులను తీసివేసి, సమర్థులయినవారిని జేర్చి, తానే సైన్యాధిపత్యమును స్వీకరించి సైన్యములోని యోధులచే వేడుక యుద్ధములుచేయించి, సేనలను బలపఱచెను ఇటులుచేసినది గావు ననే యీక్రింద వివరింపఁబడు కష్టమునుండి యీమెరాజ్యము తప్పించుకొనఁగలిగినది ఆకష్టమేదనఁగా —

రాణిగారి కొమార్తెయును గతభర్తృకయును అగు తార, బంగాళాదేశము నందంతట విఖ్యాతిఁగాంచిన సౌందర్యవంతురాలు ఈమె చక్కదనము సంగతివిని, నవాబున కీమెను చెరఁబట్టవలెనను దుర్బుద్ధి కలిగెను ఆమెను తనకీయుమని, యీతఁడు భవానిగారికి వర్తమానము పంపఁగా నామె యత్యంత క్రోధాన్వితురాలయి వచ్చిన దూతను మిగులనవమానపరచి పంపివేసెను ఇందుపయి నవాబు క్రోధావేశపరవశుఁడయి నాటూరు రాజ్యమంతయుఁ బాడుచేసి తారాధివాసులను జెరఁబట్టితెండని, తన సైన్యములఁ బంపెను ఇట్లు జరగునని రాణీగారి కిదివఱకే తెలిసియుండెనుగాన, ఆమె పట్టణపు త్రోవలన్నియు మూయించి, తానే సైన్యాధిపత్యమును వహించి, తన సైన్యముల వెంటఁదీసికొని రాజధానియొక్క బహిర్ద్వారము దగ్గర నవాబుసైన్యముల నెదుర్కొనెను ఇచ్చట నొక్క ఘోరయుద్ధముజరిగి, తురుష్కు లందు సంపూర్ణముగా నోడిపోయిరి అనేకులైన తురకలు నవాబుయొద్దకు పాఱిపోయిరి ఈసంగతి యితర రాజులకుఁ దెలిసినతోడనే వారు నవాబు సైన్యముల ననేకబాధలు పెట్టసాగిరి

ఇట్లు బంగాళాదేశములోని మండలాధిపతుల కందఱికి నవాబుదుష్టుఁడని తోఁచి

నందువలన వారందఱును అతనిని రాజ్య పదచ్యుతునిగఁ జేయుటకయి నిశ్చయించుట కొకనాఁడు జగత్సేటుగారి గృహమునందు సభచేసిరి కృష్ణాఘరు సంస్థానాధిపతి యగు రాజాకృష్ణ చంద్రరాయలును, డెక్కా_సంస్థానాధిపతియగు రాజారాజ బల్లవులును, పాట్నాయను నామాంతరముగల పాటలీపుత్ర సంస్థానాధిపతియగు రాజా రాయ దుర్లవులును, నాటూరురాజ్యమున కధికారిణియయిన రాణీభవానిగారును, ఆసభయందలి ప్రముఖులయియుండిరి ఆసభయందు క్రింద వ్రాసినప్రకారము సంభాషణలు జరిగినవని యొక యితిహాసకారుఁడు వ్రాసియున్నాఁడు —

జగత్సేటు—సురాజద్దౌలాను పదచ్యుతునిజేసి మీర్జాఫరనువానిని నవాబుఁ జేయుట బహూత్తమము ఎందుకనఁగా హిందూరాజులు చెప్పినటుల నడుచుకొనియెదననియుఁ, బ్రజలకు హితమగునటుల రాజ్యముఁజేసెదననియు నాతఁడు ప్రతిజ్ఞఁ జేసియున్నాఁడు ఇప్పుడు మనము నవాబును జేయఁదలఁచిన మీర్జాఫరు, నవాబుయొక్క సైన్యాధిపతి గనుక తురకల సైన్యములన్నియు నతఁడు చెప్పినటుల వినఁగలవు. గాన రక్తపాతము లేకయే మీర్జాఫరును నవాబుఁజేయవచ్చును

రాణీభవాని—నృపోత్తములయిన మిత్రులారా! బంగాళాదేశపు సింహాసనముపయి, తురష్కునినుంచక, హిందూరాజునే యుంచఁగూడదా! పోయిన స్వాతంత్ర్యమును మరల సంపాదించుకొనుటకు యోగ్యమయిన సమయమిదియేయని నాతాత్పర్యము!!!

రాజాకృష్ణచంద్రుఁడు—రాణీగారు! తమరు చెప్పినమాట బహుయోగ్యముగానే యున్నది ఎందుకనఁగా, స్వాతంత్ర్యమందఱికిఁ బ్రియమే కాని మనమాఱువందల సంవత్సరములనుండి పరతంత్రులమయియున్నాము మన కీర్తినష్టమయి యున్నది పరరాష్ట్రములను ధిక్కరించి స్వసంరక్షణము చేసికొనుటకు మనమసమర్థులము మనలో నైకమత్యములేదు పరస్పరద్వేషము లనేకములుగలవు గనుక హిందూనవాబు నేర్పరచినయెడల, మనలోమనము కలహించి, యొకరి నొకరము సంహారించుకొనుట సంభవించును ఇట్లుమనయందలిఁ కలహములఁజూచి మరాటావారు మనపయిదండెత్తి వచ్చి మనలను దిరిగి పరతంత్రులను జేసెదరు మరాటావారిని మన మెఱుఁగము వారు బహుక్రూరులని విందుము మనము తురుష్కులతోఁ గలసిమెలసి యున్నాము వారి స్వభావము మనకు బాగుగఁ దెలియును గనుక వారే మనకు రాజులుగానుండుటమేలు

రాణీభవాని—మీరు చెప్పినమాట గ్రాహ్యమే గాని రాజ్యారూఢుఁడయిన పిమ్మట, సురాజద్దౌలావలెనే, మీర్జాఫరు క్రూరత్వము నవలంబించిన పక్షమున మనమేమి చేయఁగలము

వ. వారలెవ్వరం లేని యుద్దీపియు సందీపియు నాదీపియుఁ బ్రోద్దీపియుఁ జిరంజీవి
యు ననువారేను మంత్రివరులు కదిసిన నాలోకించి దీనాననుండగుచు మేఘవర్ణుం
డిట్లనియె ౧౯

గీ. ఏనులేనిమీర లెందును గొలఁగారు। మీరు లేని నేను మృతునియట్ల
కాన నేను మీరుఁ గలిగితిమి యావేళ। భాగ్యమహిమఁ బగరబారిఁ బడక ౨౦

క. మీబుద్ధి బలము ప్రాపున। నాబాహు పరాక్రమమున నడచితిమి తుదిన్
మీబలచే నిల్లితిమి। యీబలమె మీఁది కార్యతంత్రము చెపుఁడీ ౨౧

వ. అనిన మేఘవర్ణునకు నుద్దీపియను నమాత్యుం డిట్లనియె ౨౨

సీ. బలవద్విరోధికిఁ దొలఁగి యవ్వాలనొండు బలవంతుతోఁ గూడి నిలుచుటొండె
ఫలముజగించి యసాధ్యమార్గంబు నొందుచో నవ్వాలనుండుటొండెఁ
గాక దూరంబుగాఁ గడిభూములకుఁ బోయి యుడుకారి యచ్చటనుండుటొండెఁ
గార్యంబులని నాకుఁ గానవచ్చినభంగిఁ జెప్పితినింక నీచిత్తమనిన
నతనిపలుకులు విన్నవాఁడై యతండు। వరుస సందీపి యనియెడివానిఁ జూచి
నీతలంపెట్టిదన్న నునెమ్మినతఁడు వినయశాలుఁడై మేఘవర్ణునకు ననియె ౨౩

గీ. తొలుత నుద్దీపి దేవరతోడ నిపుడు। పరవిఁ జెప్పిన మూడుపక్షములు నమరు
నందు విడుము త్తమంబును నదియు మిగుల। వేగపడిపోవు కార్యంబు వెరవుగాదు

క. తనయున్నచోట నుండఁగ। ననుకూలతఁ గార్యసిద్ధులగుఁ దగినక్రియన్
వినుమేఁకపోదుగుచన్నుల। జనితంబగుపాలు గళముచన్నులఁ గలవే ౨౪

చ. నెలవున నప్రమత్తమతినిల్చినరాజు జయంబుచేకొనున్
వల దనుమానమేమియును శ్వానము పెంచినయింటనుండ న
వ్వలనికి నెందఱేనరుగ వారలనందఱ మాటమాత్రలో
గెలుచు నసాధ్యమిద్ది పరికింపఁగ స్థానబలంబు పెంపునన్ ౨౫

గీ. కాన నెలవు విడువఁగా రాదు విడువక। పోకయున్న రాకపోకయైన
దేశకాలబలము తెరియుచుండినఁ గార్య। సిద్ధి నిజము నీకుఁ జెప్పనేల ౨౬

వ. అనుటయు ౨౭

క. విని యాదీపింగనుఁగొని। యనుకూలంబైన కార్యమడుగుటయును నా
మనమునఁ దోఁచినయర్థము। వినిపించెదననుమ నాత్మవిభునకు ననియెన్ ౨౮

చ. అతిబలవంతుఁడైన వినయంబున వారలతోడి మైత్రి సం
తతమును నిశ్చలంబగుమనంబునఁ జేసి నిజప్రదేశ సం

గతుఁడయి పొల్చుటొప్పు నదిగాదని యొండొకదేశమేగినన్
ధృతి మెయిఁ బోరిన న్విను మధీయుత నొచ్చు నతండు నేరమిన్ ౩౦

క అటుగాన నధికబలములఁ । చటుకున మనమిచటఁ గూర్చి తగు సంధియు సం
ఘటితముగఁ జేసికొని యీ । వటదుర్గమునందు నిలువవలయుంజూడన్ ౩౧

వ అని చెప్పలయును ౩౨

క అమ్మాటలు వెడయూఁకొని । క్రమ్మఱఁ బోద్దీపివంకఁ గనుఁగొని తగ నీ
నెమ్మనమునఁ గలకార్యము । నమ్మలితోఁ జెప్పుమా నిజంబుగ ననినన్ ౩౩

వ అతండవ్వాయసపతి కిట్లనియె ౩౪

గీ రాత్రిగాని కానరా దులూకములకుఁ । బగలుగాని కానఁబడదు మనకు
రాయబారి సంధిచేయుట కైపోవఁ । గాలమెద్ది పొందుగాదు దలఁప ౩౫

క అదిగానరాత్రిఁ గానక । కదలక నిద్రించుమనలఁ గ్రౌర్యంబెసఁగన్
జదియంగ మోఁదిపఱచిరి । వదలక యయ్యనువు దెలియవలదా మనమున్ ౩౬

గీ పగలుగానకున్న పగతురనరికట్టి । తెగవధింపకేల పగయడంగు
నాకుఁ జూడననియె నల్వురు నీభంగిఁ । బలుక నాలకించి పక్షివిభుఁడు ౩౭

వ సకల నయశాస్త్రి తత్త్వజ్ఞుండైన చిరంజీవియను నమాత్యుంగనుంగొని యతనికిం
బ్రియపూర్వకంబుగా నిట్లనియె ౩౮

క ఓతండ్రి నీదుబుద్ధి । ద్యోతంబున రాజ్యమేను దుది ముట్టంగాఁ
బ్రీతిన్ జేసితి బంధు । వ్రాతముతోఁ గూడ నధిక రాజసవృత్తిన్ ౩౯

వ కావున ౪౦

క ఇప్పటికిఁ జేయఁదగియెడు । నప్పనికం దెరువువెట్ట నర్హుఁడవనినన్
జెప్పఁదొడంగె నిజేశ్వరుఁ । గప్పినశోకతమ ముడుప ఖద్యోతనుఁడై ౪౧

క వీరిందఱుఁబరమాప్తులు । నేరుపుగల కార్యమతులు వీకెఱిఁగింపన్
వీరలకంటెను నెఱిఁగెడు । వారెవ్వరు నీతిశాస్త్రివాసన నెందున్ ౪౨

క ఐనను నాయెఱిఁగినపని । యేనించుక విన్నవింతు నిందఱు నాప్తుల్
గానమ్మి మెలఁగనేనియు । మానవపల కెందు గుప్త మంత్రము వలయున్ ౪౩

గీ మంత్రమాప్తపరంపర భ్రమందిపోవు । నఖిలకార్యంబులకు విఘ్నమావహిల్లు
విఘ్నమునఁ జేసె కార్యంబు వృద్ధిఁ బొంద । దట్లుగావున్న మంత్రంబు నరయవలయు

వ కావున మంత్రరక్షయ భూవల్లభులకుఁ బ్రధానకార్యంబని కార్యాకార్యజ్ఞుండైన
చిరంజీవి యిట్లనియె సంధివిగ్రహ యానాసన ద్వైధీభావ సమాశ్రయంబులను
షాడ్గుణ్యంబులు నెఱింగి కర్మప్రారంభ పురుష ద్రవ్యసంపత్తి దేశకాలవిభాగ విని

పాతప్రకార కార్యసిద్ధులను పంచాంగమంత్రంబులం బ్రవీణుండై సామ భేద దానదండంబులను చతురుపాయ ప్రయోగసమయంబులు నెఱిఁగి ప్రభుమంత్రోత్సాహశక్తిత్రయసంపన్నుండై తత్తదుచితానుష్ఠానంబులం బ్రవర్తింప వలయుఁగావున మన కులంబుగూడకుండుటం జేసి యుద్ధంబునకు సామర్థ్యంబులేదు కాలంబునుంగాదు దనశక్తియుఁ బరశక్తియు దేశకాలంబులును విచారించి బకప్రకారం బదనుగాచి యుండునది పంచాస్యంబునుంబోలె నాసన్నంబైన కార్యంబునప్పు డహితు నాహుతిగొనునదియని చెప్పి మఱియుం జిరంజీవియిట్లనియె ౪౫

క తనబలము నెదిరిబలమును । మనమునఁ జింలింపకరుల మర్దించుటకై
గొనకొనినవాని కొప్పమి । జనియించుట తప్పదంద్రు శత్రునికైనన్ ౪౬.

వ మఱియును ౪౭.

చ అతులిత సత్త్వ ప్రతాపమహిమాస్పదుఁడైన విరోధి దూర సం
స్థితుఁడగు నేనిఁ దద్విపుల తేజము తానడఁగించు నల్పుఁడా
యతశితశస్త్రహస్తుఁడయి యాదలదగ్గఱ నుండె నేనియున్
జతురుఁడుగాఁడు వైరిజనసంహరణంబునకున్ నిజంబుగన్ ౪౮

చ ఒనరఁగబుద్ధిమంతుఁడయి యొరు వుగల్గి యొకప్డు వేళ వ
చ్చినయెడఁ బౌరుషంబుఁ దగఁజేయఁగ నేర్చి పరాత్మదోషముల్
గనుఁగొనియుండి శాత్రవు నొకానొకనాఁడును విశ్వసింపఁగాఁ
జనదు వివేకియై నరుఁడు సారమతిన్ బ్రతుకందలంచినన్ ౪౯

చ వదల కుపాయవంతుఁడగువానికి నెన్నఁడు రాగశక్తిమైఁ
బదనికరానిబాలఁ దలపట్టుక యీడిచి తెచ్చినట్లుగా
కొదుగకచొచ్చి శ్రీపతి మహోన్నతిమైఁ దనుదానవచ్చి త
త్సదనమునందు నిల్చుఁ బ్రమదస్థితిఁ బాయక యెల్లకాలమున్ ౫౦

క వరమంత్రశక్తివశమై । గురురాజ్య శ్రీభుజంగ కుటిలవిహార
స్ఫురణంబుదొఱఁగి సతతము । వరపతులకు భోగదర్శనం బొనరించున్ ౫౧

క ఖలులకు మందులకును గ్రో । ధులకును లోభులకు గర్వితులకును నతి మ
త్తులకును గామాతురులకు । సులభంబే దండనీతి శోధింపంగన్ ౫౨

ఉ నాయముదప్పకెంతయు మనంబున గర్వములేక కార్యముల్
సేయునెడన్ విచారమతిఁ జేయుచు నేర్పును నొప్పు సద్విధో
పాయము బుద్ధియుంగల నృపాల వరేణ్యులచేత సాధ్యమై
పాయకదండనీతి సులభస్ఫురణన్ ధరియింపఁబొందగున్ ౫౩

వ అని చెప్పి చిరంజీవియు నిట్లనియె మనకు నియ్యెడం గయ్యంబునకుం గాలంబు గా
దెట్లనిన ౫౪

క బలసంపదలేకుండిన । బలయుధనము మంత్రవిధియు వసుధాపతికన్
బలుపగర నోర్చు ధనమున । విలసిత మంత్రంబుచేత విశ్వము గెలుచున్ ౫౫

క విను ప్రాణము వంచించిన । జనులకుం బొందంగరాని సంపద యర్థిం
దను దానవచ్చియుండును । వినులఘు నోద్యోగపరుని వేశమునందున్ ౫౬

గీ మంచిగుణములు గలిగిన మనుజునందు । ఫలము గలుగుట కనుమానపడంగవలదు
వర్తనంబున నష్టమైనవాని కధిక । సమృద్ధికైశ్వర్య సంప్రాప్తి సంభవించు ౫౭

క శూరుడు సుదారశుద్ధుడు । సాగమతులునైన బుధుల సాహాయ్యమునన్
భూరమణుం డున్నతుడగు । నారయ నృపుడగుట సత్సహాయితంగా దే ౫౮

చ వలనగు రాజ్యలక్ష్మి పరవంశపరంపర వచ్చినట్టు ని
ర్మలగుణుడైన రూపజితమన్మథుడైన మనీషియైనం గా
వలెనని తావరింప దలవాంఛ వరించు రహస్యవంతుడై
యలవడి సత్సహాయయుతుడైన నృపోత్తము నెల్ల భంగులన్ ౫౯

గీ ధరణి సత్సహాయ విరహితునకుం గార్య । మొక్కటైనం జేయ నేరపు గాదు
పక్షహీనమైనపక్షికి నాకాశ । గమన మనువుపడనికరణి నధప ౬౦

ఉ ఏలిక యాత్మబుద్ధిం దనకించుక దోపనికార్య మాప్తుడై
చాలవివేకియైన ఘనుసన్నిధి నూహయొనర్ప నేర్చనం
బోలంగ నెల్లభంగులను బొందగుచుండు విఘాతదూరత
న్నాలమిచేత నోడ జతవంబుగం దీరము చేరుచందమై ౬౧

చ సతతము న్యాయముల్ న్యయము సమ్మతితోడ నటించి గోప్యమం
త్రితయును గూఢచారపరిరక్షయుం జేసిన రాజు ప్రాణి సం
హతి కహితంబు పల్కక దయాపరుడైనం జతుస్సముద్రము
ద్రితనిఖిలోర్వియంతయు నతిస్థిరతన్ భజయించువాడగున్ ౬౨

క చెడు నాత్మశక్తియెఱుంగక । కడుగర్వముతోడం గడంది కార్యము చేయన్
దొడరియవిచారమూఢుం । డడవిన్ గుపమునం బడిన యంధుండు పోలెన్ ౬౩

వ కావునం గయ్యంబియ్యెడం గార్యంబుగా దులూకంబులకును మనకును సహజవైరం
బు కతంబున సంధియుం బొసంగ నేరదనిన విని మేఘవర్ణుం డిట్లనియె ౬౪

క మనకయ్యులూకములతో । ననఘా సహజంబు వైర మగుటేకతనన్
జనియించెననిన నతండి । ట్లను వాగ్దోషమున వైరమయ్యె విను మా ౬౫

గీ. తొల్లి యొక గార్దభము పులితోలఁ దోడఁ । గప్పఁబడుటను వేసవికాల మెల్లఁ
బైరుగడుపార మేయుచు బ్రతికియుండి। యంత వాగ్దోషమున హతి మయ్యెఁగాదె ౬౬
వ. అనిన నవ్విధం బెట్లని మేఘవర్ణుఁ డడిగినఁ జిరంజీవి యిట్లనియె ౬౭
సీ. ఒకయూర నొకచాకి యొక్క గాడిదఁ దెచ్చి దానిలావుగ మేపఁదలఁపు పుట్టి
పులితోలు పైఁగప్పి పొసఁగఁ బండిన చేలు మేయ రాత్రులు దోల మేసి యరుగఁ
బులియనుబుద్ధి నాపొలముకావలవారు దూరంబుననుజూచి తొలఁగి పఱవఁ
బైరెల్ల వృథయైనఁ బరికించి యొకనాఁడు విసివి యొక్కరుఁడు సాహసముతోడఁ
గడఁగి దూరంబునందునఁ గంబళంబుఁ । గప్పికొని వింట శరమిడి కాచియుండ
నాఖరము వచ్చి యాలిని నచటఁ గాంచి। పెంటిగాడిదయని చాలఁ బృథురవమున ౬౮
ఎ. చేరంజూచి దానికయి పొంచినయతండు ౬౯
క. పులియని పాతితినక్కట । బలుగాడిద యొఱఁగుకతన బైలయ్యె నికన్
దొలఁగ భయంబేల నయొక । యఘుప్రదరమున దానియసువులఁ బాపెన్ ౭౦
ఎ. కావునఁ గాకులకు నులూకంబులకు వాగ్దోషంబునం జేసి ప్రబల విరోధంబు సంభ
వించె నవ్విధంబు వినుమని యిట్లనియె ౭౧
క. ఈక్షితిలోనం గలిగిన । పక్షులు దమలోనఁ గూడి ప్రభువై మనలన్
రక్షింపఁగవలెనని నిజ । పక్షమున నులూకవిభునిఁ బట్టము గట్టన్ ౭౨
వ. ఉద్యోగించుసమయంబునం దొక వృద్ధకాకం బాపక్షిసమూహంబు కడకుం జను
దెంచి యవి తమయుద్యోగించిన కార్యం బాకాకంబున కెఱింగించిన నది యిట్లనియె
ఉ. క్రూరము ఘోరదృష్టియు విరూపము నీచము నైజకోప దు
ర్వారము నై దివాంధమన వర్తిలు ఘూకముఁ బక్షిరాజుఁగా
మీరలు సేయ నేమిటికి మీఁదట దీని నెపంబునన్ ముదం
బారఁగ రాజ్యరక్ష మనకబ్బదు సుం డెడరైన వేళలన్ ౭౪
గీ. రాజు లేకయున్న రాజున్నయట్లుకా । రాజు నెపము చెప్పి బ్రతుకవచ్చుఁ
జంద్రు నెపము వెట్టి శశకంబులొకకోట । నెడరువాసి సుఖముఁబడసెఁగాదె ౭౫
వ. అనినవిని పక్షులావృత్తాంతంబంతయు నెఱిఁగింపుమని యడిగిన నావృద్ధకాకం
బిట్లనియె ౭౬
సీ. ఏకొండ చూచిన నెర్రగల యెడఁ బెర్వ పొగలేని యనలంబు లెగయుచుండ
నేచెట్టు చూచిన నెలమిఁ బచ్చని యాకు వెదక మందునకైనఁ జదుమలేక
యేనది చూచిన నెల్లెడ జలమింక విసరెడు గాలితో నిసుము చల్ల
నేదిక్కు చూచిన నెండమావుల పజ్జ మృగములు జలమంచుఁ దగిలి పఱవ

సలిలతత్వంబు వనరుహాసనుఁడు మాన్పఁ। బోలునో కాక యింతలోఁ బొడవడంగ
నసఁగ సకలజంతు భయావహంబుగాఁగ। దూషితముగ ననావృష్టి దోషమయ్యె ౭

వ ఇవ్విధంబునం బండ్రెండుసంవత్సరంబు లనావృష్టదోషమైన నొక్కయెడ మహా
గహనంబునం గల గజంబులన్నియుం గూడుకొని తనుకు నేలికయైన గజయూథనా
థునింగనుంగొని యిట్లనియెఁ బల్వలోదకంబు లల్పమృగంబులకు నోడలు దడుపం
జాలుఁగాక ఖరకరకిరణంబులం దపియించు మాకుం దగినయుదకంబులు లేవని
మఱియు నిట్లనియె ౮

గీ వెన్నమునుఁగంగ నుదకంబు విరవిగల గు। వారిజాకర మెండైన మాకువలయు
నల్పజలముల మాదాపంమడఁగ నేర। దేమిసేయుదుమనిన గజేంద్రుఁడనియె ౯

క దిక్కులకుఁ గొందఱరుగుం। డక్కడ జలమరసి యిచటి కరుదేరంగా
నొక్కమగుచోటికరుగుద। మిక్కడున కీలవెఱవ నేఁ గలుగంగన్ ౧౦

వ అని యగ్గజేంద్రుఁ డగ్గజంబులలోన నధిక జవసత్వంబులం గల యేనుంగులఁ గొన్ని
టిని దిక్కులకు నీరారయుంబంచిన నవియునుంబోయి జలంబెందునుంగానక లిరుగ
నొక్క మహానాగం బాగజేంద్రునిఁ గదియంజని యిట్లనియె ౧౧

ఉ ఇన్నిదినంబులయ్యును గజేశ్వర చంద్రసరోవరంబునా
నెన్నిక కెక్కునట్టి కొలనేర్పడి యున్నది గానమైల మీ
యున్నవనంబు పొంతఁ గమలోత్పలకైరవహల్లకాది చం
చన్నవపుష్పసౌరభవిశంకట శీతపయః ప్రపూర్ణమై ౧౨

చ కురువకతింత్రిణీ లికుచకోమలతాలతమాలసాల స
సరకదళీలవంగపనసక్రముకార్జున నారికేళని
ర్జరకనకామ్రవంశముఖచారుమహీరుహపంక్తిచేత సు
స్థిరతరమైన యక్కొలనితీరము సొంపువహించు నెంతయున్ ౧౩

గీ జమ్మ్ము మ్ముఱ్ఱ మశ్వత్థసమితియమిత। మజ్జములు కేతకంబులు నపరిమితము
లధిప మనకుండ మంచిచోటబ్బె నేఁడు। వేగవిచ్చేయు మనమదద్విరదవిభుఁడు ౧౪

వ నితాంత సంతుష్టాంతరంగుండగుచు నచ్చోటికింగదలిపోవ నుత్సహించుచుండునంతట
నీరారయంబోయిన గజంబులుఁ జనుదెంచినిలిచి చంద్రసరోవరంబుంగాంచి వచ్చితి
మని విన్నవించిన శత సహస్ర సంఖ్యలంగల గజంబులఁగూడుకొని సంరంభవిజృంభి
తుండై కదలునట్టి గమనవేగంబున ౧౫

సీ పాదఘట్టన నేలబారమగ్గలమైన క్రుగ్గిదిగ్గజములు క్రుగ్గిపడఁగ
నురుపడిఁబాఱుచో నెరసిన తరులెల్లఁ దిట్టలై మహిఁజాపకట్టుపడఁగ

ఘీంకారరవము సంకీర్ణమై పర్వఁగ దండకొండలు ప్రతిధ్వనులనీనఁ
గర్ణజానిలమున గగనభాగమునకుఁ దేలి మేఘంబులు దూలిపోవ
దేవసైన్యంబులకునోడి దితిజకులము । నిలువఁ జోటెచ్చటనులేక జలధిఁజొరఁగఁ
బాఱుతెంచిన చందమై భద్రకరులు । త్వరితగమనంబునను సరోవరముచేర ౮౬

గీ అట్టిసంరంభ గమనంబునందు నడవిఁ । గల శశంబులు తత్పాద ఘట్టనమున
ప్రమదిమృతిఁబొందుటయుఁజింతనొందిశశక । నాయకుండు శిలీముఖనాముఁడొకఁడు

వ తానరణ్యంబునంగల శశకంబులకెల్లను రాజు గావునఁ దనబంధు వ్రాతంబు మృతిఁ
బొందుటకుఁ బరితప్తాంతఃకరణుండగుచుఁజింతించుసమయంబున నతనియమాత్యులు
కొందఱు దైవయోగంబున శేషించినవార లచ్చటికిం జనుదెంచి యభివందనంబు
లాచరించినం గన్నీరొలుక వారలం గనుంగొని శిలీముఖుం డిట్లనియె ౮౮

చ వఱపుజనింప నేల యనివారణ వారణపంక్తులింతిగాఁ
బఱవఁగ నేల యిట్లు గలబాంధవులందఱు గాలిధూళిగా
నుఱక విధాత యేమిటికి నుండఁగఁజేసెను నాదుజీవనం
బెఱుఁగఁగ నేరనైతి మతిహీనులకెక్కడి వేశుభంబులున్ ౮౯

వ అని యిట్లు చింతాక్రాంతుండై యున్న తనయేలికం జూచి బహువృత్తాంత విదుం
డగు విజయుండను నమాత్యుండిట్లనియె ౯౦

ఉ వచ్చినవారికన్ వగవఁ జయ్యన వారలులేచి క్రమ్మఱన్
వచ్చుటలేమి దెల్ల మిఁక వారణముల్ మగుడంగ నింతిగా
వచ్చిన నున్నవారము నవశ్యముఁ జత్తుముగాన దీనికన్
జెచ్చెరఁ జింతసేయుము విశేష మతిం బ్రతుకం దలంచినన్ ౯౧

వ అనినం దెలివొందిన చిత్తంబుతోడ సుముఖుండగుచు శిలీముఖుండు దనయమాత్యుం
డగు విజయున కిట్లనియె ౯౨

క గిరిగహ్వరముల కొండెను । ధరణీవివరములకొండెఁ దడయక చని య
య్యురవుల నొరుగుదమనినన్ । వెరవగు నది మనకు ననుచు విజయుండనియెన్

గీ ఏమఱుటఁజేసి యిటువంటియెడరుపుట్టె । మోసపోయితి మెఱిఁగిన మోసగలదె
నెలవు విడువక నిలువంగ వలయుఁగాక । పందతనమునఁ బాఱు టేపౌరుషంబు

వ అనిన శిలీముఖుండిట్లనియె ౯౫

గీ నిన్నుఁగడచినట్టి నిజమైన హితుఁడును । నీతియుతుఁడుఁగలఁడె నిర్మలాత్మ
జయము నాకుఁగలుగు సమధికోపాయంబు । తలఁపు నీవునాకుఁగలఫలంబు ౯౬

వ అనుమాటకు విజయుండిట్లనియె ౯౭

క దేవ ననుభారఁ బెట్టితి । గావున నాసామజములకడకుం జని యా
ద్రోవ మనమీఁదరాకయె । పోవు నుపాయంబుచేసి పుచ్చెదఁ గడఁకన్ ౯౮

వ అని యతండాప్రొద్దకదలి పోయి చంద్రసరోవరతీరంబున నున్నయగ్గజయూథం
బులంబొడగని దన మనంబున ౯౯

సీ చేరినఁ జేసాచి చెనకెడుఁ గతి దంతి నిజకరంబునఁ బట్టి నేలఁ గలపు
నొక్కింత మార్కొన్నయోజమై నురగంబు గదియఁబోయినమాత్రఁ గఱచిచంపు
మేలమాడెడువాఁడుపోలె వినోదంబువెలయ నవ్వుచు మహీవిభుఁడు చెఱుచు
నత్యంత వినయసాంగత్యంబు మెఱయంగఁగూడి దుర్మార్గుండు గీడుసేయుఁ
గాన నాకువీనిఁ గదియంగ నేలంచుఁ । జెంతనున్నశైల శిఖరమెక్కి
నిక్క యోగజేంద్ర నీకు సేమమెయున్నఁ । దొండమెత్తి చూచెఁగొండమీఁదు ౧౦౦

వ చూచి సూక్ష్మరూపంబుననున్న యాచెవులపోతుం గనుంగొని గజేంద్రుం డోరి
నీవెవ్వండ వెచ్చటనుండి యిచ్చటికంజను దెంచితి యనిన నతఁడు నాపేరు విజయుండని
యిట్లనియె ౧౦౧

గీ ఓషధులఁ బ్రోచి జీవులనుద్ధరించు । వైరివాఫ్తునిదూత నిక్కడకు నన్ను
నతఁడు పుత్తేర వచ్చితిననినఁ గజము । కార్యమే మిచ్చటనుమమ్ముఁ గనుటకనిన

వ అగ్గజశ్రేష్ఠునకు విజయుం డిట్లనియె ౧౦౩

చ పెఱికినయాయుధంబుగొని భీతిలఁగాఁ బొడువంగఁ జూచినన్
వెఱవక దూత స్వామిహితనిశ్చితకార్యము పల్కుటొప్పు న
త్తెఱఁగున వాఁడు రాజునకుఁ దెల్లమి పుత్రసమానుఁ డట్లుకా
నెఱుఁగుము నన్నుఁ జంద్రునకు నిష్టతనూభవుఁగా మనంబునన్ ౧౦౪

వ కావున నేను నిజంబుపల్కెద నాకర్ణింపుము ౧౦౫

క ఎదిరి తనసత్వమెఱుఁగక । మదమున వైరమ్ముగొన్న మతిహీనునకుం
దుదిఁగీడు పొందకుండునె । వదలక యివ్విధముఁ దెలియవలయున్ మీకున్

క ఈకొలను చంద్రుపేరన్ । బ్రాకటముగ మున్నుకలిగె బహుపక్షికుల
వ్యాకీర్ణతటసమీపా । నోకహ సురసిద్ధసాధ్య నుతిపాత్రంబై ౧౦౬

క ఇందులకుం గావలిగాఁ । బొందుగ మమ్మునిచినాఁడు బుధజనకుఁడు మ
మ్మిందఱిని మట్టిచంపితి । రిందునితో వైరపడఁగ నెంతటివారల్ ౧౦౭

క శశికనవశ్యులమగుటను । శశకములనఁ బరఁగి ధాత్రిఁ జరియింతుము క
ర్కశహృదయులార మీకును । వశమగునే నిలువననిన వారణమునియెన్ ౧౦౮

క ఈతెఱఁగెఱుఁగక వచ్చితి । మీతెరువున నడవమింక నేఁగెద మిదెమీ
గీతపూర్వఁగఁ దగునన । మాతంగమ్మునకు శశము మఱియుంబలికెన్ ౧౧౦

క ఈయపరాధంబున కీ। రేయి కళానిధికి మ్రొక్కి ప్రియమున ననుపన్
బోయెదవుగాక యనుటయు। నాయేనుఁగు నీయకోనియె నాఁగా కనుచున్

ఉ అంతటఁ బ్రొద్దుగ్రుంకుటయు నాశశకంబు గజేంద్ర రోహిణీ
కాంతునికొల్వు చూచుటకుఁగాఁ దోడితెచ్చితిఁ జూడుమంచు ని
శ్చింతతఁజేరి దంతికి శశిప్రతిబింబముఁ జూప మ్రొక్కుచో
రంతులు చిత్తగింపు మపరాధము సైపుమటంచు వేఁడుచున్ ౧౧౨

క ఆచెవులపోతు కరిపతిఁ। జూచి కాంతుండు కరుణసొంపున నిన్నున్
గాచి విడిచి యనిపెను సం। కోచింపక వేగఁ బొమ్ము కోరినయెడకున్ ౧౧౩

క ఎచ్చిన తెరువునఁబోయిన। వచ్చుఁజుమీచేటు కాన వచ్చినపని నే
మచ్చికఁజెప్పితి ననుటయు। నెచ్చరికన్ గరివిభుండు నెఱుఁగుదుననుచున్ ౧౧౪

క గజయూథంబులు గొలువఁగ। గజనాథుఁడు గదలెఁ దీవ్రగమనంబున న
వ్విజయముఁగైకొని చెలఁగుచు। విజయుండను శశకమేగ విభుఁడున్నెడకున్

వ చను దెంచి తత్స్వామికిం బ్రణామం బాచరించి దేవా గజయూథంబులు మన మీఁద రాకయుండునట్టి యుపాయంబును నెరోవరతీరంబున నిలువనేరక దూరం బరుగునట్టి తెఱంగునుం జేసివచ్చితి నెలవుదొలంగక సుఖస్థితి నుండుండనిన నవ్విజయుం గౌఁగిలించుకొని ప్రీతుండై బహువిధంబులఁ బ్రశంసింపుచు నచ్చోటు కదలక శిలీముఖుండు సుఖంబుననుండె ౧౧౬

క కావున నీయల్పుఁడు ప్రజ। నేవెరవునఁ బోచుటకిది హీనునిఁ బతిఁగా
సేవింప శశకపింజల। భావంబునఁ జేటుగల్గుఁ బరమార్థ మిలన్ ౧౧౭

వ అనినఁ బక్షులు మాకు నక్కథ వినవలయుఁ జెప్పుమనిన వృద్ధకాకం బిట్లనియె

చ ఒక పెనుమ్రానికొమ్మతుద నొప్పుగుగూఁట వసింతునేను దా
నిక నటక్రిందితొఱ్ఱఁ దగనిల్చి కపింజలముండు నున్నవో
నకుటిలమిత్రభావమున నర్మిలి నాహృదయంబు దానిపైఁ
బ్రకటముగాఁగ నిద్దఱము పాయకయుండుదు మెల్లకాలమున్ ౧౧౮

గీ అట్లు మెలఁగంగ నొక్కనాఁ డక్షిగంబు। పొసఁగ మేఁతకునై పోయి మసలుటయును
గొందలంబున వెదకంగఁ గోరి పోవ। వెనుక నాపక్షి యుండెడునునికిపట్టు ౧౨౦

వ దీర్ఘకర్ణుండను పేరంబరఁగు శశకంబు చొచ్చి కొనియున్న సమయంబున నాపక్షియుం జనుదెంచి యిట్లనియె నే నుదరపోషణార్థంబరిగి వచ్చునంతకు నాయిల్లు చొరఁదగవగునే వెడలుమనిన దీర్ఘకర్ణుం డిట్లనియె ౧౨౧

గీ విడిచిపోయిన యింటికిఁ బుడమి లేదు। లేని ధరణికి మగదిక్కు లేనిసతికిఁ
గడఁక నెవ్వనికని నాసగాకమాన। దేను బలవంతుఁడను నీవు నేలవిడుతు ౧౨౨

క నాకిప్పుడుండ నర్హం। బీకోటరు మేలవిడుతు నిలఁ జెఱువులుఁ బ
ద్మాకరములుఁ గూపంబులుఁ। గైకొన్నవి వారిసొమ్ముగా మనువనియెన్ ౧౨౩

ప మనుస్మృతి మార్గంబు గలదు గావున నే నిచ్చోటు విడువననినఁ బక్షి యిట్లనియె

క మొగమోటలేక నాయి। ల్లగునని గైకొనఁగ నీకు నర్హమె యిచటన్
దగవునకు రమ్ము లేదా। జగడంబగు నీకు నాకు శత్రుత్వమునన్ ౧౨౪

వ అనుటయు దీర్ఘకర్ణుండు తగవనినం గాదనవచ్చునే రమ్మని వెడలిన నాపక్షియుం
దోడన కదలునప్పు డయ్యాశ్చర్యంబు నేనునుం జూచెదఁగాకనుచు నంత నంతం
జనుచుండ నవి గొంతదవ్వరిగి యరిగి మనకుం దగవు చెప్పందగువా రెవ్వరనినఁ బక్షి
శశకం బిట్లనియె ౧౨౬

క యమునానదీ తటంబునఁ। దమసత్యవ్రతుఁడు గలఁడు దధికర్ణుఁడనన్
గ్రమమెఱిఁగిన మార్జాలము। తెమలక మనమతని నడిగి తెలియుదమనినన్ ౧౨౭

వ కపింజలం బిట్లనియె ౧౨౮

క పిల్లి కడుఁ గ్రూరహృదయం। బెల్లప్పుడు నమ్మఁ బోలదే నెఱుఁగుదు నీ
యుల్లమున కెట్లుగలిగెన్। జెల్లంబో నమ్మికనినఁ జెప్పందొడఁగెన్ ౧౨౯

క ఆచారవంతుఁ డుత్తముఁ। డీచేరువ నాగలెల్ల నెఱుఁగుదు రతనిన్
నా చేరువగా వెఱవక। వే చను దమ్మునినఁ బక్షివిని యిట్లనియెన్ ౧౩౦

గీ భయము నీకు నాకుఁ బరఁగంగ నేకంబు। నాకు నమ్ముకేదు నీకు రాదు
చెప్పఁదగినబుద్ధి చెప్పితిఁ గాకంచు। నదియు నదియుఁ గదలి కదియఁ జనక ౧౩౧

వ ఎడదవ్వుల నిలిచి దధికర్ణు నుద్దేశించి ౧౩౨

క ఇరవునకునై వివాదం। బిరువురకుం గలిగి యిచటి కేతెంచితి మీ
వరుసను సమచిత్తుఁడవై। వెరవున మముఁ దీర్చిపంపు వేగంబనినన్ ౧౩౩

వ విని యల్లన తలయెత్తి చూచి దధికర్ణుం డిట్లనియె ౧౩౪

గీ మున్నువలెఁ గాదు ముక్కలి ముసలినైతిఁ। గదిసియుండినయదిగాని కానరాదు
వాటముగ నంతదూరంబు మాటవినను। మిగుల నింద్రియవైకల్య మగుటఁ జేసి

క ననువిశ్వసించి చేరం। జను దెండని పలుక నవియుఁ జకితస్థితి నో
య్యనకదియ వెఱవ నేటికిఁ। బనివడి యిటవచ్చి ప్రకృతి బాంధవులయ్యెన్ ౧౩౬

క ధర్మంబు చెఱుపఁ జెఱుచును। ధర్మము రక్షించువానిఁ దారక్షించున్
ధర్మంబు చెడకయుండను। నిర్మలమతి నడపవలయు నిశ్చలనియతిన్ ౧౩౭

క. ధర్మంబు పరమమిత్రుఁడు। ధర్మము వెనువెంట వచ్చుఁ దక్కిన ధనముల్
కర్మాయత్త శరీరము। నిర్మూలంబైనచోట నే వసియించున్ ౧౩౮

గీ. ఇట్టి మాటలెల్ల నివి నిజంబులుగాని। యథమవృత్తిఁ గల్లలాడ నేను
గల్లలాడునట్టి కష్టుఁ డెవ్వండైన। మునసి నరకకూపమున వసించు ౧౩౯

క. తలఁప నహింసకు మిగులఁ। గలిగినధర్మంబు లేదుగావున నే నీ
తెలివిని దగజీవాత్మం। దలఁపుచు నున్నాఁడ నిందుఁదలఁపనిబుద్ధిన్ ౧౪౦

క. పరభామినిఁగన్నతల్లిఁగఁ। బరధనముం బెంకుగాఁగ భావింపుచు స
త్పురుషుండు సర్వజీవుల। నిరతముఁ దనయాత్మఁ గాఁగ నెమ్మదిఁజూచున్

గీ. సకలభూతసమితి సౌఖ్యదుఃఖంబులు। తనవిగాఁ దలంచుతత్త్వవిదుఁడు
జన్మమృత్యుభయవికారంబు దిగఁద్రోచి। లలితగతిని మోక్షలక్ష్మిఁ జెందు ౧౪౨

వ. అట్లు గావున ౧౪౩

గీ. ఎవ్వరికి హింస యొనుక హితముచేసి। నాఁడు నాఁటికిఁ జాంద్రాయణ వ్రతంబు
సలుపుచున్నాఁడ నాలపోఁబలము కలిమి। నడుగుఁడే మైనఁ జెప్పెదు నభిమతములు

క. అని తన్ను నమ్మఁబలికిన। విని వెఱపక చేరఁబోవ వేగమె రెంటిన్
మునుగాళ్లనడఁచి వానిన్। దినియెన్ గ్రూరాత్ము సమ్మతింతు రెయుందున్ ౧౪౫

వ. కావున నీయుల్వండు రాజ్యార్హుండుగాఁడని యావృద్ధకాకంబు పలికినం బక్షులు
విని యిది నిజంబుపలికెం దప్పదని యాయులూకంబును రాజ్యాభిషేకంబునకుం
దొలంగించి పక్షులయ్యైదిక్కులకుం జెదరిపోయినఁ దదనంతరంబ యయ్యులూకంబు
వృద్ధకాకంబుకడకుం జనుదెంచి రోషసంరక్త లోచనంబులు మఱియు నుద్ధతం
బగుచు నిట్లనియె ౧౪౬

క. నీ కేమికీడుచేసితిఁ। గాకమ రాజ్యార్హుఁ డితఁడుగాఁడని నన్నున్
గైకొనక పలికి తిప్పఁడ। నైకానంబడిన భావమది యయ్యెదియో ౧౪౭

వ. అని మఱియు నిట్లనియె ౧౪౮

సీ. తోడరి వాఁడిశరంబు దూఱిపాఱినగంట మంత్రౌషధంబుల మాననేర్చుఁ
బరశుఖండితమహాపాదపోన్నతశాఖ జగిమించుఁ గ్రమ్మఱఁజిగురువెట్టు
దర్పితభయదోగ్రదావాగ్నిశిఖలచే మాడినతృణమెల్ల మగుడ మొలచు
నిష్ఠురోక్తులచేత నెఱిఁజెడ్డకార్యంబు మగుడ నెన్నండును నిగుడకుండుఁ
గాన నాకుఁ బక్షిగణములనుష్ఠించు ప్రాభవంబు చెఱుపఁబడియెఁ గాన
నోరి మీకు మాకు వైరంబు వాటిల్లె। ననుచు గూబచనియె నాగ్రహమున ౧౪౯

వ. అదియ కారణంబుగా నులూకంబులకుఁ గాకంబులకు సహజవైరంబు వాటిల్లెనని
చిరంజీవిచెప్పి మఱియు నిట్లనియె దేవా మును చెప్పంబడిన షాడ్గుణ్యంబులలోన

సంధివిగ్రహంబు లిప్పటికిఁ బ్రయోజనంబులుగా వాసనయానద్వైధీభావసమాశ్ర
యంబులు విచారణీయంబులనిన వినియతం డాసనక్రమం బెట్టిదనిన ౧౫౦

గీ విమతుఁడధికుఁడై కడుసమీపమున నున్న । హీనబలునకుఁ దనయున్నచోన యునికి
కడుఁ బ్రమాదంబుగావున గాదు మనకు । సబలునకునైన నొప్పు నాసనగుణంబు ౧౫౧

క యానంబు గదలి పోవుట । గాన బలములేని మనకుఁ గాదదియుం బెం
పూనిన ద్వైధీభావము । ధీనిరతులు ధనసమృద్ధిఁ దీర్పఁగవలయున్ ౧౫౨

గీ చిరసమాశ్రయవర్తన స్థిరతఁ జేసి । శత్రువరులను గెలుచుట సంశ్రయంబు
తద్గుణంబులు దెలిసి యుద్దండరిపుల మూలమడఁచిన వారలు మున్నుగలరు ౧౫౩

క ఒడలికి నలజడియైనన్ । గడఁగి సమాశ్రయము నేన కావించెద ని
ప్పుడు వైరు లధికులైనన్ । దడఁబడ వెడ నాదుబుద్ధితాలిమి పేర్మిన్ ౧౫౪

క బలవంతులైన శత్రులఁ । బలువుర నేనియును బుద్ధిబలమున గెలువన్
వలనగు యాగార్థము ధూ । ర్తులచే విప్రుండు వంచితుండగుభంగిన్ ౧౫౫

వ అనినఁ గాకప్రభుం డతెఱం గెఱింగింపుమనినఁ బ్రధానాగ్ర గణ్యుండగు చిరంజీవి
యిట్లనియె ౧౫౬

సీ యజ్ఞార్థమను మ ధరామరుఁ డొక్కఁడు కొని యొకమేఁకపోఁతుఁ గొంచుఁ జనఁగఁ
దెరువున దుర్జనుల్ దృష్టించి తమలోన మోసవృత్తిముగాక మునిపటించుఁ
గడునిర్దయాత్ముండుగా సర్వవిప్రుండు వెఱవకహింస గావించు టెట్లు
గనుఁగొన్న మాకల్లఁ గనికరంబయ్యెడు దీనిఁజంపఁగ సమ్మతించుట కది
యనఁగనమ్మి చీంబోతుఁ దానచటఁగట్టి । యాతఁ డాచమనార్థమేయరుగఁ దడన
పరిధసంబునఁ జిబోతుఁ జంపితినిరి । బుద్ధిగలవారు గెలువనోపుదురు పరుల ౧౫౭

ఉ కావున నేను శాత్రవని కాయము గెల్చెద సాహసంబుతోఁ
నావచనంబునమ్ముఁడు మనంబున నింతయుఁ జింతదక్కనే
జీవముఁబాసినట్లు గతిచేడ్పడి యుండెద రక్తపూరముల్
జేవురుఁబాయగా నొడలఁ జప్పిలఁజల్లుఁడు చల్లి యత్తఱిన్ ౧౫౮

గీ మున్నుచన్నన కాకులమూఁకి నడుము । నన్నుఁబడవైచి తొలఁగి మున్నకచనుండు
నే సమాశ్రయమొనరించి మోసపుచ్చి । పత్తునసుటయు నామేఘువర్ణుఁ డపుడు ౧౫౯

గీ ఆచిరంజీవిఁ జప్పినయట్ల చేసి । తానుఁ దనవారలు నవ్వల లిరువుఁబాసి
తొలఁగి తనమంత్రిపన్నిన యిలఘుకార్య । మాత్మఁదలపోయుచుండె నయ్యవసరమున

ఉ పొంగినవేడ్కతోడ మునుపూర్వదిశాంగనఁ గూడియుంటి నా
సంగల రాగమెల్ల ననుకూలతఁజూపెదనంచుఁ బశ్చిమా

కాంగనఁ జేరనోయనఁగ నస్తగిరిన్ రవిచేరఁ గ్రుంకినన్
నింగియు నేలయుం దమము నెక్కొన దిక్కులఁ గప్పనొప్పఁగన్ ౧౬౧

వ. అయ్యంధకారంబునఁ జిరంజీవి తాను మున్నున్న వటమహీరుహంబు క్రింద మృతకాకమధ్యంబునం బడి రక్తంబునం దొప్పదోఁగి యీఁకలు విచ్చి నేత్రంబులు మూసికొని మృతిం బొందిన చందంబున డెందంబు గొందలం బడఁ బడుకొని యున్న సమయంబున నక్కడి నుపమర్దనుండు తన మంత్రులం గనుంగొని యిట్లనియె ౧౬౨

గీ. శత్రు నిశ్శేషముగఁ జేసి చంపకున్న । నొకఁడు దప్పిన మనకది యొప్పదండు
గాన వేగంబ యామట్టి కడకుఁ బోయి । వెదకి చంపుట కార్యము మీవేళ ననిన ౧౬౩

వ. అప్పలుకు లాకర్ణించి యమ్మంత్రు లేకవాక్యంబుగా నిట్లనిరి ౧౬౪

ఉ. దేవర నీతివాక్యము సుధీవిభవాఢ్యులు మెచ్చనాడితో
పోవుట మేలు నాఁగ దలిపోయి వటంబరికట్టి చుట్టునుం
గావలి వెట్టి వచ్చి యొకకాకముఁ గానక కాకులన్నియున్
జీవములం దొఱంగెనని చెప్పఁగఁ గ్రమ్మఱి పోవ నత్తఱిన్ ౧౬౫

వ. అవ్విధంబంతయు నెఱింగి చిరంజీవి తనలో నిట్లని తర్కించె ౧౬౬

గీ. మునసి చేయవలయు మొదల నుద్యోగంబు । చేసె నేని కార్యసిద్ధిఁ బొందఁ
జేయవలయుఁ గానఁ జేసెదనని చిరంజీవి నిశ్చయించి చింతదక్క ౧౬౭

వ. ఉన్న సమయంబున ౧౬౮

క. కాకంబులెల్ల మడిసెం గాకచ్చట నొకటియైనఁ గలిగినయెను మిక్
గాకారులరుగునంతట । నాకాకము కావుకావురని యొలిఁగింపన్ ౧౬౯

వ. ఇట్లు గూసిన చిరంజీవి కూఁత విని యులూకంబులు పోకమగిడి వచ్చి యవ్వాయసంబు వెదకి చిరంజీవిఁ బట్టుకొనిపోయి తమ యేలికకు నుపమర్దనుండటం బెట్టినఁ గనుంగొని యతండు నీ వెవ్వండవనిన నతండు నా పేరు చిరంజీవి యనుటయు నోరీ నీవు మేఘవర్ణునకుఁ బ్రధానాగ్రగణ్యుండ వేలెఱుంగున నిట్టివాఁడ వైతివనినఁ జిరంజీవి యతని కిట్లనియె ౧౭౦

సీ. అవధరింపుఁగు నన్ను నమ్మేఘవర్ణుండు దప్పక కార్యంబు చెప్పుమనిన
నుపమర్దభూపాలుఁ డుగ్రుండు సాహసి యధిక బలప్రతాపాన్వితుండు
పరిగునమున మేగి శరణంబు చొచ్చిన నతఁడు నీ కంతయు హితమొనర్చు
నని బుద్ధి చెప్పిన నతని చిత్తము ఱెంగి యనుచరవర్గంబు లాగ్రహించి
యోరి పగవారిపక్షమై నోరకొలఁది । నోడవిలువదినఁ జేటగుఁ గుడువుమనుచుఁ
జరణఘాతంబులను మేను చదిచి మట్టి । చంచుపుటములఁ గఱచి నొప్పించిరనిన ౧౭౧

క. దిగవిడువక ప్రాణంబులు । దగ నాకంఠమున నిలిచి తల్లడపడుచెన్
దగ నడవుఁడు మీఁదైనను । సుగతికిఁ జను నట్టిభంగి చొప్పడ నన్నన్ ౧౯౨

వ. అనుటయు నుపమర్దుండు రక్తాక్షుండు మొదలయిన తనయమాత్యులం గనుంగొని యిఁక నేమి సేయుదుమనిన నందు రక్తాక్షుండిట్లనియె ౧౯౩

ఉ. ఈతఁడసాధ్యశత్రుఁడని యించుకయున్ మతిలేక వినిదు
ర్నీతిఁ గృపాకటాక్షమున నిల్పఁగఁ జూచెదుగాని మీఁదన
న్యాతురిలం బ్రమాదమని యాత్మ నెఱుంగవు వినియున్నయీ
రీతి నిజంబుగాదు ప్రవహింపఁడు పంపుఁడు కాలుఁ బోలికిన్ ౧౯౪

గీ. ఏఁడకాఁడు హీనవిమతుఁడైనను నొచ్చి । చిక్కినపుడె వేగఁ జెఱుపవలయు
గరుణఁ గాచెనేని కాలాంతరంబునఁ । బ్రతిఘటించి వాఁడె పగయడంచు ౧౯౫

వ. అనుటయు నుపమర్దనుండు క్రూరాక్షుండను తనయమాత్యు నడిగిన నతండిట్లనియె

క. శరణము చొచ్చినవానికిఁ । బరిమార్పఁ దలఁచుట యధికపాపంబనుచున్
బొరిఁ జెప్పు ధర్మశాస్త్రము । పరమకృపం గావు వీనిఁ బక్షికులేంద్రా ౧౯౭

వ. అనిన నతండు దీప్తాక్షుండను నమాత్యుం గనుంగొని నీమదిం దోఁచిన కార్యంబు చెప్పుమనిన నతండిట్లనియె ౧౯౮

చ. అనఘ యెఱుంగవే యెందు శరణాగతుఁ జంపినచోటు దప్పఁగా
వినవె కపోతముల్ శరణు వేఁడిన నాత్మశరీరమాంసమున్
గొనుమని బోయకిచ్చె శిబి కీర్తిగ విన్నది చెప్ప నేల యొ
ప్పును నను వైశ్యచోరులకుఁ బుట్టినవాదము చిత్తగింపుమా ౧౯౯

వ. అనుటయుఁ దత్కథాక్రమం బెట్టిదనిన నుపమర్దున కతండిట్లనియె ౨౦౦

ఉ. మున్నొకపట్టణంబునఁ బ్రమోదముననన్ ధనగుప్తనామ సం
పన్నుఁడు వైశ్యుఁడుండు నొకభామిని వానికిఁ జంద్రరేఖ నా
నెన్నికకెక్కి యొప్పుఁ గమలేక్షణ రూపవిలాసవిభ్రమో
త్పన్నవయోవిభాసి కులభామలయొప్పుఁ దృణీకరింపుచున్ ౨౦౧

గీ. మెలఁగు నా సతి దనపతి మిగుల వృద్ధుఁ । గాన నెన్నఁడు నొల్లక కదియనీక
యున్నయెడఁ జోరుఁ డొకఁడు వారున్న యిల్లుఁ । గన్నమిడి చొచ్చి ధనమున్నకందు వరయ

వ. ఆచోరుండు నలుదిక్కులం బరికించుచుండ నప్పుడు నర్ఘ్యమణికనకభూషణాలంకృతయై మృదుతల్పంబునం దనపురుషునొద్దఁ బరాఙ్ముఖియై నిద్రించు నంగనాతిలకంబుఁ జూడఁగని నాకు నితనిమందిరంబున ధనంబు వెదకనేల యివ్విభూషణంబులలోన నొక్కతొడవు నాకుఁ జేపడిన నంతియు చాలునని దీప్తజ్వాలాజాలంబులకుం దగిన

తదీయాభరణకాంతు లినుమడింప నక్కాంబుకంఠికంఠాభరణం బపహరింపం గరంబు
చాఁచిన ౧౦౩

క తొడిగిన తొడవులదీప్తులు । తొడిఁబడి చీఁకట్లు దూలఁదూలఁగఁ దనపైఁ
దొడరినహస్తము సోఁకనఁ । బడఁతుక మేల్కాంచి చూచి భయకంపితయై ౧౦౪

వ తనజీవితేశ్వరుండున్న దిక్కునకభిముఖియై ౧౦౫

సీ కరికుంభములకంటెఁ గడుసైన చనుదోయి యుగ్గలి బిగియార నొత్తియొత్తి
బిసకాండములకంటెఁ బసమించు కరముల నతివ యంతంతకు నలమియలమి
పల్లవంబులకంటెఁ బాగైన కెంగేల లలితాంగి యల్లన తెలిపి తెలిపి
పికనాదమునకంటెఁ బెంపారు నెలుఁగున బింబోష్ఠి పలుమారు పిలిచిపిలిచి
తెలుపునంతట మేల్కని తెలివినొంది। తనకుఁ బ్రియకాంత చేసిన ధన్యతవును
మేను పులకాంకురంబుల నీనుచుండ। నొలసి సౌఖ్యాంబునిధిలోన నోలలాడి ౧౦౬

వ ఆవైశ్యుండు కొండొకసేపున కాకుటిలకుంతల కట్లనియె ౧౦౭

క ఏకాలంబున వెనుకను । నీకౌఁగిలి నాకు నబ్బనేరదు భాగ్యం
బోకాంత నేఁడు గలిగెను । మేకొనుటకు దీని నిమిత్తము చెపుమ ౧౦౮

వ అనిన నయ్యింతి భయముకతనం బలుకక నిజకటాక్షవీక్షణంబులం గరాభినయ
సంజ్ఞాభావంబులం దెలుపం దెలియక యీలేమ యిటుసేయుటకుఁ గతంబెయ్యది
యని నలుదిక్కులం గనుంగొని నప్పుడు తనవెనుకదిక్కున నొదిగియున్న చోరునిం
గనుంగొని యిట్లనియె ౧౦౯

ఉ ఈరమణీలలామ నను నెప్పుడు వృద్ధుఁడటంచు నగ్గలం
జేరదు నేఁడు నిన్నుఁగని చెందినభీతిని గౌఁగిలించుటన్
హారివిశేషసౌఖ్యములనంది కృతార్థుఁడనైతిఁ గావునన్
నారుచిరార్థసంపద గొనందగు నిచ్చెదఁ బుచ్చుకొమ్మనా ౧౧౦

వ అనినఁ జోరుండిట్లనియె ౧౧౧

చ కలధనమెల్ల దేవుకొని గ్రక్కునఁ బోయెదనంచు వచ్చి నీ
యలఘు మృదూక్తులన్నను హర్షముఁ జేయుట వర్ధముల్లను
గ్గలి విను నేఁటియట్లితనిఁ గౌఁగిటఁ జేర్చి రమింపకున్న నన్
దలఁచిన వేళవచ్చి మొగ్గతిప్పక గ్రమింగుగు నంగిటంబడెక్ ౧౧౨

వ అనిన వైశ్యుం డతనికిట్లనియె ౧౧౩

క ఉపకారంబునకును బ్ర । త్యుపకారము సేయకుంట యుచితమె నీకీ
యపరిమితార్థముఁ గొనిచను । నెపమేమియుఁ బలుకకను మిం నిలయమునందున్

వ. తనకుంగలిగిన ధనంబంతయు నతని యుండటం బెట్టి నీవేమియుం బెనంగక కొనిపొమ్ము
నిన నతండేమియు నొల్లక నన్నీ పక్షంబు తుదిముట్టం జూడుమనుచు నేమియు
ముట్టక చనియెఁ జోరవ్యవహారంబు జీవనంబుగా నొడిగట్టినయతండును నవ్వైశ్యునికి
నుపకారంబు చేసిపోయెంగావున నీవును నీవాయసంబువలనఁ గృపగలుగవలయు నని
నుపమర్దకుండు వక్రనాసుండను మంత్రిం జూచి నీతలంపునుం జెప్పుమనుటయు
నతం డిట్లనియె ౧౯౫

క. వెగిచంపరాదు కాకముఁ । బగతురు దమలో విరోధపడిరని శుభం
బగు మన కొకరాక్షసు గో । యుగచోరుల కథ వినంగ నొప్పగుఁ దెలియన్

వ. అనినఁ దత్కథాక్రమం బెట్టిదని యుపమర్దుండడిగిన నావక్రనాసుం డిట్లనియె

చ. ఘనమగు నగ్రహారమునఁ గర్యవిదుం డొక బ్రాహ్మణుండు పా
వనచరితుండు గోవులఁ బ్రవర్ధన మొందఁగ రెంటి మేపఁగాఁ
గనుఁగొని తాఁ బ్రమోదమునఁ గైకొనఁగాఁ దతిఁ జేచియుండు క్రమ్ము
చ్చనిశము నొక్కనాఁ డొక మహానిశి నొక్కఁడుఁ బోవుచుండఁగన్ ౧౯౮

గీ. మొగులు వన్నెపుఁ జనుకతో యుసురుకొను చుట్టమీఁదఁ జీఁకటి దట్టమై మెండుకొనుచు
మనుజవిగ్రహశోభను నిశా మధ్యమగుటఁ బొదలు మనమున నాదొంగ పోయిపోయి

సీ. ఎదురుగా నొక్కరుఁ డేగుదెంచిన వానిఁ దరలక చోరుండు దాఁకి బెదరి
యెవ్వండవనుటయు నే బ్రహ్మరాక్షసుఁడను నన్నుఁ దాఁకిన ఘనుఁడవైన
నీ వెవ్వఁడనుటయు నే ముచ్చుఁ బొమ్మన నింత ప్రొద్దెచ్చటి కేగెదనిన
నీ పురిలోన మహీసురోత్తము ధేనువులు రెండు మంచివి గలుగఁ జూచి
యుపహరించుకొనుటకు నరిగెద నేనన్న । నేను నతనిఁ బట్టని పుడువత్తు
నమ్మటంచుఁ గదలి బ్రహ్మరాక్షసుఁడును । నతఁడు నంతఁ గూడి యతని గృహము ౨౦౦

వ. కడియంబోయి యమ్మహీదేవు గృహద్వారంబునొద్ద నిలిచి చోరునిం జూచి బ్రహ్మ
రాక్షసుం డిట్లనియె ౨౦౧

గీ. ఏను మున్ను పోయి యీయింటి విప్రునిఁ । బట్టి భుక్తనాకుఁ బెట్టఁ జూచి
పదప నీవుఁ గదిసి మొదవులఁ దోడ్కొని । చనిన నతని మాట కాగ్రహించి ౨౦౨

వ. చోరుం డిట్లనియె ౨౦౩

క. తొలుత నీవు విప్రుఁ దలిపిన మఱి నాకుఁ । బట్టనెట్లు వచ్చుఁ బశుయుగంబు
వారు నతని పొరుగువారును మేల్కన్నఁ । బా గలసియుండుఁ బసులవిడిచి ౨౦౪

వ. అని మఱియు నిట్లనియె ౨౦౫

మా ర య క వి

ఇతఁడు మైరావణచరిత్రమును పద్యకావ్యముగా రచియించెను. ఈకవి నియోగిబ్రాహ్మణుఁడు, సర్వయామాత్యునికుమారుఁడు. అక్కడక్కడ వ్యాకరణదోషములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతనికవిత్వము మృదువయి మనోహరముగానున్నది. కవనధోరణి తేటపడుటకయి మైరావణచరిత్రములోని రెండు మూఁడు పద్యముల నిందుదాహరించుచున్నాను —

ఉ. చెప్పఁగరానిమాయల విచిత్రపురూపులుదాల్చి యింక వాఁ
డెప్పుడువచ్చునోయిటకు నేమరియుండినఁ గార్యమంతయుం
దప్పునుగాన రాఘవులు తద్దయుఁగాంచువిధంబు గొబ్బునన్
జొప్పడఁ జెప్పుఁడీతెలియ సూనృతవర్తనులార నావుడున్ —ఆ ౧

ఉ. మారునిమోహనాంబకముమాడ్కిని బ్రాణములైదునున్నబం
గారపుబొమ్మరీతిఁ దొలుకారుమెఱుంగులబ్రోకభంగి శృం
గారరసంబునం దొలఁకఁగట్టిన పువ్వులయొత్తురీతి న
న్నీరజగంధివచ్చి తగనిల్చెను బ్రీతిని భర్తముందటన్ —ఆ ౧

చ. దనుజ దురాత్మ నీకునిఁకఁ దస్కరవృత్తినిజొచ్చి మాయలన్
దినకరవంశ్యులం దొడరితెచ్చినపద్ధతిఁబోవరాదు నా.
ఘనతరవాలరోమమునఁ గట్టి జగంబులుమెచ్చ నిన్ను న
య్యనిమిషులెల్ల భీతినిట కడ్డమువచ్చినఁ గావఁ జంపెదన్ —ఆ ౨

వేల్పూరి - వేంకటేశ్వరకవి.

ఇతఁడు గోవ్యాఘ్రచరిత్రమును, విచిత్రరామాయణమును, పద్యకావ్యములుగా రచియించెను. ఈతఁడు నియోగిబ్రాహ్మణుఁడు, మౌద్గల్య గోత్రుఁడు, బ్రహ్మనామాత్య పుత్రుఁడు. ఈతని నివాసస్థలము విశాఖపట్టణమండలములోని విజయనగరసంస్థానము నందలి రావివల్సయను గ్రామము. కవి ౧౮౪౧ వ సంవత్సరమున స్వర్గస్థుఁడయినందున, దాదాపుగా నిప్పటి కేఁబదిసంవత్సరములక్రిందట నుండినవాఁడు. అక్కడక్కడ వ్యాకరణవిరుద్ధములైన ప్రయోగములు కానఁబడుచున్నను, మొత్తముమీఁద నీతని కవిత్వము మృదువయి శ్రావ్యముగానున్నది. కవికృతములైన రెండు కృతుల నుండియుఁ గొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

గోవ్యాఘ్రము చరిత్రము

చ మధుకరపంక్తి ఝుంకృతులు మత్తమయూరనిశాతషడ్జముల్
పృథుతరకోకిలధ్వనులుఁ బెంపలరారు శుకప్రసంగముల్
శిథిలముగాని శారికల చిందఱ వందఱచే వనాళిఁ బెం
పొదవఁగ నొప్పెఁ బుష్పమధురోజ్జ్వలసత్ఫలసంకులంబులై

ఉ సంతతిలేక డెందమునఁ జాలఁగ డస్సి వ్రతోపవాసముల్
సంతతమేనొనర్చి కడుసంతసమొప్పఁగ వేల్పుటేండ్ల మ
త్స్వాంతమునందునిల్పి హిమశైలసుతేశ్వరు నిందుమౌళి న
త్యంత సుభక్తిఁగొల్చి నుతు నంచితవేడ్కఁ ఫలించఁగాంచితిన్

విచిత్ర రామాయణము.

ఉ మామ యిదేటిమాట వినుమా మనమాఱడిఁజెందె నింక నా
సామిపదంబులాన కొనసాగదు తొల్లిటిభంగి దానవ
గ్రామణియింటనున్న జనకప్రభుకూఁతురి నేలుకొంట కా
రామునకొప్పె నొప్పదనరాదు ప్రభుత్వముగల్గువారలన్ — అ ౧

ఉ పుట్టి జగంబులోనఁగల భూసురుల న్మునులన్ నృపాలురన్
బట్టివధించి వజ్రధరుపాలికి నేగి సుపర్వకోటులం
గొట్టి సమస్తలోకములకున్ ములుసూపెనతండు నారదుం
డట్టితఱి న్వికుంఠపురమందు మురారిని జేరి యిట్లనెన్ — అ ౨

చ కళుకులుదేరు బల్మిసిమికాంచన రత్నమయూఖముల్ దిశా
వలయముఁ బర్వ నచ్చరలు వైభవలీల నటింపఁ గిన్నరుల్
బలసి రథంబుచుట్టును సభక్తిని గొల్వ సరోజబాంధవుం
డిల్లకరుడెంచెనో యన ధనేశుఁడురాఁగ వియన్నిరీక్షుఁడై — అ ౩

ఉ ఇచ్చి నృపాలుఁడిట్లనె మునీశ్వర నీకెదురాడినిల్వ నా
చిచ్చరకంటిసామికిని జెల్లదు నేననవెంత యీసుతుల్
సచ్చరితుల్ సురారు లతిసాహసు లాహవకోవిదుల్ కడుం
గుచ్చితు లస్త్రశస్త్రముల గోప్యమెఱింగినటింతు రెప్పుడున్ — అ ౪

మ ఎదిరిం దన్ను నెఱుంగలేక మదిలో నెవ్వాఁడు నిన్నిట్లు బె
ట్టిదుఁడై నాసయు వీనులుం దునిమె కారిన్యంబునన్మున్ను నేఁ
జెదరంజేసిన దేవదైత్యవరులం జింతింపఁడో చూడు మా
కదనత్మాస్థలిఁ గూల్తువానిఁ దెలియంగాఁ బల్కవే సోదరీ — అ ౫

మ శరసంధాన మొనర్చు ప్రౌఢిమయు లక్ష్యంబూహఁగావించు నే
ర్పురుబాహాబల విక్రమంబు సమరోద్యోగంబు సవ్యాపస
వ్యరిపుక్షీణమహాస్త్రపాతములు రౌద్రాకారముం గన్న నా
పౌరువుం బో వెఱపొందు నీసుఁడయినం బుత్రా నిజంబింతయున్ —ఆ ౬

ఈవిచిత్రరామాయణము గోపీనాథవిరచితాంధ్రవచనకావ్యము ననుసరించి యీకవిచేఁ బద్యరూపమునఁ జేయఁబడినది ఈవచనకావ్యము ననుసరించియే యిటీవల గోదావరీమండలస్థ వెలగుతుట్లు గ్రామనివాసియు నాపస్తంబసూత్రుఁడును శ్రీవత్సగోత్రుఁడును సుమానుహేశ్వరసూరిపుత్రుఁడునగు నరసింహదేవర వేంకటశాస్త్రియను వైదికకవియు నొకపద్యకావ్యమును రచియించియున్నాఁడు ఈవర్తమానకవిచే రచియింపఁబడిన విచిత్రరామాయణమునందును వ్యాకరణదుష్టములైన ప్రయోగము లనేకములు కానఁబడుచున్నను మొత్తముమీఁద నీతనిగ్రంథము మొదటి గ్రంథమునకంటె నధిక రసవంతముగానున్నది ఇందలి పద్యములనుగూడఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను —

ఉ రామ విరాజమానరిపురాజకరీటమణిప్రభాసుమ
స్తోమసుపూజితాంఘ్రి యఘుసూదన తారకనామ నీరద
శ్యామ సురేంద్రవందిత విశాలపరాక్రమకీర్తికామినీ
కామ కరోరరాత్రిచరకాండవిఖండన భండనప్రియా —బాల

ఉ తెల్లనిమేనివానిఁ గడు తియ్యనిమాటలవానిఁ గప్పుడాల్
చల్లెడు గొంతువానిఁ బులిచాలలతోలు బుజాలపైని రా
జిల్లఁగఁ జేయువానిఁ దెసచీరలనూనినవాని నెత్తిపైఁ
జల్లనివెల్గుఁ దాల్చినసామిని జూచి యహీంద్రుఁ డెంతయున్ —అయో

ఉ ఓసి యభాగ్యరాల పడియుండక యింట నిటేలవచ్చినా
వే సకలంబుఁ బోయె నినుఁ బెండలియాడినపూటనుండ యే
బ్రాసివి నీవు వేశ్మమునఁ బాదము పెట్టిలి వంతకంతకుం
గాసాకపైన బట్టకొనఁగట్టఁగలే దిఁక లేచిపోఁగదే —అరణ్య

శా ఆకంఠీరవనాదమున్విని మహాహంకారసంయుక్తుఁడై
నాకేశాత్మజుఁ డాహవంబునకు సన్నాహంబుతో నేగి నే
నాకయ్యంబున నింద్రపుత్రకసహాయార్థంబు శాఖామృగా
నీకంబుల్గొలువంగ వెంటఁజనితిన్ స్నేహంబు పెంపొంపఁగన్ —కిష్కింధ

ఉ ఎవ్వఁడవోరి యేమిపనికిచ్చటవచ్చితి నిల్వునిల్వు నీ
క్రొవ్వడఁగించి ప్రొద్దుకొమరుండు వసించినటెంకకంపెదన్
మువ్వపు దెబ్బఁజూడుమని మారుతివక్షమునందు మోఁదె నీ
వెవ్వతెవంచు గ్రుద్ది పడనీడ్చె సమీరసుతుండు రక్కసిన్ —సుందర

శా ఏమీ దానవవీరులార యమ వహ్నీంద్రాదులన్ గెల్చు సం
గ్రామోత్సాహము లెందుఁబోయెఁ బటుదర్పంబేటికిం గాల్పనా
మీమీయిమ్ములకేగియుంటి రిదియేమీ వైరితేజంబు మీ
సామర్థ్యంబును విక్రమక్రమరణోత్సాహంబులం దెల్పఁగన్ --యుద్ధ

ఓగిరాల - జగన్నాథకవి

ఈకవి సుమనోమనోరంజనమనుపేర నైదుల్లాసముల ప్రబంధమును రచియించెను ఈతఁడారువేల నియోగిబ్రాహ్మణుఁడు, గోదావరీ మండలములోని నీలపల్లెగ్రామ నివాసుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, భారద్వాజగోత్రుఁడు, వేంకటేశ్వరామాత్యపుత్రుఁడు ఇతఁడు తన చరమదశయందు కాకినాడపురమునందుండి సుధీరంజనియను మాసపత్రిక కధిపతియయి సుమారు పదునేను సంవత్సరముల క్రిందట లోకాంతర గతుఁడయ్యెను ఈయనయు నీయన పెదతండ్రి కుమారుఁడైన రంగనాథకవియు మఱికొందఱును సుప్రసిద్ధులైన శ్రీమంత్రిప్రెగడ వేంకటరామపంతులవారియొద్ద లక్షణ గ్రంథములను జదివి మంచి కవీశ్వరులైరి శ్రీమదోగిరాల రంగనాథకవిని గూర్చి యీజగన్నాథకవి తన సుమనోమనోభిరంజనమునందిట్లు వ్రాసియున్నాఁడు—

గీ వారిలో రంగనాథుండు పండితోప
లాల్యమాన నవీనకల్యాణకల్ప
వల్లికా ముఖ్యరసవత్ప్రబంధరాజ
కల్పనాదక్షుఁడై ఘనఖ్యాతి మెఱసె

ఈరంగనాథకవి జగన్నాథకవికంటెను సమర్థతరుఁడనియు నధిక లక్షణవేత్తయనియుఁ బేరువడసినను, ఇతఁడు చేసినగ్రంథము లేవియు ముద్రింపఁ బడకుండుట శోచనీయముగా నున్నది ఏతత్కవికృతమైన ద్విరేఫదర్పణ మిప్పుడముద్రిత గ్రంథ చింతామణియందు ప్రకటింపఁబడుచున్నది

జగన్నాథకవి తనప్రబంధమును ౧౮౭౪వ సంవత్సరమునందు ముద్రింపించినను, ఆపఱకతఁడు ముప్పదియైదు సంవత్సరముల క్రిందటనే దానిని ముగించి యుండెను ౧౮౭౯వ సంవత్సరమున నేను పాఠశాలలోఁ జదువుకొనుచుండిన కాలములో సుమనోమనోభిరంజనములోని మొదటి మూడాశ్వాసములను వ్రాసికొనియున్నాను అయినను కవి యీముప్పదిసంవత్సరములలోను గ్రంథమునకు మెఱుఁగుపెట్టి సంస్కరించి యెక్కుడువన్నె తెచ్చెను. ఈగ్రంథమును సర్వకళాశాలాధ్యక్షులు పట్టపరీక్షకుఁ బఠనీయ గ్రంథమునుగా ననేకపర్యాయములు నిర్ణయించి యుండుటచేతనే దాని

ప్రాశస్త్యము వెల్లడియగుచున్నది కవిత్వము రసవంతమయి నిర్దుష్టమయి యనర్గళధార కలదిగానున్నది కవనరీతి తెలియుటకయి సుమనోమనోభిరంజనములోని పద్యములఁ గొన్నిటి నిందుదాహరించుచున్నాను —

మ నిరతాన్యోన్య మనస్సముద్భవ సపత్నీవైరమూలాపనో
దరతిన్ గొబ్బునఁ జిత్రభానునకుఁ దత్రత్యాహిరాట్ఫాయికిన్
సరవిన్ స్వస్థితుల న్వచించుకొన నిచ్చంబోవు మార్తాండ జాం
బర శైవాలినులో యనందగుఁ బురద్వార్శ్నీల హీరప్రభల్ —ఉ ౧

ఉ చందురునందుఁ గల్గురుచి సంపెగతావియుఁ బారిజాత మా
రందమునందుఁ గూరిచి హిరణ్యపరాగచయంబు చల్లుచున్
బొందుగమేళవించి మెఱుపుందళుకుల్ పయిఁబూసి యాశతా
నందుఁడు నేర్పుమీఱ జతనంబుగఁ జేయఁగఁబోలు నాసతిన్ —ఉ ౨

చ చిలుకహుమావజీరనుకృషీవలుఁ డంగనచిత్తవప్రమున్
జలజకలంబలాంగలమునన్ దళినం బొనరించి కృష్ణను
జ్జ్వలగుణ బీజమంటి యతిబంధురరాగరసంబునింపఁ గో
మల సుమనోరథాంకుర మమందముగా జనియించి మించెడున్ —ఉ ౩

చ అరిదరపాణియాననమునం దపదాతమ్మదూర్ధ్వ పుండ్రకాం
తరవరవర్ణినీమృదులనవ్యపరాగవిధీయమానసుం
దరతిరచిత్రకద్యుతి గనంగ మసారమణీధరాధరో
పరిశరదభ్రమధ్యతలభాసితటిల్లతరీతి నొప్పెడున్ - ఉల్లా ౪

చ కలువలరాచరాదొనలు గార్కొనువెన్నెలచేఁ గరంగఁగాఁ
దొలఁకుజలప్రవాహ ములు దొరపుఁగ్రొవ్విరితేనెసోనలం
గలయుచు సర్వతోముఖముగా నెలఁ బర్వను గానఁ గాన ని
తలగుణసౌరభంబులకుఁ దావలమై తనరారు మాధవా —ఉ ౫

మాడభూషి - వేంకటాచార్యకవి

ఈవిద్వత్కవి భరతాభ్యుదయమనెడి నాలుగాశ్వాసముల ప్రబంధమును రచియించెను ఇతఁడు శ్రీవైష్ణవ బ్రాహ్మణుఁడు, నైధ్రువ కాశ్యపాన్వయుఁడు, నృసింహాచార్యనందనుఁడు ఇతఁడు సంస్కృతాంధ్రములయం దత్యంత పాండిత్యము గలవాఁడయి, శతలేఖినీ పద్యసంధాన సామర్థ్యమును అష్టావధాన నైపుణియు వ్యస్తాక్షరీ

కౌశలమును గలవాఁడయి యుండెను. ఈకవి గోదావరీ మండలములోని పెంటపాడు గ్రామనివాసియై కృష్ణా మండలములోని నూజవీడు సంస్థానమునందు చిరకాలముండి విద్వానభినవ పండిత రాయాది బిరుదాంకముల నందినవాఁడు. చిన్నతనమునం దీయన ధారణాశక్తి యత్యద్భుతమైనదిగా నుండెను. అప్పుడితఁడు ద్విసంధాగ్రాహి యగుటయే కాక రెండుమాఱులు చదివిన పద్యమును తలక్రిందుగా నొప్పగించుటకును నెనిమిది భాషలలో వ్యస్తాక్షరి చెప్పుటకును సమర్థుఁడయి యుండెను. ఈయన రెండు సంవత్సరముల క్రిందట వైకుంఠపదస్థుఁ డయ్యెను. ఈయనకవిత్వము నిర్దుష్టమయి మధురమయి శ్రావ్యముగానున్నది. కవిత్వరీతి భరతాభ్యుదయములోని యీక్రింది పద్యముల వలనఁ గొంతవఱకు తేటపడవచ్చును —

చ. పిలిచిన నుత్తరంబిడదు పిల్వనిదే యి దవత్తునంచుఁ దాఁ
బలుకును బల్కరించు చెలిపై నలుగున్ నలుదిక్కులార్తితోఁ
బలుమఱుఁ జూచు మస్తకము వంచు వెండలయూఁచు నాశనం
బెల ధరణీపురందర గలస్వకమానసద్వృత్తియై — ఆ ౧

ఉ. చానలు గాంచిరొక్కెడ పసారమసారమణిప్రణీతస
పానపరంపరాసిలవిభాపటలంబు తదంతరుల్లస
త్సూనలతాప్రదత్తనవదోహదఘుమవిలీలఁ దోఁపసు
శ్రీనలరారు చారుసరసీరుహగంధామశిరోలలామమున్ — ఆ ౨

ఉ. కాంచి తెనూత యీమృగము గంబముఁ ద్రిప్ప రథంబుసారథుం
గాంచుచుఁ బోవుచు న్విశిఖఘాతభయంబునఁ బూర్వకాయముక్
వంచి నగంబు మేసినతృణంబు శ్రమంబున నేలవ్రాలఁగా
నించుక యుర్విఁ జాల దవి నేగెడు నందక గంతువేయుచున్ — ఆ ౩

చ. వనితలు పుట్టినింట బహువర్షములుండఁగ రాదు భర్తతో
ననిశయె యుత్తమం బదియటుండఁగ నిష్ఠు సమస్తరాజసో
భనముకుటార్చితాంఘ్రియగు పార్థివశేఖరు ధర్మపత్నివై
య్యు నిటులు బీదరాలివల నుండఁగ నేల సతీశిరోమణీ — ఆ ౪

మండపాక - పార్వతీశ్వరకవి

ఈవిద్వత్కవి శతకములు మొదలైనవి యనుబది గ్రంథములవఱకును రచియించినను, ఈయనచే రచియింపఁబడి ముద్రింపఁబడియున్న గ్రంథములలో శ్రీరాధాకృష్ణ

సంవాదమను నాలుగాశ్వాసముల ప్రబంధము ప్రధానమైనదిగానున్నది ఈయన వైదిక బ్రాహ్మణుఁడు, పారాశరగోత్రుఁడు, కామేశ్వర పండితపుత్రుఁడు ఈకవియొక్క తండ్రితాతలు కూడ కవీశ్వరులయినట్టు రాధాకృష్ణసంవాదమునందు కవియీక్రిందిపద్యమునఁ జెప్పియున్నాఁడు—

సీ. శ్రీమీఱనుభయభాషామిశ్రసత్కృతుల్ లెక్కలెన్న నదంకితములుచేసి
యశముఁగాంచిన పేరయ మనీష మణికిఁ బౌత్రత్వంబుఁ గార్తిక ప్రలిమహాత్మ్య
శివమహాత్మ్యాద్యనేకవిధప్రబంధంబు లొనరించి సత్కవివినుతిఁగనిన
పారాశరసగోత్ర పావనుండగు మండపాక కామేశ్వరపండితునకు
సుహిత పుత్రత్వమును గాంచి బహువిచిత్ర
చిత్రశైలిముఖ్య సత్కృతుల్ చెప్ప మెప్పు
వడసిలివిగడ కులకీర్తి వర్ధిలంగ
సరసగుణసాంద్ర పార్వతీశ్వర కవీంద్ర

ఈకవి విశాఖపట్టణ మండలములోని బొబ్బిలి సంస్థానమం దాస్థాన కవీశ్వరులలో నొకఁడుగా నుండినవాఁడు ఈపార్వతీశ్వర శాస్త్రిగారు ౧౨౩౩వ సంవత్సరమునందు జననమొంది ౧౨౯౯వ సంవత్సర మధ్యమున పరమపదము నొందిరి ఈకవి సంస్కృతాంధ్రములయందు మంచిపాండిత్యము గలవాఁడయి మృదుమధురనిర్గళధారతోఁ జతుర్విధ కవిత్వమును జెప్పఁజాలువాఁడయి వినయ సౌశీల్యాది గుణసంపత్తి గల వాఁడయియుండెను పూర్వోక్తమయిన రాధాకృష్ణసంవాదము రావువారను నామాంతరముగల వెలుగోటివారనెడి గృహనామముచే వెలయు శ్రీవేంకటగిరిసంస్థానాధిపతుల వంశానుక్రమమును వర్ణించెడు గ్రంథము శతకములును దండకములును గాక యీకవి రచియించిన గ్రంథములలో కాంచీపురమహాత్మ్యము అమరుకకావ్యము, ప్రబంధ సంబంధబంధ నిబంధనగ్రంథము, శ్రీకృష్ణాభ్యుదయము, కొంతపెద్దవి ఇప్పుడీయన గ్రంథములలో నొక్క రాధాకృష్ణసంవాదమునుండి మాత్రము కొన్ని పద్యముల నిందుదాహరించుచున్నాను—

శా. సాంగోపాంగముగా నితం డఖిలవిద్యల్ నేర్చినాఁ డోర్చినాఁ
డంగీకారము నింతవట్టు మృదుగర్వం బేర్చినాఁ డేర్చినాఁ
డంగారప్రతిమాస్త్రిపంక్తి నరిసైన్యారణ్య మిట్లయ్యు నే
సాంగత్యంబుననో వృథాకపటభాషం దీర్చినాఁ డిత్తఱిన్ —ఆ ౧

ఉ. వ్రాయఁడు లెక్కలొక్కటిగ రంగడరంగ మెఱుంగు పూఁతలన్
బూయఁడు భిత్తిభాగముల ముఖ్యవిధానములందు మందతం

బాయఁడు బాంధవాదులగువారికిఁ జేయఁగలట్టి సత్కృతుల్
చేయుఁడు వేఱె మీకిపుడు చెప్పఁగ నేటికి మీరెఱుంగరే — ఆ ౨

మ తనభూలోకధురంధరత్వ మిపుడేతద్రాజగోపాలకృ
ష్ణనరేంద్రుండు వహించె నాకభరమైనంబూనుదుంగాక యం
చు నృపానుజ్ఞను గోరవచ్చినఫణీశుండో తదేకేచ్ఛవ
చ్చినప్రాకృచ్ఛపమో యనందనరెఁ దచ్ఛ్వేతాతపత్రంబటన్ — ఆ ౩

ఉ తత్పురభర్త పుట్టినకతమ్మునఁ బ్రాభవమొందివోలె నం
దుత్సవమయ్యె నింకసురలుండఁగ నేటికిఁ బొండటంచు నం
చత్సమధన్వనిం గసరుజాడగనంబడెఁ దా మ్రుచూడముల్
తత్సమయంబునన్ మెఱసెఁ దామరసప్రతిమానలోచనా — ఆ ౪

మాడభూషి - నృసింహాచార్యుఁడు

ఈకవి వల్లవీపల్లవోల్లాసమను మాఁడాశ్వాసముల ప్రబంధమును నూజవీడు సంస్థానాధిపతియగు శ్రీశోభనాద్రి అప్పారావుగారి ప్రేరణమువలన రచియించెను. ఇతఁడు శ్రీవైష్ణవ బ్రాహ్మణుఁడు, నైధ్రువకాశ్యప గోత్రుఁడు, ఆపస్తంబసూత్రుఁడు, వేదాంతాచార్యులపుత్రుఁడు. ఈకవి యిరువదిముప్పది సంవత్సరముల క్రిందట నుండినవాఁడు. ఈయనకవిత్వము సలక్షణమయి నాతికఠినమయి శ్రావ్యముగానున్నది. వల్లవీ పల్లవోల్లాసములోని రెండుపద్యముల నిందుదాహరించుచున్నాను—

చ తనయులు పెక్కుగల్గినను ధన్వికిఁ బుత్రిక పుట్టకున్న ని
త్తనువు నిరర్థకంబని యెదందలపోయుదు రింతులంచుఁ దా
మనమునఁ గొంతసేపు నృపమానిని చింతయొనర్చి యేమి సా
ధనమునఁ గన్యకావదనదర్శనజన్యముదంబు గల్గునో — ఆ ౧

ఉ పాండుతనూభవుండు తనబాంధవు లత్తఱి సంతసిల్లఁగా
గాండివ మేత్తెఅందిగిచి కల్పకృశానుసమానుఁడై లస
త్కాండముల న్నిగిడ్చి నృపకాండములం దెగటార్చి వేచ్చి త
త్కాండమునన్ ముదంబెసఁగఁ దద్దయు నొత్తెను దేవదత్తమున్ — ఆ ౩